ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 75 పేజీలు: 12 వెల: 6.50

4 నెలల్లోనే 85 వేల వీసాలు జారీచేసిన చైనా!
వక్ఫ్‌చట్టంపై దాఖలయిన పిటిషన్ల విచారణ షురూ!
9లో

## 'సుప్రీం' చీఫ్‌జస్టిస్‌గా బిఆర్ గవాయి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవుతున్నారు. ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా పదవీకాలం వచ్చేనెల 13వ తేదీతో పూర్తి కావస్తుండటంతో బిఆర్‌గవాయిపేరును ఖన్నా ప్రభుత్వానికి సిఫారసుచేసారు. దీనితో దేశ అత్యున్నత న్యాయస్థానానికి రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తిగా గవాయి నియమితులవుతున్నారు. 1960 నవంబరు 24వ తేదీ జన్మించిన జస్టిస్ గవాయి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి రామకృష్ణ సూర్యభాన్ గవాయి అంబేద్కర్ భావజాలం ఉన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు. మహారాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసారు. 1964 నుంచి 1998వరకూ కూడా ఆయన ఆర్‌పిఐనుంచి లోక్‌సభకు అమ్రావతి నియోజకవర్గంనుంచి ఎన్నికయ్యారు.

బీహార్, సిక్కిం, కేరళ రాష్ట్రాల గవర్నర్‌గా కూడా పనిచేసారు. 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ అధికారంలోకి వచ్చింది. ఆయన సోదరుడు డాక్టర్ రాజేంద్ర గవాయి కూడా 2009లో రామ్‌దాస్ అథవాలేతో కలిసి పనిచేసారు. అయితే ఇద్దరిమధ్య తేడాలు రావడంతో గవాయి కూటమి ఒకటి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్‌తో పొత్తులు కుదుర్చుకుంది. ఇక జస్టిస్ గవాయి పరంగాచూస్తే 1985లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా పనిచేసారు. 2003 నవంబరు 14వ తేదీ బాంబే హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 16 ఏళ్లపాటు జడ్జిగా పనిచేసిన తర్వాత సుప్రీం కోర్టుకు పదోన్నతి పొందారు. ఆయన పేరును ఆనాటి సిజెఐ రంజన్ గగోయ్ ఆధ్వర్యంలోని కొల్లిజియం 2019లో ప్రతిపాదించారు. ఇపుడు కొత్తగా సిజెఐగా బాధ్యతలు స్వీకరించే గవాయి మే 14నుంచి 2025 నవంబరు 24వరకూ మాత్రమే పని >>2

# 15% ఆర్థిక వృద్ధి లక్ష్యం

### • 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌తో సిఎం చంద్రబాబు భేటీ • రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు • రాష్ట్ర స్థితిగతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం 15శాతం గ్రోత్‌రేట్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం 10 నెలలుగా తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించామని సిఎం అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని... దృఢమైన నిర్ణయాలతో, ఉత్తమ పాలసీలతో పాలన సాగిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని సిఎం అన్నారు. రాజధాని లేకపోవడం వల్ల రెవెన్యూ జనరేషన్‌కు అనేక సమస్యలు ఉన్నాయని సిఎం వివరించారు. ఈ కారణంగానే ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

2019 తరువాత నాటి ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సీఎం వివరించారు. గత 10 నెలల కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు ప్రజెంటేషన్ ద్వారా సిఎం వివరించారు. గత 5 ఏళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం అందించాలని కోరిన సిఎం..రాష్ట్రంలో నెలకొన్ని ప్రత్యేక పరిస్థితులు దృష్ట్యా కేంద్రం కేటాయింపులు జరిపేలా సిఫారసులు చేయాలని విన్నవించారు. నేను ప్రస్తుతం నాలుగవ సారి సిఎంగా ఉన్నాను. కానీ ఇన్ని సవాళ్లు, ఇన్ని ఆర్థిక కష్టాలు ఎప్పుడూ చూడలేదు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకత్వానికి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. అప్పుల కోసం గత ప్రభుత్వం తహసీల్దార్ ఆఫీస్‌లు కూడా తాకట్టు పెట్టింది. 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టింది. ఇలాంటి సమస్యల నుంచి బయటకు వచ్చి రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు గట్టి సంకల్పంతో పనిచేస్తున్నాం.

సంక్షేమ, అభివృద్ధి బ్యాలెన్స్ చేసుకుంటూ, సుపరిపాలన అందిస్తున్నాం. ఇలాంటి సమయంలో...ఈ రోజు మేం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు మీరు సాయం చేస్తే...రేపు పుంజుకుని మాకున్న బలంద్వారా అనూహ్య విజయాలు సాధిస్తాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో మా వంతు పాత్ర పోషిస్తాం. తద్వారా దేశ నిర్మాణంలో



ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు మేం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదంతో స్పీడ్ ఆఫ్ >>2

# మెగా సిటీగా అమరావతి



### గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ విలీనం

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో అమరావతి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ అన్నీ కలిపి మెగాసిటీగా సిఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించారని పురపాలక శాఖమంత్రి పి. నారాయణ వెల్లడించారు. మెగాసిటీకి ఒక అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమన్నారు. దాని నిర్మాణానికి 5 వేల ఎకరాలు కావాలని, ఆ మేరకు భూమి పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. రాజధాని అమరావతిపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా, పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటి ఉండాలని, అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సిఎం చంద్రబాబు ఆలోచన అని తెలిపారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి, >>2

## దోచుకున్న సొమ్ముతో సినిమా

### లిక్కర్ స్కాంలో సిట్ దర్యాప్తు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. కీలక నిందితునిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డిపై సిట్ విచారణలోను, ఆయన ఇళ్లపై జరిగిన దాడుల్లో పలు సంచలన విషయాలు వెల్లడవుతు >>2

## యేటా పెరుగుతున్న రెవెన్యూ లోటు

### పనగారియాతో సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు అవసరమని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి స్వాగతంపలికారు. అనంతరం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వం >>2



17-4pg2exHMNWJQE.qxd:17-4pg2exHMNWJQE.qxd 01/01/01 9:16 AM Page 1



# 15% ఆర్థిక వృద్ధి లక్ష్యం



16వ ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియాను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్

>> డూయింగ్ బిజినెస్ అనే విధానంతో మేం పని చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దేశానికి చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి. పనగారియా నీతి ఆయోగ్‌లో పని చేసిన సమయంలోనే పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు. దేశంలో ఉన్న ఇతర జాతీయ ప్రాజెక్టుల పురోగతి మందగించడంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సిఫారసు చేశారు. వచ్చే పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మీరు కూడా రావాలని కోరుతున్నాను" అని సిఎం అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపు ప్రయాణిస్తోంది. ఒకప్పుడు దేశ వృద్ధి రేటు చూసి ప్రపంచం హేళన చేసేది. కానీ నేడు ప్రపంచం గర్వించే స్థాయిలో భారత్ వృద్ధి సాధిస్తోంది. నేడు మనం ప్రపంచంలో 5వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం... 2028 నాటికి మూడవ స్థానానికి చేరుకుంటాం. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అభివృద్ధి చెందుతాం. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి. సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని మార్చే ఫలితాలను ఇస్తున్నాయి. ఉమ్మడి ఎపిలో తెచ్చిన అనేక సంస్కరణలు అనేక మార్పులు తెచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నపుడు ఐటీని ప్రోత్సహించాం. మంచి ఫలితాలు వచ్చాయి. నేడు ఏఐ గురించి మాట్లాడుతున్నాం. జనాభా విషయంలో కూడా మేం ఒక పాలసీ తీసుకున్నాం. జనాభా నియంత్రణ నుంచి జనాభా నిర్వహణ వైపు ఆలోచిస్తున్నాం. ఇది భారత దేశానికి కీలకమైన దశ. అమృత్ కాల్ అని చెప్పాలి. దేశం అతి గొప్ప విజయాలు సాధించేలా ఫైనాన్స్ కమిషన్ కీలక భూమిక పోషించాలి అని కోరుకుంటున్నా" అని సిఎం అన్నారు. వివిధ అంశాలపై ఆర్థిక సంఘం తమ అభిప్రాయాలు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ పై చైర్మన్ తో పాటు కమిషన్ సభ్యులు ప్రశంసలు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళ్లారా అని సీఎంను పనగరియా అడిగారు... ఇంకా లేదని, వచ్చే నెలలో ప్రధానితో భేటీ సందర్భంగా ఆయనకు ఈ ప్రాజెక్ట్‌పై వివరిస్తామని సిఎం తెలిపారు. ప్రభుత్వ సేవలకు కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ వాట్సాప్ ద్వారా సేవలు పొందే పరిస్థితి తీసుకువస్తున్నామని రానున్న రోజుల్లో 1000 సేవలు అందిస్తామని సిఎం ఈ సందర్భంగా చెప్పారు. ఒక ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం తమను ఎంతో ఆశ్చర్య పరిచిందని, వృద్ధి గణాంకాలపై ఇంత లోతుగా విశ్లేషించడం, కేంద్ర సాయం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను పనగారియా ప్రశంసించారు. మరోవైపు 30 ఏళ్ల క్రితం తాను హైదరాబాద్ వెళ్లిన నాటికి... నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని ఆర్థిక సంఘం సభ్యురాలు అన్నెజార్జ్ మాథ్యూ అన్నారు. అమరావతి కూడా అదే స్థాయిలో చంద్రబాబు అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజంటేషన్ సమావేశంలో వివరించారు. ఎపి వృద్ధికి అనుకూలతలు గురించి వివరించారు. అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖచెన్నయ్, చెన్నయ్-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6పోర్టులు, 7ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచేఅవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐవోటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారత దేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది. భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం.జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకేనే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు**

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం. రాష్ట్రానికి రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమన్నారు.ప్రస్తుతం జీఎస్డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా, 202829 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యమన్నారు. 2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమికరంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలంగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది.2023- 24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయరంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతంఉంటే, భారత దేశంలో 54శాతం, తెలంగాణలో 67శాతం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటు తనానికి కారణమైంది. 2014 - 2019 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి వుంటే.2019-2024 మధ్య సరాసరి వృద్ధి బాగా తగ్గిందన్నారు.

# మెగా సిటీగా అమరావతి

>> జనాభా పెరుగుతుందని వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయని చెప్పారు. టెండర్లు అన్నీ దాదాపు పూర్తి అయిపోయాయి. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రాంతంలో దాదాపు 15వేల మంది పనులు చేస్తూ ఉంటారు. ఒక సంవత్సరంలోపు అధికారుల భవనాలు పూర్తి చేస్తాం. ఏడాదిన్నర లోపు ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. లే ఔట్లలోపు రోడ్లు రెండు సంవత్సరాలలో, ఐకానిక్ టవర్లు మూడు సంవత్సరాలలో కంప్లీట్ చేస్తాము. అన్నీకూడాకచ్చితమైన ప్రణాళికతో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో వందసంవత్సరాలు ముందుకి వెళ్లి ఆలోచిస్తారు. ఇప్పుడు సిటీ అభివృద్ధి చెందాలంటే మంచి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కావాలి, ఒక స్పోర్ట్స్ సిటీ కట్టాలి అనే ఆలోచన ఉంది. అయితే భూ సేకరణ అయితే 5 వేల ఎకరాలు చేయొచ్చు. అయితే భూ సేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండున్నర రెట్లువస్తుంది. దీని వలన రైతులు నష్టపోతారు. దానికంటే భూ సమీకరణకే ఇష్టపడుతున్నారని ఎమ్మెల్యేలు చెప్పడం జరిగింది. అయితే ఎయిర్ పోర్టుకు అయిదు వేల ఎకరాలు మిగలాలి అంటే కనీసం 30 నుంచి 40వేల ఎకరాలు తీసుకోవాలి. భూ సేకరణ, భూ సమీకరణ అనేది చర్చిస్తాము. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటాము. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహ వద్దని, ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు అపోహపడాల్సి న పనేం లేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌తో మూడేళ్లలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. అధికారుల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ఏడాదిన్నరలో అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు నిర్మిస్తాం. రెండున్నరేళ్లలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తాం. ఇప్పటికే అమరావతి పునర్నిర్మాణానికి అవసరమైన 68 పనులకు సంబంధించి రూ.42,360 కోట్ల విలువైన టెండర్లు పూర్తి చేశాం. రాజధానిలో రూ.64,912 కోట్లతో మొత్తం 92 పనులు చేపడతాం అని మంత్రి నారాయణ వివరించారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం రాజధానిని కట్టనప్పుడు 2014-19 వరకు ఇచ్చిన టెండర్లను రద్దు చేసినా బాగుండేది. వాటికి డబ్బులు చెల్లించకుండా అలాగే ఉంచడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. వాటిని పరిష్కరించడానికి 7,8 నెలలు పట్టింది. మళ్లీ టెండర్లు పిలిచాం అని చెప్పారు. విమానాశ్రయంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడానగరాన్ని నిర్మించాలనే ఆలోచనా ఉంది. దీనిని నిర్మిస్తే.. దేశవిదేశాల నుంచి క్రీడాకారులు, అభిమానులు వస్తారు. వారి వసతి కోసం హోటళ్లు ఏర్పాటవుతాయి. ఇలా ఆర్థిక కార్యాకలాపాలు అభివృద్ధి చెందుతాయి.

నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. దానిని దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నాం అని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, కంకర సరఫరా చేయటానికి గనులశాఖ 5 జిల్లాల్లో 851 ఎకరాలను సీఆర్‌డీఏకు కేటాయించింది. వీటిలో ఏలూరు జిల్లాలో 355, కృష్ణాలో 428, పల్నాడులో 28, గుంటూరులో 21, ఎన్టీఆర్ జిల్లాలో 18 ఎకరాలు ఉన్నాయి. రాజధాని గ్రామం అనంతవరంలోని కొండ ప్రాంతాన్ని 2014-19లోనే సిఆర్‌డిఎకు ఇచ్చారు. వాటిలో గ్రౌండ్ లెవల్ కంటే 6 నుంచి 8 మీటర్ల లోతు వరకు భూమిని తవ్వారు. ఆ ప్రాంతాన్ని మొత్తం డ్రోన్లతో సర్వే చేయిస్తాం. అధికారులతో చర్చించిన అనంతరం గోతులు పూడ్చుతాం. ఆ భూమిని కూడా ఏదో ఒక అవసరాలకు వినియోగించాలనే ఉద్దేశంతోనే అనంతవరం వచ్చా అని తెలిపారు.

# యేటా పెరుగుతున్న రెవెన్యూ లోటు

>> ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు అంశాలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలును గమనిసే పోలవరం -బనకచర్ల అనుసంధానం,సాగనీటి ప్రాజెక్టులు అమరావతి, విశాఖపట్నం, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం, ఐఐటీ తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంబర్, బుద్ధిస్ట్ సర్క్యూట్, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్మెంట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్‌పార్కులు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేలు, రహదారులు అవసరమన్నారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజనల్ గ్రోత్ సెంటర్లు..ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా సిఫారసులు చేయాలని ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి కోరారు. ప్రతీ ఏటా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు పెరిగిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,28,146 కోట్లుఉంటే, 2030-31 నాటికి రూ.1,43,640 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తరువాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆర్థిక సంఘానికి సీఎం వివరించారు.

వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. దీనికి ఆర్థిక సంఘం వర్టికల్ డెవల్యూషన్ వాటా ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. అటు, హారిజెంటల్ డెవల్యూషన్‌లోనూ దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతోంది. 10వ ఆర్థిక సంఘం సమయంలో దక్షిణాది రాష్ట్రాలకు హారిజెంటల్ డెవల్యూషన్ 24.30 శాతం ఉంటే, 15వ ఆర్థిక సంఘానికి వచ్చే సరికి 15.80 శాతానికి తగ్గింది. హారిజెంటల్ డెవల్యూషన్‌లో ఎపి వాటా పరిశీలిస్తే... దేశ జిడిపి, జాతీయ జనాభా వాటా కన్నా తక్కువగా ఉంది. ఇది ఆర్థికంగా ఎపికి నష్టంకలిగిస్తోంది. రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్లు నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది.పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు అవసరం ఎక్కువగా ఉందన్నారు. పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాల్సి ఉంది. క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ,మంత్రులు అచ్చెన్నాయుడు, పి.నారాయణ, నిమ్మల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చీఫ్‌జస్టిస్‌గా బిఆర్ గవాయి

>> చేస్తారు. తన పదవీకాలంలో జస్టిస్ గవాయి కీలకమైన తీర్పులు వెలువరించారు. రాజ్యాంగ ధర్మాసనంలో కూడా ప్రాతినిధ్యం వహించారు. 370వ అధికరణం రద్దు, జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు వంటి వాటి తీర్పుల్లో భాగస్వామి అయ్యారు. 2023లో ఇడి డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రాకు మూడో సారి పొడిగింపుపై ఇచ్చిన తీర్పు సంచలనం అయింది. 2023 జులై 31వ తేదీనాటికి దిగిపోవాలని ఖచ్చితమైన ఉత్తర్వులు జారీ చేసారు. అలాగే పెద్దనోట్ల రద్దుపైనా దాఖలయిన తీర్పు అప్పట్లో సంచలనం కలిగించింది. తమిళనాడులో రాజీవ్‌గాంధీ హత్యకేసు నిందితుల విడుదలపైనా, ఆ తర్వాత వన్నియార్ల విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను రాజ్యాంగ వ్యతిరేకమని, ఎంతమాత్రం చెల్లదని ఈ కులాన్ని అత్యంత వెనుకబడిన తరగతుల కేటగిరీలో చేర్చడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పిన తీర్పులో సభ్య న్యాయమూర్తుల్లో గవాయి కూడా ఒకరు.

# 30 ఎఎంసిలకు చైర్మన్ల నియామకం

## టిడిపికి 25, జెఎస్పీకి 4, బిజెపికి1

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో 30 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది.కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన వారిని ఈ పదవులకు నామినేట్ చేసారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత టిడిపి 25, జనసేన4, బిజెపి 1 నామినేటెడ్ ఎఎంసి చైర్మన్ పదవులు కేటాయించారు.త్వరలో మిగతా మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తారు. సింహాద్రిపురం ఎఎంసి ఛైర్మన్‌గా బండి రామాసురరెడ్డి. కాకినాడకు బచ్చు శేఖర్,ఆకివీడుకు బొల్లా వెంకటరావు, పత్తిపాడు బొందలపాటి అమరేశ్వర(జెఎస్పీ), ఇచ్ఛాపురానికి బుదా మణిచంద్ర ప్రకాశ్, ఎర్రగొండపాలానికి చెకూరి సుబ్బారావు, అంబాజీపేటకు చిట్టూరి శ్రీనివాస్,అత్తిలి దాసం ప్రసాద్ (జెఎస్పీ),పాకాల కె,సుధాకరయ్య, సామాల కరణం శ్రీనివాసుల నాయుడు, బంగారు పాలెంకు కర్రావుల భాస్కరనాయుడదు,బనగాలపల్లికి కట్టారెడ్డి మల్లిఖార్జునరెడ్డి, కంచికచర్లకు కొగంటి వెంకట నారాయణ(బాబు), అవనిగడ్డకు కొల్లూరు వెంకటేశ్వరరావు,ఉయ్యూరుకు కొండా ప్రవీణ్‌కుమార్,పాడేరుకు మాచాల మంగతల్లి(బిజెపి),రాజమండ్రికి మర్ని వాసుదేవ్, కొవ్వూరుకు నాదెళ్ల శ్రీరామ చౌదరి, విజయవాడకు నర్రా వాసు, బంటుమిల్లికి ఒడుగు తులసీరావు,కోడూరు(రైల్వే) పగడాల వరలక్ష్మి(జెఎస్పీ),అనకాపల్లికి పి రాము,మైలవరానికి పోనకళ్ళనవ్యశ్రీ, మాడుగులకు పుప్పాలఅప్పలరాజు, మచిలీపట్టణంకు ఎస్వీఎస్వీ వెంకట దుర్గా ప్రసాద్, చంద్రగిరికి ఎస్.గౌస్‌భాషా,భీమడోలుకు శేషవు శేషగిరిరావు, జమ్మలమడుగు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి,మార్కాపురానికి ఇమాం సాహేబ్, పిడుగురాళ్ళకు తురకా వీరాస్వామి నియమితులయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 17-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.చవితి మ.3.21
అనూరాధ తె.5.55
వర్జ్యం మ.12.05-మ.1.50
దు.ఉ.10.03-10.53, 2) మ.3.04-3.54
శుభసమయం : ఉ.7.48-8.40
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

మేషం : వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

వృషభం :ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. పనులు నిదానంగా సాగుతాయి.

మిథునం: కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. వివాదాలకు దూరంగా వుండండి.

కర్కాటకం: ఆర్థిక ఇబ్బంది ఎదురై చికాకులు పెడతాయి. ప్రయోగాలలో తొందరపాటువద్దు.

సింహం: అనుకోని అతిథుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. రుణాలు తీరతాయి.

కన్య : దీర్ఘకాలిక సమస్యల నుండి గట్టెక్కుతారు. భూవివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ధనలాభం.

తుల : పాత మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

వృశ్చికం: వృత్తి, వ్యాపారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఖర్చులు పెరుగుతాయి. వాహనయోగం.

ధనుస్సు: అనుకోని అవకాశాలు లభిస్తాయి.వీటిని సద్వినియోగం చేసుకోండి. సన్నిహితుల నుండి శుభవార్తలు.

మకరం: మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. విలువైన పత్రాలు ఖాగ్రత్త.

కుంభం : కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

మీనం:పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చడంపై బుధవారం న్యూఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ కేడర్

# రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్లు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి సిఆర్‌డిఎ టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది సిఆర్‌డిఎ. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్‌లను ఆహ్వానించింది. అలాగే సచివాలయం 1,2 టవర్ల కోసం రూ.1,897 కోట్లకు, సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ చేసింది. మొత్తం 5 టవర్లను రూ.4,668 కోట్ల వ్యయంతో చేపట్టాలనో ప్రభుత్వం నిర్ణయించింది. మే 1న సచివాలయ, హెచ్‌వోడీ టవర్లకు టెక్నికల్ బిడ్లను సిఆర్‌డిఎ తెరువనుంది. సచివాలయంలో ఉండే హెచ్‌వోడీలకు సంబంధించి 45 అంతస్థులతో ఒక టవర్ నిర్మాణం, మిగతా టవర్లు 40 అంతస్థులతో నిర్మాణం జరుగనుంది. ఈ సచివాలయం టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్టక్చర్‌తో నిర్మించాలని సిఆర్‌డిఎ టెండర్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ టెండర్ రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణమే అత్యంత కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయ టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెండున్నర సంవత్సరాల గడువు విధించారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో పాటు, ఎడిబి, హడ్కో, జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రాజధాని అమరావతిలో పలు నిర్మాణాల కోసం రూ.31వేల కోట్లు రుణాలుగా సమకూర్చాయి. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే రూ.480 కోట్లు మొదటి విడత రుణం కూడా మంజూరు అయ్యింది. ఈ మొదటివిడత రుణంతోనే సచివాలయటవర్ల నిర్మాణానికి టెండర్లను పిలిచింది.

# సిట్ విచారణకు ఒకరోజు ముందుగానే విజయసాయి

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఈ నెల 17వ తేదిన గురువారం ఉదయం 10 గంటలకు సిట్ ముందు విచారణకు హాజరు కాబోతున్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఆయన సమాచారం అందించారు. విజయ సాయిని తొలుత ఈ నెల 18న విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే అయితే తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ఉండటంతో 17వ తేదీన విచారణకు వస్తున్నానని సిట్‌కు మాజీ ఎంపీ సమాచారం పంపారు. దీంతో 17వ తేదీన విచారణకు రావాలని, తాము రెడీ అంటూ విజయసాయికి సిట్ అధికారులు సమాచారం పంపారు.ఈ కేసుకు సంబంధించి కసిరెడ్డి రాజశేఖర రెడ్డికి సిట్ మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈనెల 19వ తేదీన విచారణకు రావాలని ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ సిపి కార్యాలయంలోని సిట్ కార్యాలయాని నోటీసుల్లో పేర్కొంది. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మూడు సార్లు రాజ్ కసిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన హాజరు కాలేదు.

# అభివృద్ధికి సహకరిస్తాం

## రాజకీయ పార్టీలతో ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, డా. అరవింద్ పనగారియా స్పష్టం చేసారు.16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులతో కలిస చైర్మన్, డా. అరవింద్ పనగారియా రాష్ట్ర పర్యటనకు వచ్చారు ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం తరువాత ఆర్థిక సంఘం చైర్మన్ సభ్యులు డా. మనోజ్ పాండా, అన్నే జార్జ్ మాథ్యూలతో కలసి వివిధ రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను ముఖాముఖి సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతినిధులుగా శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ వి. చిరంజీవిరావు, మాజీ శాసనమండలి సభ్యులు పి. అశోక్ బాబులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర రెవెన్యూలోటును పరిగణలోకి తీసుకుందన్నారు. 16వ ఆర్థిక సంఘం కూడా రెవెన్యూ లోటును పరిగణలోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న ఆర్థిక క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సెక్టార్ల వారీగా గ్రాంట్స్‌ను విద్య, ఆరోగ్య రంగాలకు అందివ్వాలన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనే విషయం గుర్తించాలన్నారు. పాపులేషన్ లెక్కలను కూడా 1971 జనాభా లెక్కల ప్రకారంగా సిఫార్సులు ఉంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. పాపులేషన్ గ్రోత్‌రేట్ ఆధారంగా నిధులు పంపకాలు ఉండాలన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ వాటా పెంచాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ప్రాంతాలకు నిధులు పెంచాలన్నారు.

అదేవిధంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు ప్రత్యేక నిధులు అందించాలన్నారు. జనసేన పార్టీ ప్రతినిధులుగా శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస లు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రానికి వెనుకబడిన రాష్ట్రాలకు ఇచ్చే విధంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. వెనుకబడిన రాష్ట్రాల జాబితాలో రాష్ట్రాన్ని చేర్చి ఆర్థికంగా చేయూతను అందించాలన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి చేయూతను అందించాలన్నారు. రాష్ట్రంలో రోడ్లు చాలా వరకు ఇబ్బంది కరంగా ఉన్నాయని వాటి అభివృద్ధికి నిధుల సాయం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 972 కిమీ కోస్టల్ లైన్ అభివృద్ధి చేయాలన్నారు.

రాష్ట్రానికి 90 శాతం గ్రాంటు గా నిధులు అందించాలన్నారు. త్రాగు నీరు, రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని నగర, గ్రామ పంచాయతీలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. వాటర్ వర్క్స్ నిధులు, జలజీవన్ మిషన్ ఫండ్స్ రాష్ట్రానికి ఇవ్వాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వర్క్స్ కు నిధులు పెంచాలన్నారు. వైఎస్సార్సీ ప్రతినిధులుగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన,కృష్ణలు మాట్లాడుతూ గతంలో జనాభా, ప్రాంతాల అభివృద్ధి ఆధారంగా నిధులు అందించారన్నారు. రాష్ట్రంలో కోవిడ్ ఉన్నా కూడా వివిధ సంక్షేమ పథకాలు, కులాలకు, మతాలు, పార్టీలకు అతీతంగా ఇచ్చామన్నారు. రాష్ట్రాలకు పన్నుల వాటాలో 50 శాతం నిధులు అందించాలన్నారు. పన్నుల వాటాలో ప్రత్యేక బోనస్ కూడా ఇవ్వాలన్నారు.

# దోచుకున్న సొమ్ముతో సినిమా

>> న్నాయి.కసిరెడ్డి మద్యం కుంభకోణంలో వెనకేసుకున్న డబ్బుతో 'స్పై' అనే చలనచిత్రాన్ని నిర్మించినట్లు సిట్ అధికారులు చెబుతున్నారు.మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సిట్ బృందాలు ఇటీవల ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ రిజిస్టర్ చిరునామా అయిన హైదరాబాద్ మణికొండ ప్రశాంతి హిల్స్‌లోని ప్లాట్ నంబర్ 26, 27లో డోర్ నంబర్ 766/2/26, 27కు వెళ్లి తనిఖీలు జరిపాయి. అక్కడ ప్రస్తుతం ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు సంబంధించి ఎలాంటి కార్యకలాపాలు కొనసాగట్లేదని గుర్తించాయి. ఇదే చిరునామాలో రీసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ అనే ఐటీ కంపెనీ కూడా ఉంది. దీనికి రాజ్ కసిరెడ్డి సతీమణి సోదరి పైరెడ్డి మేఘనా ప్రియదర్శినిరెడ్డి ఎండీగా, ఆమె తల్లి పైరెడ్డి సుజాతరెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ కంపెనీకి, ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు మధ్య లావాదేవీలు ఏమైనా సాగాయా అన్నదానిపై కూడా సిట్ బృందాలు ఆరా తీస్తున్నాయి. రాజశేఖరరెడ్డి దోచుకున్న నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకు ఏకంగా సినిమాల నిర్మాణం చేపట్టారు. ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే సంస్థను నెలకొల్పి నిఖిల్ సిద్ధార్థ్ (కార్తికేయ2 ఫేమ్) హీరోగా 'స్పై' అనే పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. దీన్ని తెలుగు, హిందీ, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో 2023 జూన్ 29న ఈ సినిమాను విడుదల చేశారు. ఈ సినిమాకి కథ కూడా రాజ్ కసిరెడ్డే సమకూర్చినట్లు టైటిల్స్‌లో వేసుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనకున్న రహస్యాన్ని స్పృశిస్తూ ఓ గూఢచారి ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అయితే ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థకు ఉప్పలపాటి చరణ్‌తేజ్ అనే ఓ డైరెక్టర్, రచయితను సిఇఒగా పెట్టుకున్నారు. ఒకేసారి భారీగా సినిమాలు నిర్మించడం కోసం పలువురు యువ డైరెక్టర్లు, రచయితలకూ అడ్వాన్సులిచ్చారు. ఆ మధ్యకాలంలో మిడ్ రేంజ్, కొత్త హీరోలతో హిట్ సినిమాలు తీసిన నలుగురైదుగురు డైరెక్టర్లతో కథలపై చర్చించి సినిమాల నిర్మాణానికి ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మద్యంకుంభకోణంపై దర్యాప్తు తీవ్రతరం కావడంతో ఆ కొత్త ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. స్పై సినిమాను ఎంత బడ్జెట్‌లో నిర్మించారు. దానికి వాస్తవంగా చేసిన వ్యయంఎంత? ఈసొత్తు ఎక్కడినుంచి సమకూరింది? ఏయే రూపాల్లో చెల్లించారు? ఈసినిమాకు జరిగిన వ్యాపారమెంత? తదితర విషయాలన్నీ ఇప్పటికే సిట్ సేకరించింది. కొంతమందికి నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించింది. ఇంకా ఏయే సినిమాలు లైన్‌లో పెట్టారు? వాటి కోసం ఎంత వెచ్చించినట్లు లెక్కలు కూడా చూపించారు. అలాగే ఇందుకు మనీ రూటింగ్ ఎలా చేశారు? అనే దానిపై సిట్ దర్యాప్తులో పలు కీలక అంశాలు వెలుగుచూశాయి. నగదు రూటింగ్ చేసే క్రమంలో భాగంగా ఏయే స్థాయిల్లో ఎవరెవరు ఏ పాత్ర పోషించారనేదానిపైనా సిట్ వివరాలు తీసుకుంది.

17-04Pg3exHMNWJQEKT.qxd:17-04Pg3exHMNWJQEKT.qxd 01/01/01 9:40 AM Page 1



# తులాభారంలో భారీ స్కాం!



## - టిటిడిలో కోట్లాది రూపాయలు స్వాహా అంటూ బోర్డు సభ్యుడు భాను సంచలన వ్యాఖ్యలు

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు... ఆపదమొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రియంగా సమర్పించే మొక్కుల్లో తులాభారం ఒకటి. ఇక్కడ తులాభారం రూపంలో వచ్చిన కానుకలను రోజువారీగా టిటిడి ఖాతాలో జమచేయాల్సి ఉంటుంది. అయితే గత ఐదేళ్ళ వైసిపి పాలనలో, గత ట్రస్ట్‌బోర్డుల హయాంలో తులాభారం కానుకలు కోట్లాదిరూపాయలు స్వాహా చేశారని ,అక్రమాలు జరిగినట్లు టిటిడి విజిలెన్స్ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేదని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఉదయం తిరుమల ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసిపి హయాంలో శ్రీవారి ఆలయంలో తులాభారంలో భారీస్కాం జరిగిందని వెల్లడించారు. అంతేగాక ఈ అక్రమాల్లో సూత్రధారులు ఎవరనేది తేల్చి ఉద్యోగం నుండి తొలగించాల్సిన పాలకమండలి, గత అధికారులు తాత్కాలిక ఉద్యోగులను తొలగించి మిన్నకుండిపోయారని ఆరోపించారు. వడ్డీకాసుల వేంకటేశ్వర స్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా నిలువుదోపిడీలు, తులాభారం కానుకలు సమర్పించుకుంటారు. భక్తులు తాము అనుకున్న కోరికలు నెరవేరితు తులాభారం వేస్తామని, లేదా దంపతులు పిల్లలు పుడితే తులాభారం వేయిస్తామని మొక్కుకుంటుంటారు. అలా వారి కోరికలు నెరవేరితే తిరుమలేశునికి తులాభారం కానుకలుగా చిల్లరనాణేలు,కరెన్సీ, బెల్లం, బియ్యం, పప్పులు ఇలా వారివారి స్థాయిలో సమర్పిస్తారు. రోజువారీగా 10లక్షలు రూపాయలు తులాభారం ద్వారా ఆదాయం చేకూరుతుంది. గత ఐదేళ్ళలో కోట్లాదిరూపాయల తులాభారం కానుకలను ఇంటి దొంగలు కాజేశారని బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. తులాభారం కానుకలను స్వాహాచేశారన్నారు. తులాభారంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ నివేదిక అందిస్తే అప్పటి అధికారులు మిన్నకుండి పోయారని విమర్శించారు. తులాభారంలో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్నా మన్నారు. శ్రీవారి ఆలయం పరిసరాల్లో డ్రోన్‌కెమెరా ఎగురవేసి పరిసరాలు ఛిత్రీకరించడంపై బోర్డు సభ్యుడుగా భానుప్రకాశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. డ్రోన్ ఎగరడం నిఘా వైఫల్యంగా భావిస్తున్నామన్నారు. భద్రత సిబ్బంది కొరత ఉందని, సిబ్బందిని కూడా పెంచుతామని ఆయన తెలిపారు. త్వరలోనే తిరుమలలో యాంటీడ్రోన్ టెక్నాలజీని తీసుకొస్తామని తెలిపారు. డ్రోన్ కెమెరా ఎగురవేసి యూట్యూబర్ నుండి మెమరీకార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి

## - బిసి సంక్షేమ మంత్రి సవిత

**సచివాలయం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** కందుకూరి వీరేశలింగం పంతులు సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి అని,సమాజంలోని దురాచారాలు,మూఢ విశ్వాసాలపై పోరాడిన విప్లవ యోధుడని రాష్ట్ర బిసి,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు.స్త్రీ అభ్యున్నతికి, మహిళా విద్యకు విశేష కృషి చేశారన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహానీయుడు వీరేశలింగం పంతులు అన్నారు.రాజమండ్రిలో 1848 ఏప్రిల్ 16న జన్మించిన కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త,బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్య మిచ్చారని,బాలికలకు పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతూ,వితంతు పునర్వివాహాలను జరిపించారన్నారు. తెలుగు సాహిత్యానికి కందుకూరి వీరేశలింగం పంతులు ఎనలేని సేవ చేశారని మంత్రి కొనియాడారు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగంతోనే మొదలైందన్నారు.సమాజ సేవ కోసం హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్థిని ఆ సంస్థకు రాసిచ్చారన్నారు.కందుకూరి వీరేశలింగం పంతులు 130కిపైగా గ్రంధాలు రాశారన్నారు. వాటిలో రాజశేఖర చరిత్ర,సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఎంతో ముఖ్యమైనవన్నారు. తెలుగు జాతి నవయుగ వైతాళికుడిగా కందుకూరి వీరేశలింగం పంతులు పేరుగాంచారన్నారు. క ందుకూరి ఆశయ సాధనే లక్ష్యంగా అందరమూ కృషిచేద్దామన్నారు.నేటి యువతకు కందుకూరి వీరేశలింగం పంతులు మార్గదర్శులని,ఆయన ఆశయాలే వారికి లక్ష్యం కావాలని మంత్రి సవిత తెలిపారు.

# తిరుమల సమాచారం

## తనిఖీల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు!

### - ఆకస్మిక తనిఖీల్లో సివిఎస్‌ఒ హర్షవర్ధన్‌రాజు



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రికుల వాహనాలు రద్దీ సమయంలో, తనిఖీల కోసం బారీగా వాహనాలు ఆగిపోయినా నిశితంగా పరిశీలించిన తరువాతే అనుమ తించాలని, వాహనాల తనిఖీల్లో నిర్లక్ష్యం గా ఉండొద్దని తిరుపతి జిల్లాఎస్పీ, టిటిడి సివిఎస్‌ఒ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. స్కానర్ మానిటర్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి ఇమేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనుమానంగా ఉన్న వస్తువులను సిబ్బంది ఫిజికల్‌గా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల తిరుమలలో భద్రత లోపం, మద్యం,నిషేధిత పదార్థాలు చివరకు డ్రోన్‌కెమెరా ఎగరడం వంటి ఘటనలతో అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రతా సిబ్బంది పనితీరుపై బుధవారం సాయంత్రం సివిఎస్‌ఒ హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది, ఎస్‌ఎఫ్‌పిఎఫ్ సిబ్బంది. విజిలెన్స్ సిబ్బంది పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. తనిఖీ కేంద్రంలో ద్విచక్రవాహనాలు, ఆర్టీసి బస్సుల లేన్లతోబాటు యాత్రికుల వాహనాలు ప్రవేశం, విఐపి గేట్‌లో వాహనాల అనుమతి వంటివాటి వివరాలు గమనించారు. వాహనాలను, లగేజీలను తనిఖీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తిరుమలకు వచ్చే యాత్రికుల వాహనాల తనిఖీల్లో ఎక్కడా ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. ఇక్కడ వాహనాలను అనుమతించే విషయంలో పలు సూచనలు చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే ఆ వాహనాలను నిలుపుదలచేయాలన్నారు. ఈ తనిఖీల్లో అలిపిరి ఏవిఎస్‌ఒ ప్రభు, రమేశ్, ఎస్‌పిఎఫ్ భాస్కర్, ఎస్‌పిఎఫ్ ఎస్‌ఐ మణిసిద్దార్థ్, విజిలెన్స్‌సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వారితో స్వయంగా సమావేశమై అభిప్రాయాలు తెలుసుకుని సూచనలు చేశారు.

## రాష్ట్ర ఫైబర్ నెట్ ఉద్యోగులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**సచివాలయం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** ఫైబర్ నెట్ లో దాదాపు 500మంది ఉద్యోగులను సర్కార్ తొలగించింది.దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చర్చించిన అనంతరం ఉద్వాసన పలుకుతున్నట్లు సమాచారం.సూర్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నియమించిన వారందరూ కూడా ఈ నెలాఖరుకు ఫైబర్‌నెట్ నుంచి ఔట్ అవనున్నారు.ఇకముందు ఎటువంటి పొడిగింపు

ఉండబోదని సంస్థ యాజమాన్యం స ్పష్టం చేసింది.ఈఉద్యోగులంతా కూడా ఫైబర్ నెట్ కార్యాలయానికి రాకుండా జీతాలు తీసుకున్న పరిస్థితి.దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం దాదాపు 500మందిని ఫైబర్‌నెట్ నుంచి తొలగించింది.

# మైనింగ్ వ్యవస్థలో మార్పులు అవసరం: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మైనింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే అద్భుతాలు సృష్టించే అవకాశం ఉంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నిన్న కేబినెట్ సమావేశం సందర్భంగా మైనింగ్ రంగంలో ఉండే అవకాశాలను మంత్రి వర్గం ముందుంచారు. మైనింగ్ అనేది వ్యాపార వర్గాలకే అనుకోవడం సరికాదని, రాష్ట్ర జీడీపీలో మైనింగ్ రంగం అత్యంత కీలకమైనదన్నారు. రాష్ట్ర జీడీపీలో ప్రస్తుతం 3 నుండి 4 శాతం మాత్రమే ఉన్నప్పటికీ.. 15 నుండి 20 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ శాఖలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల కారణంగా గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. మైనింగ్ వ్యవస్థ మొత్తం దోపిడీకి గురైంది. ఫలితంగా మైనింగ్ అంటేనే ప్రజల్లో, ప్రభుత్వ పెద్దల్లో చెడు అభిప్రాయం కలిగింది. ఇలాంటి సమయంలో మైనింగ్ ఇండస్ట్రీ మొత్తాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా మెరుగైన మైనింగ్ పాలసీని ప్రజలకు అందించబోతున్నాం. మైనింగ్ లీజు అప్లికేషన్స్ ఫస్ట్ ఇన్ ఫస్ట్ సర్వ్ విధానం ప్రారంభించాం. ఈ విధానం ఏడాది వరకు అమలులో ఉంటుంది. లీజు గ్రాంట్స్, రెన్యువల్ మరియు లీజు ట్రాన్స్ ఫర్ కోసం 10 రెట్లుగా ఉన్న డెడ్ రెంట్‌ను 5 రెట్లకు తగ్గించాం. మైనింగ్ లీజుల కాల పరిమితిని 20 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలకు పెంచడం ద్వారా అండగా నిలుస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రిటికల్ మినరల్స్ పాలసీని రూపొందించబోతున్నాం. వినూత్న ఆలోచనలతో మైనింగ్ వ్యవస్థలో అద్భుతాలు సృష్టించవచ్చని, యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేయొచ్చు. మన రాష్ట్రంలో ఉండే మేజర్, మైనర్ మరియు క్రిటికల్ మినరల్స్‌తో విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చు. కనుక విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు చేసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. భారతదేశ పారిశ్రామికాబివృద్ధికి క్రిటికల్ మినరల్స్ సేకరణ, అభివృద్ధి ఉపయోగపడేలా మన రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ పాలసీ రూపొందించడానికి మైనింగ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా కీలక ఖనిజాలపై దృష్టి సారించలేదు. అందుబాటులో ఉండే వనరుల్ని తవ్వుకుని అమ్ముకునే ధోరణి మారాలి. విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించడంతో పాటుగా, మన వద్దనున్న వనరులను ఇక్కడే ప్రాసెస్ చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను అందిపుచ్చుకునే అవకాశం లభిస్తుంది.

మైనింగ్ రంగంలో ఉ త్సాహిక పారిశ్రామిక వేత్తలు, లీజు హోల్డర్లు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ పరిస్థితిని ఉపయోగించుకుని విలువ ఆధారిత పరిశరమల ఏర్పాటు చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# జులైనెల ఆర్జితసేవా టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామికి రోజువారీగా,వారాంతపుసేవలుగా నిర్వహించే సేవాటిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం 19వతేదీ శనివారం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. రానున్న జులైనెలకు సంబంధించి ఈ సేవా టిక్కెట్లు ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో,కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు. సామాన్యభక్తులు దేవదేవుని దర్శనార్థం సేవా టిక్కెట్లు బుక్‌చేసుకునేందుకు వీలుగా ఈనెల 19వతేదీ శనివారం ఉదయం 10గంటలకు ఎలక్ట్రానిక్ డిప్‌ద్వారా అందుబాటులో ఉంటాయి. తిరుమల ఆలయంలో శ్రీవారికి జరిగే సుప్రభాతం,తోమాల,అర్చన,అష్టదళపాదపద్మారాధన, నిజపాదదర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. ఈ సేవలను బుక్‌చేసుకునేందుకు 19వతేదీ ఉదయం 10గంటల నుంచి 21వతేదీ ఉదయం 10గంటలవరకు గృహస్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో గృహస్థులకు టిక్కెట్ల కేటాయింపు జరుగుతుంది. టిక్కెట్లు పొందినవారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

23వతేదీ మధ్యాహ్నం లోపు నగదు చెల్లించాలి. అలాగే గృహస్థులకు ఎస్‌ఎంఎస్,ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తారు. టిక్కెట్లు పొందిన భక్తులు రెండు రోజుల్లో నగదు చెల్లించాల్సి వుంటుంది. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకరణసేవ టిక్కెట్లను ముందు వచ్చిన వారికి ముందు అనే ప్రాతిపదికన భక్తులు నేరుగా బుక్‌చేసుకోవచ్చు.

22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు 22న మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి.

అంగప్రదక్షణ టోకెన్లు బుకింగ్‌కు 23వతేదీ ఉదయం 10గంటల నుండి అందుబాటులో ఉంటాయి. సీనియర్‌సిటిజన్లు, దివ్యాంగులు టిక్కెట్లు బుకింగ్‌కు 23వతేదీ మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్‌ఇడి టిక్కెట్లు 24న మధ్యాహ్నం 3గంటలకు అందుబాటులో ఉంటాయి.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడి అమరావతి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మే 2వ తేదీన అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభించేందుకు రానున్నారని అందుకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.ఈమేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్,కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్,నాదెండ్ల మనోహర్,పి.నారాయణలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఇప్పటికే నియమించిందని ఈకమిటీ సోమవారం ఉ.11.గంలకు అమరావతి సచివాలయంలో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై నిర్వహించనుందని పేర్కొన్నారు.రాష్ట్ర సచివాలయం వెనుకవైపున ఇటీవల పి4 కార్యక్రమం ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని కార్యక్రమ సభా వేదికను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధాని పర్యటన మే 2వ తేదీకి నిర్ధారణఅయిందన్నారు.అయితే ఆ కార్యక్రమం ఉదయం నిర్వహించాలా లేక సాయంత్రం నిర్వహించాలా అనేది ఖరారు కావాల్సి ఉందని అన్నారు.ప్రధాని పర్యటనకు సంబంధించి విస్తృతమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు గురువారం తగిన ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఇటీవల కాలంలో విశాఖలో జరిగిన ప్రధాని పర్యటన కార్యక్రమంలో విధులు నిర్వహించిన అధికారులకు ఈసారి కూడా తగిన విధులు కేటాయించడం జరుగుతుందని ఆ అధికారుల జాబితాను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రధాని పర్యటనకు వచ్చే ప్రజా ప్రతినిధులు,ప్రజలు తదితరు లెవరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో కనీస సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని సిఎస్ విజయానంద్ అధికారులకు స్పష్టం చేశారు.ముఖ్యంగా వివిధ గ్రామాల మీదగా ప్రముఖులు,సాధారణ ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉందని ఆయా రోడ్లన్నీ గ్రామీణ రహదారులై ఉన్నందున ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు.మొత్తం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్ ను నోడలు అధికారిగా నియమించడం జరిగిందని కావున అధికారులు అందరూ ఆయనతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన



శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో పాల్గొనే విఐపిలు,ఇతర ప్రముఖుల వివరాలను పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఆయా శాఖల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లు ఇతర అంశాలకు సంబంధించి తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడలు అధికారిగా నియమించబడిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ సచివాలయం వెనుక వైపున పి4 కార్యక్రమం జరిగిన ప్రాంతంలో ప్రధాని సభావేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందని అక్కడి నుండే ప్రధాని మోడి పలు పనులకు ప్రారంభోత్సవాలు,శంఖుస్థాపనలు చేయను న్నారని వివరించారు.

# డిక్లరేషన్‌పై నాస్తికుడు విమర్శించడమా..

## కరుణాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే సుధీర్ ఆగ్రహం

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త** పవిత్రమైన హిందూ దేవాలయ ఛైర్మన్‌గా రెండుసార్లు పనిచేసిన మాజీ టిటిడి ఛైర్మన్, తిరుపతి మాజీ ఎంఎల్‌ఏ కరుణాకర్‌రెడ్డి డిక్లరేషన్‌పై సంతకం చేయమంటే నిరాకరించారు. ఆయన హయాంలోని తప్పులను తప్పిదాలను కప్పిపుచ్చుకునుటకు కూటమి ప్రభుత్వంపై బుదర చల్లడానికి ప్రయత్నించడం శోచనీయమని శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. బుధవారం ఇక్కడి పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అపవిత్రం చేయడానికి ప్రయత్నించడం బాధాకరం అన్నారు.నాడు గోశాలపై ఉన్న దయ నేడు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అడ్డదారి పట్టించేందుకే కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కాలం చెల్లిన మందులను గోవులకు పెట్టడం వల్లే అవి మృతిచెందాయని పేర్కొన్నారు. మాజీ టిటిడి బోర్డు ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సిఎం జగన్‌లు నాస్తికులని ఏనాడు వారు కుటుంబసభ్యులతో తిరుమలకు రాలేదని పేర్కొన్నారు. లడ్డు వ్యవహారంలో కల్తీనెయ్యి వివాదంలో తలెత్తినపుడు చెప్పని మాటలు నేడు ఎందుకు మాట్లాడుతున్నారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధికోసమే గోవుల వ్యవహారం తెరపైకి తెచ్చారన్నారు. జగన్ హయాంలో ఏనాడు గోశాలను విజిలెన్స్, వెటర్నటీ వారు ఎన్నిసార్లు తనిఖీచేశారో వారికే తెలియాలన్నారు. కడపలో గోశాలను ఏర్పాటు చేస్తున్నామని కేంద్రంకు చెప్పి రూ.780కోట్లు స్వాహాచేసింది నిజం కాదా? ఇక్కడి గోశాల ఏర్పాటులో ఎంతమంది ఉద్యోగులు పనిచేశారో కూడా తెలియజేయాలన్నారు. గోశాలలో గడ్డిస్కాం, పాలు,వెటర్నటీ స్కాంలతో పాటు చివరికి తలనీలాల్లో కూడా స్కాం జరిగినట్లు తెలిసిందని దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22నుంచి 23 వరకు టిటిడి గోశాలలో 27గోవులు మృతిచెందాయని పలమనేరులో టిటిడి గోశాలలో 26 మృతిచెందాయన్నారు. మంచితనాన్ని తమ చేతకాని తనం అనుకుంటే పొరపాటని తమ అధినాయకుని సూచనలతో మౌనంగా ఉన్నామన్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసేవారిని శిక్షించేందుకు కొత్తచట్టాలను తీసుకువస్తున్నామన్నారు. తిరుమల కొండపై జరిగే పాపాలు ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకుంటామని తమ 14మంది ఎంఎల్‌ఏలను తీసుకుని తిరుమలకు వస్తాం..వచ్చి నిజాలు చెప్పారా కరుణాకర్‌రెడ్డి గారూ..అంటూ సవాల్ విసిరారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలును సోషల్‌మీడియా, పత్రికల్లో ప్రచురించుకుని రాజకీయాలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులు చూసి వారు విస్తుపోతున్నారని ప్రజలందరు సంతోషిస్తున్నారన్నారు. అవినీతికి మారుపేరు తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అని ఎంఎల్‌ఏ తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రార్‌పై తనకు 35పైగా పిర్యాదులు వచ్చాయని అయితే మార్టిగేజ్‌ను విడిపించుకు నేందుకు ఒరైతు గత 16రోజులుగా తిరుగుతుంటే తిప్పించుకుంటున్నారని తనకు తెలియగానే వెంటనే రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి

# ఏపిలో రాజ్యసభ ఉప ఎన్నికకు ఇసి షెడ్యూల్ ఖరారు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వైకాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ సభ్యుడు(ఎంపీ)గా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామాతో ఈ స్థానం ఖాళీ అయింది. వైకాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి సార్వత్రిక ఎన్నికల అనంతర పరిణామాలల్లో ఆ పార్టీకి రాజీనామా చేసారు.అంతేకాకుండా ఎంపీ పదవికి రాజీనామా చేసారు.ఈ క్రమంలో ఆ స్థానానికి ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల చేసింది.ఈ నెల 29 వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. 30న నామినేషన్ల పరిశీలన చేపడతారు. మే 2 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 9న ఎన్నిక నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు.

# రాష్ట్రం నుంచి హజ్ కు 1630 మంది యాత్రికులు

## న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

### - 29 నుండి ప్రయాణాలు ప్రారంభం

### - ప్రభుత్వం తరఫున ప్రత్యేక వసతి ఏర్పాట్లు

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:**హజ్ 2025 యాత్ర కు ఆంధ్రప్రదేశ్ నుండి యాత్రికుల ప్రయాణాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో హజ్ యాత్ర ప్రయాణాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుండి మొత్తం 1630 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో 1170 మంది యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కేషన్ నుండి బయలుదేరుతున్నారని తెలిపారు. వివిధ దశల్లో హజ్ యాత్ర ప్రయాణ ప్రణాళిక ఖరారు అయిందని తెలిపారు. ఇందులో భాగంగామొదటి విడతలోమొత్తం 236 మంది ఈనెల 29వ తేదీ నుండి మే 11 తేదీ వరకు హైదరాబాద్ నుండి మదీనా మునవ్వరా కు బయలుదేరుతారని పేర్కొన్నారు.రెండవ విడతలో 934 మంది మే 19 వ తేదీ నుండి 27 తేదీ వరకు హైదరాబాద్ నుండి జెద్దా కు యాత్రికులు బయలుదేరనున్నట్లు వెల్లడించారు.అలాగే బెంగళూరు ఎంబార్కేషన్ నుండి 452 మంది హజ్ యాత్రికులు ఈ నెల 30 తేదీ నుండి మే 15 వ తేదీ వరకు బెంగళూరు నుండి మదీనా మునవ్వరాకు బయలుదేరుతారని తెలిపారు.హైదరాబాద్ ఎంబార్కేషన్, బెంగళూరు ఎంబార్కేషన్ ల నుండి హజ్ యాత్ర కు బయలుదేరుతున్న ఆంధ్రప్రదేశ్ హజ్ యత్రికులకు వసతీ సౌకర్యాలు కల్పించే విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు.తమ ఆరోగ్యరీత్యా హజ్ నిబంధనల మేరకు ప్రభుత్వం తరపున యాత్రికులు తప్పనిసరిగా టీకాలు వేయించు కోవాలని సూచించారు.హజ్ యాత్రకు బయలుదేరుతున్న వారందరికీ మైనారిటీ శాఖా మంత్రి ఫరూక్ శుభాకాంక్షలు తెలిపారు.

# జగన్ టూర్ లో దెబ్బతిన్న హెలికాప్టర్ పైలెట్, కో పైలెట్ ను విచారించిన సికేపల్లి పోలీసులు

**అనంతపురం, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త బ్యూరో)** వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి టూర్లో హెలికాప్టర్ దెబ్బతిన్న సంఘటన సంబంధించి పోలీసు బృందాలు విచారణకు రంగంలో దిగాయి. ఆ హెలికాప్టర్ కి సంబంధించిన పైలెట్, కో పైలట్ లను శ్రీ సత్యసాయి జిల్లా రాప్తా నియోజకవర్గం సికేపల్లి మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్లో బుధవారం పోలీసులు నాలుగు గంటల పాటు విచారించారు. మీడియా ప్రతినిధులను పోలీస్ స్టేషన్ ప్రాంతానికి అనుమతించకుండా జగన్ టూర్ లో దెబ్బతిన్న హెలికాప్టర్ కు సంబంధించి, ఎలిపాడ్ లో జరిగిన సంఘటన సంబంధించి ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, సికేపల్లి పోలీస్ స్టేషన్ సిఐ శ్రీధర్ నేతృత్వంలో సికేపల్లిపోలీసులు ప్రత్యేకంగా పైలెట్, కో పైలెట్ లను దాదాపు 28 ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకున్నట్లు తెలియ వచ్చింది. హెలికాప్టర్లో ఏ ఏ విభాగాలు దెబ్బ తిన్నాయి? హెలికాప్టర్లో వైఎస్ జగన్ ఎందుకు వెళ్ళలేదు? హెలికాప్టర్ దెబ్బతిన్నప్పుడు మీరు ఎలా వెళ్లారు? డెస్టినేషన్ పాయింట్ కు వెళ్లారా లేదా? కుంటిమద్ది ఎలిపాడ్ లో నాయకులు, కార్యకర్తలు హెలికాప్టర్ పై దాడి చేశారా ? ఇలాంటి పలు ప్రశ్నలను పోలీసులు వేసినట్లు తెలిసింది.. పైలెట్లు పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారని ఇచ్చారని, అయితే విచారణ సంబంధించి పూర్తి వివరాలు బహిర్గతం చేయలేదు. విచారం తర్వాత పోలీసుల దగ్గరుండి పైలెట్ , కో పైలట్లను ఎస్కార్ట్ వాహనంలో ఎక్కించి బెంగళూరుకు పంపినట్లు తెలియ వచ్చింది.. దీంతో ఇటు పోలీసులు గానీ , అటు పైలెట్లు గాని మీడియా ముందుకు రాకపోవడం గమనించదగ్గ విషయం.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల ఎనిమిదో తేదీన ప్రయాణించిన హెలికాప్టర్ దెబ్బతిన్న ఘటనపై శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు చేపట్టిన విచారణ బుధవారం సాయంత్రం ముగిసింది. బెంగళూరులోని చిప్సన్ ఏవియేషన్ హెలికాప్టర్ పైలెట్, కో పైలెట్ లను సుమారు నాలుగున్నర గంటల పాటు పోలీసులు విచారిస్తారు.

వార్త

జాతీయ ప్రగతి అంటే వ్యక్తుల శ్రమ, శక్తి, నిజాయతీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

-మార్షల్

# ముందే తెలిసింది

ఈ మధ్య తరచూ ఎండాకాలం ముందే వచ్చిందని తెగ విసవిసలుపోయిన జనానికి భారత వాతావరణ శాఖ అధిక ఎండలే కాదు, ఈ ఏడాది అధిక వర్షపాతం కూడా చూస్తామని ముందే హెచ్చరించింది. ఇది రైతాంగానికి తీపి కబురే. వ్యవసాయానికి పండగే ! ఎండా వానా కుక్కల నక్కల పెళ్లి అంటూ చిన్నతనంలో ఎండ కాసినప్పుడు ఉన్నట్టుండి వాన చినుకులు పడితే ఎగిరి గంతేసే వాళ్ళు. అది చిన్నప్పటి ముచ్చట. కాగా ఇప్పుడు కూడా అలాంటి ఆనందోత్సాహాలు వెల్లివిరిసినా రైతుకు ఎలా ఫీల్ అవ్వాలో ఓ నవ్వు నవ్వుకుని తేలికపడాల్సి వస్తోంది. దక్షిణాదిన ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో అధిక వర్షాలు కురియడం శుభసూచికం. కళ్ళెదుట అకాల వర్షాలను చూస్తూ పంటల నష్టాలను ముందుంచుకొని రైతు వాపోతున్న సందర్భాలు చూస్తున్నాం. ఎప్పుడు వర్షాలు పడతాయో, ఎప్పుడు వడగాల్పులు వీస్తాయో, ఊహించలేని పరిస్థితి. అందువల్లనే అశేష ప్రజానీకం ఆకాశం కేసి చూసి మరీ తమ దైనందిన కార్యక్రమాలను నిర్ణయించుకుంటున్నారు. ప్రకృతి బీభత్సాలను తిట్టుకుంటూ కూర్చోవడం రైతు వంతయ్యింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల రైతాంగం ఈ అకాల వర్షాలకు, పిడుగు పాటులకు, మేఘాల అలజడికి బిక్కు బిక్కుమని కూర్చుంటున్నారు. తాజాగా ఐఎండీ వ్యవసాయదారులకు ఆశాజనక పరిస్థితులున్నాయన్న చల్లని కబురు చెప్పింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. ఈ సీజన్లో ఎల్‌నినో పరిస్థితులు ఎక్కువగా ఉండకపోవచ్చునని చెప్పింది. ఈ నాలుగు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. దీర్ఘకాలిక సగటులో వర్షపాతం 105 శాతం నమోదవుతుందని ఐఎండిచీఫ్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 1971-2020 మధ్యకాలంలో దీర్ఘకాల సగటు 87 సెంటీమీటర్లు మాత్రమే ఉండేదని పేర్కొన్నారు. భారత ఉపఖండంలో సాధారణం కన్నా అతి తక్కువ వర్షపాతం ఏర్పడే ఎల్‌నినో పరిస్థితులు ఈసారి దాదాపు తక్కువే. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రెండు రాష్ట్రాలలో అధిక వర్షాలు వస్తాయని అంచనా. మహారాష్ట్ర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కర్ణాటకలో ఇలాంటి పరిస్థితులే ఉంటాయని దక్షిణాది రైతుకి మంచి రోజులు వచ్చాయని, ఐఎండి రైతులకు ఎంతో ఉపశమనం కలిగించే వాతావరణ వివరాలు అందించింది. దేశ జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి ఈనాటి వ్యవసాయం జీవనోపాధి కల్పిస్తోంది. ఇదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ఆధారిత స్థూల జాతీయోత్పత్తి 18.2 శాతం మేరకు అభివృద్ధికి దోహదపడే కాలంగా పరిగణిస్తున్నారు.


దక్షిణ భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు పడటంఖాయం. విశేషంగా చెప్పుకోదగినది ఏమంటే వడగాడ్పులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విపత్తుగా పరిగణిస్తూ నిర్ణయించి, ఎవరైనా వడదెబ్బకు గురై మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించింది. ఇంత క్రితం వడదెబ్బ బాధితులకు ఆపద్బంధు పథకంకింద రూ. 50వేలు మాత్రమే ఉండేది. ఇక రైతుకు భీమా సౌకర్యం విషయానికొస్తే ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్మును కట్టించుకున్నా, మండలం ఒక యూనిట్‌గా భీమా విధానం ఉండడం వలన ఆ మండలం అంతా దెబ్బతింటే తప్ప దెబ్బ తిన్న రైతుకు వ్యక్తిగతంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. ఏదిఏమైనా వడగాల్పులు, అకాల వర్షాలు రైతుకు ఆందోళన కారణమే. దేశంలోనే రుతుపవన వేగాన్ని ప్రభావితం చేసే ఎల్‌నినో తాకిడి లేకపోవడం సర్వశుభకరం. ఇదిలా ఉంటే సాధారణ జనానికి ప్రస్తుతం పెరుగుతున్న ఎండలు చీకాకు తెప్పిస్తున్నాయి. దానికి తోడు ఎన్నో అవస్థలు ఇబ్బంది పెడుతున్నాయి. మొక్కలు నాటాలన్న స్పృహ లేనిప్రజల నిర్లక్ష్యపు చేష్టలతో పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తర భారతం క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడాది చలికాలంవణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి వివరీత వాతావరణ పరిస్థితులకు కారణం పర్యావరణ విధ్వంసమే. పాలకులతో పాటు, ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగి పొడి వాతావరణంతో వేడిమి వలన రేడియేషన్ పెరిగి భూమి బాగావేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణ శాఖ నిపుణుల విశ్లేషణ. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండిపోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగాచెప్పుకోవాలి. భూగర్భజలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రమైంది. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణానికి, పచ్చదనానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. తెలుగురాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలమవుతున్నాయి. ఉష్ణోగతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగు నీటికి కటకట ప్రారంభమైంది.వాతావరణ మార్పులు రైతు జీవితాల నుగందరగోళ పరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతును ఆదుకోవడంలో ప్రభుత్వాల బాధ్యత చెప్పుకోదగినది.

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.



జె.ముర్రే

# సంక్షోభంలో రొయ్యల సాగు!

**ఏ పంటఅయినా దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి జరిగినప్పుడే ఆపంట సాగుచేసే రైతుల సేద్యం ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. అందుకు భిన్నంగా ఉన్నపంటలన్నీనేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. నేటి ఆక్వాసంక్షోభం అందులో భాగమే. దేశప్రజల కోసం కాకుండా, వ్యాపార లాభాల కోసం విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నేడు దేశంలో విచ్చలవిడిగా ఆక్వాసాగు జరుగుతున్నది. ఫలితంగా కొన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అంతేకాకుండా ఆక్వాసాగువల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశప్రజలకు ఆహారాన్ని అందించే విధంగా దేశంలో ఆక్వాసాగు పరిమితం కావాలి. దాణాఖర్చులు తగ్గేవిధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదా సబ్సిడీ ఇవ్వటం చేయాలి. యూనిట్‌కు రెండున్నర రూపాయలకే అందించాలి. దేశీయంగానే ఎక్కువగా రొయ్యల విక్రయం జరగాలి. అప్పుడే ఆక్వాసాగు సంక్షోభం నుండి బయటపడుతుంది.**

**బొల్లిముంత సాంబశివరావు**

రొయ్యల సాగులో భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. చేపల ఉత్పత్తిలో మూడవ స్థానంలో ఉంది.2021-22లో చేపల ఉత్పత్తి 16.24 మిలియన్ టన్నులు. ఇందులో ఆక్వాకల్చర్ నుండి 12.12 మిలియన్ టన్నులు. ప్రపంచ మత్స్యఉత్పత్తిలో భారతదేశం 10శాతం పైగా ఉంది. ఆక్వారంగం ప్రాథమిక స్థాయిలో 2.8 కోట్లకు పైగా మత్స్యకారులు ఉపాధిని పొందుతున్నారు. కోట్లాది రూపాయల విదేశీమారక ద్రవ్యం భారత ప్రభుత్వానికి లభిస్తున్నది. ఆంధ్రప్రదేశ్లో 3.9 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నది. ఇందులో 1.8 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మరో రెండు లక్షల ఎకరాల్లో చేపల సేద్యం జరుగుతున్నది. ఈసేద్యం కోసం 63,334 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం లక్షా 35 వేలమంది ఆక్వా కల్చర్ సాగు చేస్తున్నట్లు ఈక్రాపింగ్ ద్వారా తెలుస్తున్నది. వీరిలో 2.5 ఎకరాలలోపు సాగుచేస్తున్న రైతులు 95,277 మందికాగా, 2.5 నుంచి 5ఎకరాలలోపు సాగు చేస్తున్న వారు 22,358 మంది ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్నవారు 11,809 మంది ఉంటే, 10 ఎకరాల కన్నా ఎక్కువ సాగు చేస్తున్నవారు 6,398 మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రతిసంవత్సరం రాష్ట్రానికి 18లక్షల టన్నుల ఆక్వాఉత్పత్తుల ద్వారా 66వేల కోట్ల ఆదాయం వస్తుంది. భారతదేశం నుంచి జరిగే ఆక్వా ఎగుమతుల్లో 40శాతం ఏపి నుంచే జరుగుతున్నది. రాష్ట్రం నుంచి ఎక్కువగా చైనా, అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రొయ్యల చెరువుల ఫలితంగా తీరప్రాంత గ్రామాల భూములు ఉప్పునీటి భూములుగా మారటంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాగునీటి సమస్యతో పాటు రొయ్యల చెరువులు తీరప్రాంత ప్రజల జీవితాలను అల్లకల్లోలంగా మార్చింది. నష్టాలపాలైన చాలామంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చింది. మరొకవైపున కొద్దిమంది ఆక్వాసాగులో గుత్తాధిపత్యం వహించారు. సాంకేతిక పరికరాలతో అధిక రొయ్యల ఉత్పత్తి సాధించారు. ఆక్వా సాగు ఖర్చులు వేగంగా పెరిగాయి. అందుకు దాణా ధరల పెరుగుదల, కరెంట్ ఛార్జీలే కారణం. ఈ పెరుగుదల చిన్న సాగుదార్లకు భారంగా మారినా రొయ్యల ధర అనుకూలంగా ఉండటం వలన సాగును కొనసాగించారు. రొయ్యల సాగు ఎగుమతులపై ఆధారపడి ఉంది. మొత్తం సాగులో 90 శాతం ఎగుమతి జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్లో 27 ప్రాసెసింగ్ యూనిట్లు రొయ్యలను ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ సాగుదార్లకు నాణ్యమైన వనామీ రొయ్యపిల్లలు లభ్యం కావటంలేదు. ఈ విషయంలో ఈక్వెడార్, ఇండోనేషియా, భారత్ కన్నా చాలాముందు ఉన్నాయి. అందువల్ల భారతదేశం కన్నా దిగుబడి ఎక్కువ ఉంది. ఫలితంగా భారత్ కన్నా ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరలకు ఎగుమతి చేస్తున్నాయి. ఈ దేశాల నుంచి మనదేశ సాగుదార్లు పోటీ ఎదుర్కొంటున్నారు. 2023-24లో రొయ్యల ఎగుమతి ద్వారా భారతదేశానికి 5.2 బిలియన్ల అమెరికా డాలర్ల ఆదాయం పొందింది. రాష్ట్ర జిడిపిలో ఆక్వారంగం కీలకపాత్ర ఉంది. 2023-24 ఆర్థికసంవత్సరంలో దేశంలో కోటి 84వేల టన్నుల మత్స్యఉత్పత్తులు జరగగా, 51.58 లక్షల టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉంది. రొయ్యల ఉత్పత్తిలో 76శాతం, చేపల ఉత్పత్తిలో 28శాతం,ఏపీలోనే జరుగుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే భారతదేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అందులో 92శాతం రొయ్యలే.వ్యవసాయ



అనుబంధ రంగాల స్థూల ఆదాయ నిష్పత్తిలో 9.15శాతం ఆక్వారంగం నుంచే వస్తున్నది. రొయ్యల దాణా రేట్లు నిరంతరం పెరుగుతూ ఉంటే, గత మూడు సంవత్సరాలుగా రొయ్యల ధర తగ్గుతూ ఉంది. 2022లో 30కౌంట్రొయ్య ధర 600 నుండి 400లకు పడిపోయింది. 60 కౌంటధర 400 నుంచి 250రూపాయలకు, 80 కౌంట్ 310నుంచి 220 రూపాయలకు ధరతగ్గింది. ఫలితంగా రొయ్యసాగుదార్లు తీవ్రంగా నష్టపోయారు. ధరలు తగ్గి నష్టపోతున్న తమను ఆదుకోవాలని రొయ్యసాగు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం రొయ్యలకు మద్దతుధర ప్రకటించి రైతులకు మేలుచేసినట్లు చెప్పుకుంది. వంద కౌంట్ కిలోరొయ్యల సాగుకి 270 సాగు ఖర్చుగా ఉంటే, వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 210 రూపాయలు మాత్రమే. ఈ మద్దతు ధర రైతులకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదు. వైసీపీ ప్రభుత్వం రొయ్యలసాగు రైతులకు విద్యుత్ యూనిట్‌కు 1.50 రూపాయలకే ఇస్తున్నట్లు ప్రకటించి దాన్ని ఆక్వాసాగు రైతులందరికీ సరఫరా చేసింది. ఏడాది గడిచిన తర్వాత చిన్నరైతులకే దాన్ని పరిమితం చేసి మిగతా రైతుల నుంచి యూనిట్‌కు 3.50 రూపాయలు వసూలు చేసింది. ఒక ఎకరాచెరువుకు నెలకు 7,700 యూనిట్లు అవసరం. యూనిట్‌కి 3.50 రూపాయల వలన ఆ నెలకు 26 వేలు చెల్లించాలి. ఇది ఆక్వారైతులకు చాలా భారంగా మారింది. అసలే సంక్షోభంలో ఉన్న ఆక్వా సాగుదారులను ట్రంప్ విధించిన సుంకాలు మరింత సంక్షోభంలోకి నెట్టింది. భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27శాతం సుంకాన్ని విధించాడు.ఇదికాక భారతదేశ రొయ్యలపై అమెరికా యాంటిడంపింగ్ డ్యూటీతోపాటు 5.7శాతం కౌంటర్వైలింగ్ సుంకం వసూలు చేస్తున్నది. ఈసుంకాలన్నీ కలిపి 35శాతంపైగా ఉన్నాయి. మొత్తం సుంకాలను కలుపుకుంటే లక్షరూపాయల విలువ చేసే రొయ్యలపై 35 వేల దాకా సుంకం కట్టాలి. దీనికి ప్యాకింగ్ ఖర్చులు అదనం. భారతదేశ నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27 శాతం సుంకం విధించిన అమెరికా ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై 10శాతం సుంకం మాత్రమే విధించింది. వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాలు, భారతదేశం నుంచి షీపుడ్స్ కొనుగోలు చేసివాటిని ప్రాసెస్చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి.ఇప్పుడు అమెరికా విధించిన సుంకంవల్ల ఆదేశాలు భారత్ నుంచి ఆర్డర్లు రద్దు చేసుకున్నాయి. మరొక వైపున రైతుల నుంచి సేకరణను ఎగుమతి దారులు రద్దు చేసుకున్నారు. యూరోపియన్ యూనియన్లో భారత ఎగుమతిదారులు 50శాతం తనిఖీ రేట్లు, 4నుండి 7శాతం దిగుమతి సుంకంతో సహా నానా టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ దేశాలతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీని పొందాయి.దీనివల్ల వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను ఆక్రమించాయి.అమెరికా సుంకం పేరుతో భారత వ్యాపారులందరూ సిండికేట్‌గా ఏర్పడి రొయ్యల కొనుగోలు ధరలు తగ్గించారు. ఫలితంగా రొయ్యసాగుదార్లు తీవ్రనష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలతో ఆక్వాసాగుచేయలేమని పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుకి పంటవిరామం ప్రకటించారు. ఆక్వా సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కమిటీవేసి, కేంద్రానికిలేఖ రాసి చేతులు దులుపుకున్నారు. ఏ పంటఅయినా దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి జరిగినప్పుడే,ఆపంట సాగు చేసే రైతుల సేద్యం ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. అందుకు భిన్నంగా ఉన్నపంటలన్నీ నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. నేటి ఆక్వా సంక్షోభం అందులో భాగమే. దేశప్రజల కోసం కాకుండా, వ్యాపార లాభాల కోసం విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నేడు దేశంలో విచ్చలవిడి ఆక్వా సాగు జరుగుతున్నది. ఫలితంగా కొన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. అంతేకాకుండా ఆక్వా సాగువల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే విధంగా దేశంలో ఆక్వాసాగు పరిమితం కావాలి. దాణా ఖర్చులు తగ్గేవిధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదా సబ్సిడీ ఇవ్వటం చేయాలి. యూనిట్‌కు రెండున్నర రూపాయలకే అందించాలి. దేశీయంగానే ఎక్కువగా రొయ్యల విక్రయం జరగాలి. అప్పుడే ఆక్వాసాగు సంక్షోభం నుండి బయటపడుతుంది. •

# ఆత్మవిశ్వాసంతో విజయపథంలోకి!

**మామిండ్ల శ్రీనివాస్**

పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక భాగం. అవి మనం నేర్చుకున్నవి ఎంత వరకు అర్థమైందో అంచనా వేయడానికి ఉపయోగపడతాయి. కానీ, పరీక్షలే జీవితం అన్న భావన పూర్తిగా తప్పు. జీవితం అనేక అవకాశాలు, అనేక అనుభవాలతో కూడి ఉంటుంది. ఒక పరీక్షలో విఫలమయితే జీవితం మొత్తం అంధకారంగా మారిపోదు. ప్రతి పరీక్ష ఓ అంచనా మాత్రమే, కానీ అది విజయం లేదా వైఫల్యాన్ని నిర్దేశించే చివరి అంకం కాదు. ఈ రోజుల్లో విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురవుతున్నారు. మంచి ర్యాంకులు, అత్యుత్తమ మార్కుల కోసం శ్రమిస్తూ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు. కొందరు విద్యార్థులు పరీక్షలలో విఫలమైతే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. మరికొందరు తీవ్ర మానసిక సంఘర్షణకు గురై కుంగిపోతున్నారు. ఇది వారి భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. వాస్తవానికి, ఒక పరీక్షలో వచ్చిన మార్కులు వారి జీవితాన్ని నిర్ణయించలేవు. ప్రతివ్యక్తికీ ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయి. కొంతమందికి గణితం బలంగా ఉండవచ్చు, మరికొందరికి భాషలు, సైన్స్, కళలు, క్రీడలు బలంగా ఉండవచ్చు. మార్కులు మాత్రమే కాదు, మన నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా విధానం కూడా మన విజయంలో కీలక పాత్ర వహిస్తాయి. విజయానికి మార్గాలు అనేకం పరీక్షలలో విఫలమైన వారు జీవితంలో గొప్ప విజయాలు సాధించిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. అల్బర్ట్ ఐన్‌స్టీన్ చిన్నప్పుడు మంచి విద్యార్థి కాలేదు, కానీ ఆయన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యారు. థామస్ అల్వా ఎడిసన్ అనేకసార్లు విఫలమయ్యారు, కానీ ప్రపంచాన్ని మార్చిన పరిశోధనలు చేశారు. ఇవే కాకుండా,జీవితంలో విజయం అనేక మార్గాల్లో సాధించవచ్చు. ఒక రంగంలో విఫలమైనప్పుడే, ఇంకో రంగంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. మనకు ఆసక్తి ఉన్న విషయాలను అర్థంచేసుకుని, వాటిని అభివృద్ధి చేసుకుంటే, మరింత మంచి భవిష్యత్తును సృష్టించుకోవచ్చు. పరీక్షలు అనేవి ఒకఅంచనా మాత్రమే పరీక్షలు అవసరమే, కానీ అవి మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేవు. విద్య అనేది మార్కులకే పరిమితంకాదు. మంచి వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశీలనా శక్తి, క్రమశిక్షణ కూడా విజయానికి కీలకం. విద్యార్థులు పరీక్షలపై భయపడకుండా, వాటిని ఒక అవకాశంగా భావించాలి. ఒక పరీక్షలో సరిగ్గా రాయకపోయినా, తదుపరి అవకాశాలను వినియోగించుకోవచ్చు. ప్రతిసారి కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. విఫలమైనా మనలో ఉన్నశక్తిని గుర్తించి, ముందుకుసాగాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భూమిక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తేవకూడదు. పరీక్షలు ముఖ్యమైనవే, కానీ అవి జీవితాన్ని నిర్ణయించే అంశాలు కావు. పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వాలి, వారి ఆసక్తులను గుర్తించాలి. వాళ్లను మార్కుల కోసం ఒత్తిడికి గురిచేయకుండా, వారి నైపుణ్యాలను మెరుగుపరిచేలా ప్రేరేపించాలి. పరీక్షలు కేవలం ఒక అంచనా వేసే పద్ధతి మాత్రమే. అవి జీవితాన్ని నిర్ణయించలేవు. ఒకసారి మార్కులు తక్కువ వచ్చినా, అది జీవితాంతం ప్రభావం చూపదు. కష్టపడి పని చేస్తే, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే, విజయం తప్పక వస్తుంది. కాబట్టి, విద్యార్థులు పరీక్షలకు భయపడాల్సిన అవసరం లేదు. పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే, గమ్యం కాదు. విజయానికి అనేక మార్గాలు ఉన్నాయి. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే, నిజమైన విజయం సాధించవచ్చు. •

# ప్రజావాక్కు



## టిఐఎస్‌లో తప్పులు సరిచేయాలి

టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో చాలాపొరపాట్లు ఉన్నాయి. వాటిని సరిచేయడానికి ఉపాధ్యాయులకు డిడిఓ స్థాయిలో అవకాశం కల్పించాలి.తప్పులను సరిచేసేపని డిడిఓలకు అప్పగించాలి.డిసెంబర్ నెలనుంచి అప్డేట్ కోసం అవకాశం ఇస్తున్నామని ప్రస్తుతం సరిచేసుకోవడం సరికాదని అందువల్ల ఇప్పుడుజిల్లా విద్యాశాఖాధికారి వద్ద మాత్రమే అవకాశం ఇస్తున్నామని విద్యా శాఖ తెలుపుతోంది. టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నందు అప్లోడ్ చేసినప్పుడు ఉన్న సమాచారం,దాన్ని డిస్ప్లే అవుతున్న సమాచారానికి తేడా ఉంటున్నదని ఉపాధ్యాయ వర్గాలు తెలుపుతున్నాయి. టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నందు సాంకేతిక సమస్య వల్ల తప్పులు వస్తున్నాయి అనేది ఉపాధ్యాయులు చెబుతున్న సమాచారం.వీటిని సరిచేసుకునే అవకాశము ఉపాధ్యాయులకుఇవ్వకుండానే ఫెసియల్‌అటెండెన్స్ యాప్ నందు వివరాలు సరిగా ఉన్నాయని కన్ఫర్మేషన్ చేయమని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదు.

-వాసిలి సురేష్,నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## టెట్ నిబంధనలు మార్చాలి

టెట్ నిర్వహణలో ఉమ్మడిరాష్ట్రంలో ఉన్ననిబంధనలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వాటిలో కొన్ని లోపాలు ఉన్నాయి. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి రూల్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు టెట్‌పరీక్ష నిర్వహణ చేస్తున్నాము అని చెప్తున్నప్పటికి కొన్ని రకాల వ్యత్యాసాలు ఉన్నాయి. డిగ్రీ, డి.ఎడ్ చేసిన వారికి టెట్‌పేపర్ 2లోపరిధిలో జరిగే కేంద్ర టెట్‌లో అనుమతిఇస్తున్నారు.ఉమ్మడిఆంధ్రప్రదేశ్‌లో కూడా నాలుగు సార్లు అనుమతి ఇచ్చి తెలంగాణలో తొలగించారు. రిజర్వేషన్ అంశాలుకూడా కేంద్ర రాష్ట్ర టెట్‌లో వేర్వేరు ఉన్నాయి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## భూభారతికి వందనం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలో భాగంగా భూభారతి అనే కొత్తపథకం తీసుకురావడం సంతోషకరం. ఈ పథకం ద్వారా వ్యవసాయ భూములు ఇండ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు కూడా పరిష్కారం కావాలి. భూ కబ్జాలు కొంతవరకు నివారణ అవుతాయి. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన భూములు ఈ చట్టంలో ప్రత్యేకంగా పొందుపరచాలి.భూసమస్యలు, భూ వివాదాలుపరిష్కరించాలి.

-పి. నర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

## వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి

భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌పార్టీ మీద అసహ్యంతో జాతిపిత మహాత్మా గాంధీ గారి గురించి నవభారత నిర్మాత పండిట్ నెహ్రు గారి గురించి వక్ర చరిత్ర చెబుతూ, వీలైనప్పుడల్లా వాళ్ళును తక్కువ చేస్తూ పనికిమాలిన పటేల్ను పొగిడేస్తూ ముచ్చటగా మూడోసారి మోడీజీని ప్రధానిగా ఎన్నుకున్నందుకు మనకు తగిన శాస్తిజరిగింది. పేదవారికి, పెద్దవారితో చెలిమిఎప్పుడూ ప్రమాదమే.ఆనాటిరోజుల్లో నెహ్రూ కమ్యూనిస్టులతోనూ, రష్యాతో సరదాకి చెలిమి చేయలేదు. కమ్యూనిస్టులకి సమానత్వ భావం ఉంటుంది. పెట్టుబడిదారులు పేదవారిని ఉపయోగించుకుంటారు వారిని పొగుడుతూ ఉంటారు కేవలం పనిచేయించుకోవడానికే. ఊడిగం చేయించుకోవడానికే. మోడీగారు అమెరికాతో స్నేహానికి అర్రులు చాచుతూ ఉన్నారు. ట్రంప్ కంపు మన సరదా మనకు తీర్చేసింది. వ్యవసాయానికి పెద్దపీట వేయాలి. వ్యవసాయం చేయడానికి ప్రజలకు సాయం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధి నేతలు చేయాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## చట్టాన్ని నిర్వీర్యం చేయడమే

కేంద్రం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ఉపాధి హామీ లక్ష్యంనెరవేరడం కష్టంగా మారింది. భూమిని అబివృద్ధి చేసి సాగు యోగ్యంగా మార్చడం అనే పనిని చేయగలిగే పనుల నుండి కేంద్రం తీసివేయడం ఒక అనాలోచిత చర్య. అయితే దీనివల్ల నిరూపయోగం అయిన భూమిని చదును చేసి సాగు యోగ్యంగా మార్చడం మూలంగా ఎక్కువ మందికి ఒకే ప్లేస్ లో ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. అంత మాత్రమే కాదు ఎక్కువ మొత్తంలో సగటు కూలి లభిస్తుంది. ఇలా బహు విధాలుగా వ్యవసాయ కూలీలు బాగుపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి పనిని తీసివేయడం దుర్మార్గమైన చర్య.

-భారత అవినాష్, జనగామ

## సర్వే ఫలితాలు నిరాశాజనకం

ఇటీవల రాష్ట్రంలో వివిధ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్ష చేసే సర్వేజరిగింది.ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. విద్యార్థులు ఏకాగ్రత, ఉత్సాహంగా పాఠాన్ని, ఇంటి చదువునీ పట్టించక వృధా నష్టంకలిగించే వాటిలో నిమగ్నమవుతున్నారు. 15 ఏళ్ల వరకు ఉన్న వారిని పుస్తక పఠనం పై మంచి ఆసక్తి కలుగుతుంది. ఈ ప్రక్రియ సాధ్యమైన చోట్ల విద్యాభిమానులు, యువత, సంఘాల ప్రతినిధులతో చేస్తే చాలా మంచిది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రాయల్ డిసీజ్ పై అవగాహనే ప్రధానం

**డి. జె మోహన రావు**

ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా డబ్లుఎఫ్హెచ్) స్థాపకులు ఫ్రాంక్ ష్నాబెల్ పుట్టినరోజును పురస్కరించుకుని విశ్వవ్యాప్తంగా ప్రపంచ హిమోఫిలియా దినోత్సవాన్ని 1989 నుండి ప్రతీ ఏడాది ఏప్రిల్17న హిమోఫిలియాతో పాటుగా ఇతర జన్యు రక్తస్రావ రుగ్మత వ్యక్తుల జీవితాలను మెరుగుపరిచేందుకు అంకితమైన లాభాపేక్షలేని అంతర్జాతీయసంస్థ ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం ఆధ్వర్యంలో జరుపుతారు. ఈ సంస్థని 1963లో ఫ్రాంక్ ష్నాబెల్ స్థాపించారు. ఈయన తీవ్రమైన హిమోఫిలియాతో జన్మించారు. ఈసంస్థ ప్రధాన కార్యాలయం కెనడాలోని మాంట్రియల్‌లో ఉంది. ఇది 147 దేశాలలో సభ్య సంస్థలను కలిగిఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థనుండి అధికారిక గుర్తింపు పొందింది. ఈ రోజున రక్తస్రావం రుగ్మతలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యచికిత్స కోసం అవగాహన కలిగిస్తారు. ఈ సంవత్సరం థీమ్ అందరికీ అందుబాటులోఉంది. రక్తస్రావ రుగ్మతలు ఉంటూ నిర్ధారణ చేయబడిన మహిళలు, బాలికలు ఇప్పటికీ ఉన్నారని, ఒక వేళ వ్యాధి మూలాలు ఉన్నవారికి తక్కువ సేవలు అందుతున్నాయని, వీటిని మార్చవలసిన బాధ్యత సమాజానికి ఉందని ఈ ఇతివృత్త సారాంశం. ఇతివృత్తం కేవలం అవగాహన గురించి మాత్రమే కాదు. లింగంతో సంబంధం లేకుండా అందరూ వారికి అవసరమైన రోగ నిర్ధారణ, చికిత్స, సంరక్షణను పొందేలా చూసుకోవాలని, ఈ సంవత్సరం ఇతివృత్తం ఆరోగ్య సంరక్షణలో సమానత్వ ప్రాముఖ్యతను, రక్తస్రావం రుగ్మతలు ఉన్న మహిళలు, బాలికల అవసరాలకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కలుపుకొని ప్రతిస్పందించేలా ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం 2025 అనేది రక్తస్రావం రుగ్మతలు వివక్ష చూపవని, మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కూడా వివక్ష చూపకూడదని గుర్తుచేస్తుంది. హిమోఫిలియా, ఇతర రక్తస్రావం రుగ్మతల గురించి అవగాహన పెంచడం. ఈ పరిస్థితుల వల్ల బాధపడే వ్యక్తులకు మద్దతును అందించడం. రోగ నిర్ధారణ చికిత్సకు మెరుగైన ప్రాప్యత కలిగించడం ప్రధాన లక్ష్యాలు. హిమోఫిలియా వ్యాధి మొదటిగా పురాతన ఈజిప్టులో కనిపించింది.అయితే 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌కు చెందిన విక్టోరియా రాణి ద్వారా ఈ వ్యాధి ఆమె వారసులకు వ్యాపించింది. అలాగే 19, 20వ శతాబ్దాలలో ఇంగ్లండ్, జర్మనీ, రష్యా, స్పెయిన్ రాజకుటుంబాలను ప్రభావితం చేసినందున ఈ వ్యాధిని కొన్నిసార్లు రాయల్ డిసీజ్ లేదా రాజరిక వ్యాధి అని పిలుస్తారు. హిమోఫిలియా అరుదైన జన్యుపరమైన వంశపారంపర్య రక్తస్రావ రుగ్మత. దీనిలో రక్తం సాధారణంగా గడ్డకట్టదు. రక్త ప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టడానికి కొన్ని రసాయనాలు ఉంటాయి. వాటిని గడ్డకట్టే కారకాలని అంటారు. ఇవి రక్తం గడ్డకట్టడానికి సహాయపడతాయి. ఒక





వ్యక్తి రక్తంలో ఈ కారకాలు సాధారణ మొత్తంలో లేనప్పుడు లేదా రక్తం గడ్డకట్టడానికి అవసరమైన గడ్డకట్టే కారకం ప్రోటీన్‌లను తయారుచేయడానికి సూచనలను అందించే జన్యువులలో పరివర్తన (మ్యుటేషన్) లేదా మార్పువల్ల హిమోఫిలియా సంభవిస్తుంది. ఈవ్యాధిఉన్న వారికి చిన్నగాయాల నుండికూడా దీర్ఘకాలిక రక్తస్రావం జరుగుతుంది. ఈ వ్యక్తులు గాయపడినప్పుడు, శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు ఎక్కువసేపు రక్తస్రావం అవుతుంది. కొన్ని సందర్భాల్లో కీళ్లలో, మెదడులో కూడా అంతర్గత రక్తస్రావం సంభవించవచ్చు.ఫ్యాక్టర్ 8ప్రొటీన్ లోపం హిమోఫిలియా-ఎ, ఫ్యాక్టర్ 9 ప్రొటీన్ లోపం హిమోఫిలియా -బి, ఫ్యాక్టర్ 9 ప్రొటీన్ లోపం హిమోఫిలియా -సి వ్యాధులను కలుగజేస్తాయి.దీనికి కారణమయ్యే జన్యువు 'ఎక్స్' క్రోమోజోములో ఉంటుంది. అందువలన పురుషులు ఎక్కువగా ప్రభావి తమవుతారు. ఈ జన్యువును కలిగిన తల్లి ఒక వేల మగ బిడ్డను ప్రసవిస్తే ఆ అబ్బాయి కూడా ఈ వ్యాధి బారినపడే అవకాశం యాభై శాతం, అదే ఆడ పిల్లకు జన్మనిస్తే ఆ పాప క్యారియర్‌గా ఉండే ప్రమాదం యాభై శాతం ఉంది. అందువల్ల హిమోఫిలియా పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. అయినప్పటికీ ఇది స్త్రీలను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల అమ్మాయిలలో బుతుస్రావం, ప్రసవానికి ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధిగలవారు సుమారు నాలుగు లక్షల మంది ఉన్నారు. వాస్తవంగా ప్రపంచవ్యాప్తంగా హీమోఫిలియాతో నివసిస్తున్న వారిలో 75శాతం కంటే ఎక్కువ మందిని ఇంకా గుర్తించలేదు. అన్ని దేశాల జాతుల మధ్య సమానంగా పంపిణీచేయబడింది. ఇది పదివేలసజీవ జననాలలో ఒకరికి ఈ వ్యాధిసోకే అవకాశం ఉంది.మొత్తం హిమోఫిలియా జనాభాలో 80శాతం నుండి85శాతం వరకు హిమోఫిలియా 'ఎ' రకం వారు ఉన్నారు. భారతదేశంలో సుమారు 1,36,000 మంది బాధితులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఎందుకంటే ఈ వ్యాధి నిర్ధారణ కానివారు చాలామంది ఉండవచ్చు. ప్రపంచంలో మనదేశం రెండవ స్థానంలో ఉంది. వ్యాధి ఉన్న వారి మోకాలు, మోచేతులు, చీలమండలు, కణజాలం, కండరాలలో కూడా భారీ అంతర్గత రక్తస్రావం ఏర్పడుతుంది. ప్రభావిత ప్రాంతాల్లో వాపు, నొప్పివంటి పరిణామాలకు దారితీస్తుంది. ప్రభావితమైన శరీర భాగాలకు శాశ్వత నష్టం కలుగుతుంది. ముఖ్యంగా మెదడులో రక్తస్రావం జరిగినప్పుడు అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. తేలికపాటి లేదా మితమైన హిమోఫిలియా బాల్యం లేదా కౌమారదశలో కనిపిస్తుంది. వీరిలో ఆకస్మిక రక్తస్రావం అసాధారణం. తీవ్రమైన హిమోఫిలియా సాధారణంగా జీవితంలోనిమొదటి కొన్ని నెలల్లో కనబడుతుంది. వీళ్ళల్లో తరచుగా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. ఇది బహుళ అవయవాలపై ప్రభావం చూపుతుంది. కీళ్ళల్లో రక్తస్రావం తరచుగా పునరావృతమైతే కీళ్ళ హిమోఫిలియాకు దారితీస్తుంది. హిమోఫిలియా అనేది వంశపారంపర్యంగా వచ్చేవ్యాధి కావున దీనిని నివారించలేం. వీరు శస్త్రచికిత్సలు, దంత చికిత్సలకు ముందు వైద్యులకు తెలియజేయాలి. సమతుల్య ఆహారం, సరైన పోషకాహారం హిమోఫిలియా ఉన్నవారుసాధారణ జీవితాన్ని గడపడానికి సహాయపడతాయి.సరైనచికిత్స,జాగ్రత్తలతో హిమోఫిలియా ఉన్నవారు సాధారణ జీవితం గడపగలరు. •

## సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన రాష్ట్ర స్థాయి క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. జూనియర్ 52 కేజీల విభాగంలో ఎం.కావ్య బంగారు పతకం, సబ్‌జూనియర్ 120 కేజీల విభాగంలో జి.శ్రీచంద్ర బంగారు పతకం, ఎం.ఐశ్వర్య రజత పతకం, 63 కేజీల విభాగంలో వి.దివ్య కాంస్య పతకం, జూనియర్ 76 కేజీల విభాగంలో డి.రమ్య కాంస్య పతకం, మహిళల మాస్టర్స్ విభాగంలో ఎం.సునీత కాంస్య పతకం, కె.పార్వతి రజత పతకం, మస్సుర్ ఆలీఖాన్, ఎం.రాజేష్ కాంస్య పతకం సాధించారు. సత్తా చాటిన క్రీడాకారులను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అభినందించి క్రీడల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని, మరిన్ని ఘన విజయాలతో జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

## భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



అగ్ర నేతలపై కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసును రాజకీయం చేసి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ లపై అసత్య ఆరోపణలతో ఛార్జి షీట్ దాఖలు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమన్నారు. యంగ్ ఇండియా సంస్థ లాభాపేక్ష లేనిదని, రాజకీయ కక్ష సాధింపుకు దిగడం శోచనీయమన్నారు. బిజెపి బెదిరింపు రాజకీయాలకు జడిసేది లేదని, ప్రజా మద్దతుతో గట్టిగా ప్రతిఘటిస్తామన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు టి.నాగలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు రసూల్, దర్శి, ఒంగోలు, కొండపి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల కోఆర్డినేటర్లు కెవి కృష్ణారెడ్డి, బిటర్ గౌస్, శ్రీపతి సతీష్, పాలపర్తి విజేష్‌రాజ్, పార్టీ నేతలు మన్నం ప్రసన్నరాజు, ఎన్.సుబ్బారావు, సుదర్శ రవి, బొద్దు సతీష్, సుధీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కియా మోటార్స్ క్యాంపస్ డ్రైవ్

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలల్లో గురువారం ఉదయం 9 గంటలకు కియా మోటార్స్ పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి సిద్దా హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం కియా మోటార్స్, ఎఆర్ఎమ్ఎస్ బృందం విద్యార్థులకు వ్రాత పరీక్ష, టెక్నికల్ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి హెచ్ఆర్ రౌండ్ ద్వారా నియామకం చేస్తారని తెలిపారు. జిల్లాలోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు బయోడేటా, ఆధార్, పాన్‌కార్డు, మార్క్స్ మెమోతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సమతానగర్‌లో నివాస గృహాల యందు వంట గ్యాస్‌పై, ఆయిల్ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్ సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ గురించి మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

### - డిఇఓ కిరణ్ కుమార్

**కొత్తపట్నం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం ఈతముక్కల ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు ఏర్పాటుచేసిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని డిఇఓ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని తెలియజేశారు. ఈతముక్కల క్లస్టర్ స్థాయిలో ఎన్రోల్మెంట్ పెరుగుదల కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని , ఉపాధ్యాయులు అందరూ శ్రమించి వచ్చే అకాడమిక్ ఇయర్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు బడి లో ఉండే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. క్లస్టర్ పరిధిలో పాఠశాల స్థాయిలో ఐదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని అందులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులకు గీతిక, వైష్ణవి ,పావని లు గెలుపొందారు వారికి బహుమతి ప్రధానం చేయడం జరిగింది. పాఠశాలలో మొదటి అడ్మిషన్ ను డిఇఓ చేతుల మీదుగా చేర్పించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు బలపేతానికి టీచర్లందరూ కృషి చేయాలని సమాజాన్ని బుద్ధి చేసే బాధ్యతను నెత్తికెత్తుకోవాలని మంచి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే కృషి ఉపాధ్యాయులు చేయాలని తెలియజేశారు. ఈతముగల కష్టం లో ఉన్న స్కూల్స్ అన్నిటికీ టిఎల్ఎం మెటీరియల్ అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిరణ్ కుమార్ ఎంఈఓ పద్మావతి హెచ్ఎం చించు పున్నయ్య ఒంగోలు ఎంఈఓ కిషోర్ బాబు డి సి బి ఎం శ్రీనివాసరావు స్కూల్ సిబ్బంది క్లస్టర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో చేనేత కార్మికుడు మృతి

**వేటపాలెం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ఈ సంఘటన బాపట్ల జిల్లావేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ అనుమల్లిపేటలో బుధవారం ఉదయం 6గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తెల్లవారు జామున అకాలంగా కురిసిన వర్షం ఈదురు గాలులకు బయటకు వెళ్లి పాలు తెచ్చుకునేందుకు సిద్ధమైన బొడ్డు మోహన్‌రావు(64) అడ్డుగా పడిఉన్న కరెంటు తీగను తొలగించే ప్రయత్నంలో చేతితో పట్టుకున్నాడు. అంతే క్షణాల్లో అక్కడికక్కడే విగత జీవుడై పడిపోయాడు. స్థానికులు గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సర్వీస్ వైర్లు పరిశీలించారు. మృతుడు చేనేత కార్మికుడు మగ్గం పని కుటుంబ జీవనాధారం. మోహన్‌రావుకు భార్య, ఇద్దరుపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ప్రొజెక్టర్ ద్వారా అంబేద్కర్ చిత్రం ప్రదర్శన

**టంగుటూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని అరుంధతి నగర్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా బొమ్మలు సెంటర్‌లో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర చిత్ర ప్రదర్శన అరుంధతి నగర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ చిత్రం అలనాటి బాధలను కన్నులు కట్టినట్టుగా చిత్ర ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని అనేకులు వచ్చి చిత్రాన్ని తిలకించి అలనాటి పరిస్థితిని నెమరు వేసుకున్న యూత్ ఇలాగ ప్రదర్శించినందుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



# ప్రకాశం




తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## తిరుమల ప్రతిష్ఠ భంగపరిస్తే చూస్తూ ఊరుకోం

### - త్రిపుర భైరవేశ్వరానంద స్వామి

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



తిరుమల ఆలయ ప్రతిష్టకు, శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే సహించబోమని ఎపి సాధు పరిషత్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు త్రిపుర భైరవేశ్వరానంద స్వామి హెచ్చరించారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డు ప్రసాదం నాణ్యత వివాదం హిందూ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకుందని, తిరుమలకు చేరువలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు నిలిపివేసేందుకు ఉద్యమించాల్సి వచ్చిందన్నారు. తిరుమల గోశాలలో మృత్యువాత పడిన గోవులపై రాజకీయ రంగు పులమడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. తిరుమల ఆలయ ప్రతిష్ట కాపాడటంలో ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని సాధు పరిషత్ పక్షాన కోరుతున్నామన్నారు.

# ఏసిబికి చిక్కిన మద్దిపాడు తాహసీల్దార్, దొడ్డవరం విఆర్ఓ

**మద్దిపాడు, ఏప్రిల్16, ప్రభాతవార్త**

డెత్ సర్టిఫికేట్ మంజూరు చేసేందుకు మద్దిపాడు మండల తహసిల్దార్, దొడ్డవరం గ్రామ విఆర్ఓ లంచం డిమాండ్ చేస్తున్నారని మండల పరిధిలోని దొడ్డవరం గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మరావు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం అనిశా దాడులు నిర్వహించారు. మండల పరిధిలోనే దొడ్డవరం గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మరావు భార్య అయిన వల్లెపు అంజమ్మ జనవరి 20వ తేది న హైదరాబాదు నందు ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు వైద్యం పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఆమె పేరు మీద ఉన్నటువంటి స్థిరాస్తులు, ఆర్థిక లావాదేవీల నిమిత్తమై మరణ ధ్రువీకరణ పత్రం విషయమై గతంలో పంచాయతీ అధికారుల చుట్టూ తిరిగి వారు ఇవ్వటం కుదరదని తిరస్కరించడంతో రెవిన్యూ అధికారులతో లేట్ ఎంట్రీ నో భాగంగా డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సంప్రదించడంతో రెవెన్యూ అధికారులు కొంతమేర లంచం డిమాండ్ చేశారు. దొడ్డవరం విఆర్ఓ కొప్పోలు అంకమ్మరావు చుట్టూ బాధితుడు తిరిగే క్రమంలో అనేక విధాలుగా కించపరిచాడని బాధితుడు వల్లెపు అంకమ్మరావు ఆరోపించాడు. ఇచ్చే లంచం ఇస్తూ కూడా అధికారులతో మాటలు పడే పరిస్థితి వచ్చిందని బాధతో ఏసీబీ అధికారులను సంప్రదించినట్లు బాధితుడు తెలిపాడు. బుధవారం తాహసిల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తాహసిల్దార్‌ను కలవగా రు: 90,000/ లంచం డిమాండ్ చేసి విఆర్ఓ అంకమ్మరావును కలవమని చెప్పగా బాధితుడు విఆర్ఓ కొప్పుల అంకమ్మరావుకు ఫోన్ చేశాడు. వీఆర్వో అంకమ్మరావు తన ప్రైవేటు రూమ్ వద్దకు రమ్మని 90 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హంగ్రెడ్ గా వీఆర్వో ను పట్టుకున్నారు. నెల్లూరు ఏసీబీ డిఎస్పి ఎస్ శిరీష అధికారులు వీఆర్వోను విచారించి రీ సర్వేలో ఉన్నటువంటి తాహసిల్దార్ ఎమ్ సుజన్ కుమార్ వద్దకు వీఆర్వో ను తీసుకొని వెళ్లి గతంలో ఫోన్లో మాట్లాడినటువంటి రికార్డులు ఆధారంగా తాసిల్దార్ ఎం సుజన్ కుమార్‌ను కూడా ఏసీబీ అధికారులు పట్టుకొని విచారించారు.



**ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం :**

లేట్ ఎంట్రీ డెత్ సర్టిఫికెట్ కోసం దొడ్డవరం గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మరావు వద్ద అదే గ్రామానికి చెందిన వీఆర్వో కొప్పుల్ అంకమ్మరావు రు 90,000/ లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడని, ఏసీబీ డిఎస్పిఎస్ శిరీష తెలిపారు. అనంతరం అన్నంగి గ్రామంలోని రీ సర్వేలో తాసిల్దార్ సృజన కుమార్ ఉండటంతో వీఆర్వో తో పాటు ఏసీబీ అధికారులు తాహసిల్దార్ పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మద్దిపాడు తాసిల్దార్ కార్యాలయానికి పిలిపించి నెల్లూరు డిఎస్పి యస్ శిరీష ఇన్స్పెక్టర్లు సిహెచ్ శేషు, రమేష్ బాబు తాసిల్దారును సృజన కుమార్ వీఆర్వో కొప్పులు అంకమ్మరావులను విచారించి నెల్లూరు ఏసిబి కోర్టుకు తరలించనున్నట్లు డిఎస్పిఎస్ శిరీష తెలిపారు. ఒంగోలు ఆర్డీవోను లక్ష్మీ ప్రసన్న తాసిల్దార్ కార్యాలయాన్ని పిలిపించారు.

## రండి ఆడేదాం... మే 1 నుంచి నెల రోజులు శిబిరాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

విద్యార్థులను ఆటలాడించేందుకు ఉచిత క్రీడా శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రకాశం జిల్లాలో 50ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. 25 రకాల క్రీడలను ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కడెక్కడ ఏఏ క్రీడలకు అనుకూలమనే అంశాలపై జిల్లా కేంద్రంలో క్రీడా సంఘాల ప్రతినిధులతో నిర్వహించనున్న సమావేశంలో చర్చించి నిర్ణయించారు. మరో ఐదు రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనుంది. బడులకు వేసవి సెలవులు ఇస్తుండటంతో విద్యార్థులు తమ సమయాన్ని క్రీడలకు వెచ్చించేలా ప్రోత్సహిస్తారు. ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తున్నా అల్పాహారం, ఇతర వసతుల కోసం దాతల సాయం తీసుకోవాలని నిర్ణయించారు. ఆసక్తి కొద్ది అథ్లెటిక్స్, విలువిద్య, బాక్సింగ్, బాల్‌బాడ్మింటన్, బాస్కెట్ బాల్, చెస్, ఫుట్‌బాల్, పెన్సింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, షాఫ్ట్‌బాల్, స్కేటింగ్, టెన్నీస్, తైక్వాండా, టేబుల్ టెన్నీస్, టెన్నికాయిట్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగా తదితర అంశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులు ఆసక్తి కొద్ది వచ్చిన క్రీడల్లో శిక్షణ పొందవచ్చు. ఆయా ప్రాంతాల్లో ఏ ఆటల్లో శిక్షణ ఇవ్వాలన్నది నిర్ణయించాకా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. మే చివరి వారంలో పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. వేసవి ఎండల నేపథ్యంలో రోజు ఉదయం 6నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటలనుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ తీసుకువచ్చింది. శిబిరాలకు వచ్చే విద్యార్థులు ఇందులో నమోదు అవ్వాలి, భవిష్యత్తులో వీరు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే సంబంధిత ధృవపత్రాలను అప్లోడ్ చేసుకోవచ్చు. ప్రభుత్వ వాటిల్లో, ఇతర వాటిల్లో ఈ ధృవీకరణ పత్రాలు అధికారికంగా ఉపయోగపడతాయని ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.రాజేశ్వరి తెలిపారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హత్య కేసులోని ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

**మద్దిపాడు ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

స్థల వివాదం విషయంలో ఒక వ్యక్తిని కర్రలతో కొట్టి చంపిన ఇద్దరు నిందితులకు ఒంగోలు పిడిఎజ్ కోర్ట్ న్యాయమూర్తి ఏ. భారతి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5000/ జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. స్థానిక ఎస్సై బి శివరామయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. మద్దిపాడు మండలం పెద్ద కొత్తపల్లి గ్రామమునికి చెందిన గొట్టిపాటి రామరావు తన సమీప బంధువులైన నల్లూరి వెంకటరావు కుటుంబ సంభ్యులకు నాలుగు గదుల ఖాళీ స్థలం గురించి గత కొన్ని సంవత్సరముల వివాదం ఉంది. సదరు స్థలం విషయంలో ఒకరికి ఒకరు గొడవలు పడుచున్నారు. వెంకటరావు కుటుంబ సభ్యులు రామారావుపై కక్ష పెంచుకొని ఎలాగైనా స్థలం దక్కించి కుందామనే ఉద్దేశంతో 01.10.2018 తేది రామారావు తన ట్రాక్టర్ డ్రైవర్‌తో తన ఖాళీ స్థలంలో కూరగాయల మొక్కలకు పందిరి వేయుటకు కర్రలు పాతుకొనుచుండగా నల్లూరి వెంకట్రావు, నల్లూరి సురేష్, నల్లూరి రాజ్యలక్ష్మి అనువారు రామారావుపై (మృతుడు) కర్రలతో దాడి చేయగా, స్పృహ తప్పి రక్తగాయాలతో క్రింద పడిపోగా కిమ్స్ ఆస్పత్రిలో చేర్చగా 03.10.2018న చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనలో స్థానిక మద్దిపాడు పి.ఎస్‌లో కేస్ నెంబర్ 156/2018,302 ఆర్‌డబ్ల్యు 34 ఐపీసీ ప్రకారం అప్పటి మద్దిపాడు ఎస్సై సురేష్ కేసునమోదు చేయగా అప్పటి ఒంగోలు రూరల్ సీఐ ఓ.దుర్గ ప్రసాద్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టుచేసి రిమాండుకు పంపించారు. జిల్లా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసారు. ఈ క్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ వసుంధర ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్టులో సమయానుసారం హాజరు పరుస్తూ ప్రకాశం జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పటిష్టమైన గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విచారణ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితుడుపై నేరనిరూపణ చేశారు. బుధవారం ఒంగోలు పిడిఎజ్ కోర్టుజడ్జి భారతి నిందితులకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.5000/ రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నల్లూరి రాజ్యలక్ష్మీపై నేరం రుజువు కానందున ఆమెపై కేసు కొట్టి వేశారు. సదరు కేసులో నిందితులకు శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఒంగోలు రూరల్ సీఐ దుర్గ ప్రసాద్, ప్రస్తుతం సీఐ యన్.శ్రీకాంత్ బాబు, అప్పటి ఎస్సై పి.సురేష్,హెడ్ కానిస్టేబుల్ వి.రాఘవరావు,టి. మాలకొండయ్య, ఎ. మధుసూదనరెడ్డిలను జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## తెలుగు గౌరవం కోసం అమరమైన పొట్టిశ్రీరాములు

### - కనిగిరిలో 125వ జయంతి వేడుకలు

**కనిగిరి,ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



తెలుగు ప్రజల హక్కుల కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలు బుధవారం కనిగిరిలోని ఎంబీఆర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం, పొట్టి ఎరాములు మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ తెలుగు గౌరవం కోసం హక్కుల కోసం, భవిష్యత్తు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ఎన్నటికి మర్చిపోలేము, ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దే దిశగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంబమయ్యాయి. కలెక్టర్ మాట్లాడుతూ కనిగిరికి సమీపంలోని పడమటిపల్లె గ్రామం శ్రీరాములు పూర్వీకుల స్వస్థలం ఉండటం గర్వకారణమని చెప్పారు. అలాగే పీ4 వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రాన్ని పేదరికం లేకుండా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీరాములు భాసాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించిన వ్యక్తి, ఆయన చేసిన నిరాహార దీక్ష జీవిత త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మాలల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ తదితరులు శ్రీరాములు త్యాగాన్ని కొనియాడుతూ వారి జీవితం పాఠ్యపుస్తకాలలో చేర్చాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు వారసులను ఘనంగా సన్మానించడంతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ఆర్యవైశ్యులు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పందెమేస్తే సొమ్ము పోయిందా..

# బెట్టింగ్ యాప్‌ల పేరిట బురిడి

- వేలల్లో ఎరవేసి లక్షల్లో దోపిడి
- నిండా మునిగి తనువు చాలిస్తున్న బాధితులు
- తీరని శోకంలో కుటుంబాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగ్ విష సంస్కృతి ఇప్పుడు మారుమూల పల్లెల్లోనూ చుట్టేస్తుంది. విద్యార్థులు, యువత రోజువారి కూలీలు సైతం ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు బెట్టింగ్ నిర్వాహకులుగా అవతారమెత్తి సొంతంగా యాప్‌లు రూపొందించి లక్షల్లో సొమ్ము కాజేస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న మండల కేంద్రానికి చెందిన యువకుడు ఒకడు యాప్ ద్వారా ఇటీవల బెట్టింగ్ కాసి కొంత సొమ్ము గెలుచుకున్నారు. ఆ నగదు మాత్రం జమ కాలేదు. స్థానిక నిర్వాహకుల చుట్టు ఆ యువకుడు తిరిగినా ప్రయోజనం లేదు. మరో గ్రామానికి చెందిన యువకుడు బెట్టింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకోగా ముందుగా 25వేలు జమ చేయాలని నిబంధన ఉందని యాప్ నిర్వాహకులు చెప్పారు. ఓ మ్యాచ్‌లో రూ.5వేలు గెలువగానే ఆ నగదు ఇచ్చారు. రెండో మ్యాచ్ నుంచి ఆ నిర్వాహకులు పత్తా లేరు. ముందుగా జమ చేసిన నగదుకు సమాధానం చెప్పే దిక్కు లేదు. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారంతా నగదు పోగొట్టుకుని బోరుమంటున్నారు. విషయం బహిర్గతం అయితే ఇబ్బందులు తప్పవనే భావనే బాధితులు మిన్నకుండిపోతున్నారు. బెట్టింగ్‌లో గెలిచిన సొమ్ము ఇవ్వరని యాప్ సృష్టికర్తలు, నిర్వాహకులు ఎక్కడ ఉంటారో తెలియకుండా ప్రోత్సహిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బెట్టింగ్ నిర్వాహకులు విదేశాల్లో ఉంటారని, ప్రధాన సూత్రదారి ఎవరు తెలియదన్నది ఒకప్పటి మాట. ఇప్పుడు స్థానిక ముఠాలు కూడా ఇలాంటి యాప్‌లు తెరపైకి తెచ్చి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా పరిసరాల్లో ఇటీవల 5 నుంచి 7 యాప్‌లు వినియోగంలో ఉండటంపై పోలీసులు నిఘా ఉంచారు. వీటిలో కొన్నింటికి నిర్వాహకులు జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన వారని తెలుస్తోంది. సీజన్‌ను బట్టి నకిలీ వివరాలతో పొందిన సిమ్ కార్డుల ద్వారా ఈ దందా కు పాల్పడుతున్నట్లు పలువురు చెప్తున్నారు. సమాచారం ఉంటేనే పోలీసులు దాడులు చేస్తుండటంతో నిర్వాహకులు మోసాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది. ఇటీవల ఐపీఎల్ మ్యాచ్ పుణ్యమా అంటూ జిల్లాలో అనేక మంది విద్యార్థులు, కూలీ పనులు చేసుకునే వ్యక్తులు ఉద్యోగులు చేసుకునే వారు బెట్టింగ్ మహమ్మారికి మృత్యువాత పడుతున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో గొంది గొందికి క్రికెట్ బుకీలు మాదిరిగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాల్లో కూడా బుకీల మాదిరిగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో కనిగిరి నియోజకవర్గంలో బెట్టింగ్ వలలో చిక్కుకుని మృత్యువాత పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ఉచ్చులో పడి సర్వస్వం పోయి బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్న అంశం. తొలుత సరదాగా మొదలై చివరికి అది వ్యసనంగా మారుతుంది. ఏ జట్టు విజేతగా నిలుస్తుందన్న అంశం నుంచి బంతిబంతికి ఏదొక రూపంలో పందేలు కాస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి నిండా మునిగిపోతున్నారు. ఇంట్లోనే బంగారు, భూములు సైతం కుదవ పెట్టి నష్టపోతున్నారు. ఇటీవల కాలంలో కనిగిరి ప్రాంతానికి చెందిన ముగ్గురు ఇలా తనువు చాలించడం నియోజకవర్గ వర్గంలో బెట్టింగ్ తీవ్రత ఎంత ఉందో అర్థమవుతుంది. వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువుకు చెందిన ఓ స్థానిక ప్రజాప్రతినిధి బెంగుళూరులో నివాసముంటున్నారు. ఇంట్లో భార్య దాచిన సుమారు రూ.50వేలు మేరకు ఆమెకు తెలియకుండా క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయారు. విషయం ఎవరికి చెప్పకుండానే ఆయన ఉరివేసుకుని మరణానికి పాల్పడ్డాడు. కనిగిరికి చెందిన ఓ యువకుడు ఉపాధి నిమిత్తం కందుకూరులో ఉంటూ బెట్టింగ్‌లకు అలవాటు మిత్రుల వద్ద రూ.20లక్షలు అప్పు చేశాడు. చివరకు అనారోగ్యంతో ఉన్న తల్లి మెడలోని గొలుసును తాకట్టుపెట్టాడు. అప్పులు వాళ్లు వెంటపడటంతో వారికి కనిపించకుండా కొన్ని రోజులు ఇతర జిల్లాల్లో ఉన్నాడు. తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న కనిగిరి మండలానికి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు తాను దాచుకున్న సొమ్ము కోల్పోయి మరో రూ.30లక్షలు అప్పులు చేసి అప్పులు ఇచ్చిన వారు ఇంటికి అడుగుతుండటంతో ఉరి వేసుకుని తనువు చాలించాడు. కనిగిరి పట్టణానికి చెందిన ఒక యువకుడు అప్పులు తెచ్చి రూ.60లక్షల మేర బెట్టింగ్‌లకు పెట్టారు. మొత్తం కోల్పోయి ఊరు విడిచి వెళ్ళిపోయారు. ప్రస్తుతం వీరు వివిధ ప్రాంతాల్లో ముఠా కూలీలుగా పని చేస్తున్నారు. సింగరాయకొండలో ఇటీవల బెట్టింగ్ బూతం కారణంగా కొంత మంది యువకులు మృత్యువాత పడగా కొంత మంది సుదూర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నట్లు సమాచారం.



**దారి మార్చిన జూదరులు:**

గతంలో టీ దుకాణాలు, అల్పాహార శాలలు, దాబాలు వంటి చోట్ల బెట్టింగ్ శిబిరాలు సాగేవి. ప్రస్తుతం పోలీసుల నిఘా పెరగడంతో జూదాల దారులు రూటు మార్చారు. ఇళ్లు, కొన్ని అపార్టుమెంట్ సముదాయాలనే అడ్డాలుగా మార్చుకుంటున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా యాప్‌లు వీళ్ళ పర్యవేక్షణలో లేకపోవడంతో బెట్టింగ్‌లు మాత్రం కొంత మేర నివారించగలిగిన ఎక్కడో ఒక చోట బెట్టింగ్‌ల వల్ల మృత్యువాత పడుతుండటం ఎక్కువ కావడం విశేషం. ఇప్పటికైనా యువత మేల్కోవాలని బెట్టింగ్‌ల జోలికి వెళ్ళకుండా వారి ఇంట్లో తల్లిదండ్రులను రోధనకు గురి చేయకుండా చూడాల్సిన బాధ్యత యువతపైనే ఉందని వారు అంటున్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభసాటి - ఎడిఎ ధన్‌రాజ్



**అద్దంకి , ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఎంతో లాభపడవచ్చుని తద్వారా ఆరోగ్య వంతమైన వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చు అని అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.ధన్‌రాజ్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఎ.ఒ. వెంకట కృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. 2025 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి,ఖరీఫ్‌లో ప్రతిగ్రామంలో కనీసం 50ఎకరాలకు తగ్గకుండా ప్రకృతి వ్యవసాయం చేసేటట్లు ప్రణాళికలుకు రూపొందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం కోటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులు నరిశెట్టి రమేష్‌బాబు, తొట్టెంపూడి సుభాష్ చంద్రబోస్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది రవికుమార్, ఆశోక్ కుమార్, కోకిల, నరేంద్ర, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు, విఎఎలు, విఎఒబిలు పాల్గొన్నారు.

## రెండవ రోజున అగ్నిమాపక వారోత్సవాలు

**- మహిళలకు అవగాహన**



**అద్దంకి , ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
అగ్నిమాపక వారోత్సవాల భాగంగా బుధవారం శ్రీనగర్‌లోని లక్ష్మీ రెసిడెన్సీ నందు మహిళలకు భద్రత విషయాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక సిబ్బందినిర్వహించారు.ఈ రెసిడెన్సీ లోని మహిళలకు సిలిండెర్ల ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో సిబ్బంది వివరించారు.ఈ కార్యక్రమంలో ఫైర్‌ఆఫీసర్ జి.వెంకటరావు, పి.చంద్రశేఖర్, రమణయ్య, కోటేశ్వరరావు, బాలకృష్ణతోపాటు ఆ వార్డు కౌన్సిలర్ కొమ్మాలపాటి సుధీర్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## పాలిసెట్ దరఖాస్తుకు నేడు చివరి రోజు

**అద్దంకి , ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
పాలిటెక్నిక్ కళాశాలలో 2025 విద్యా సంవత్సరం ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం 17వ తేది చివరి రోజు అని కళాశాల ప్రిన్సిపాల్ వి.లాజరస్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొరకు సింగరకొండలోని పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని మిగతా వివరాల కొరకు 97055 18378ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు

### ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపిపి ప్రసన్నకుమారి



**కొరిశపాడు ,ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
మండలంలోని మేదరమెట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం కొరిశపాడు ఎంపిపి సాధినేని ప్రసన్నకుమారి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటా్లడుతూ ఆంధ్రప్రదేశ్ బిసి ఫైనాన్స్ కార్పోరేషన్ వారి సహకారంతో ఈ శిక్షణా కేంద్రం ఏర్పడిందన్నారు. మొదటి దఫా శిక్షణకై 72 మంది ఎంపిక చేయాలని వీరికి మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు.ఈ బ్యాచ్‌లోని మహిళలందరూ టైలరింగ్‌లో నైపుణ్యత సాధించి ఆర్థికంగా బలపడి తమ కుటుంబ ప్రగతికి తోడ్పడగలరని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు జడ్‌పిటిసి తుళ్ళూరు వెంకటరమణ, ఎంపిడిఒ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీకాంత్, టిడిపి సీనియర్ నాయకుడు మన్నె రామారావు, గ్రామ ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం



**బల్లికురవ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
ప్రకృతి వ్యవసాయం, యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలు, వివరిస్తూ స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివసారావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులను,పురుగు మందులను వాడకుండా వ్యవసాయ ఉత్పత్తులు ఎలా సాధించదగలమో వివరించారు. ఆరోగ్యవంతమైన జీవన విధానం కోసం ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. వ్యవసాయాధికారి కుమారి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాడటం వల్ల రసాయనిక ఎరువులు వాడకుండా అధిక సారవంతంతో మంచి పంట దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ అప్పారావు తదితరులు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దగుబడులు సాధిస్తున్న రైతులను ఈ సందర్భంగా సన్మానించారు.

## స్త్రీ శిశు సంరక్షణే అంగన్‌వాడీల లక్ష్యం

**- సీడీపీఓ వి.కమల కుమారి**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
స్త్రీ శిశు సంరక్షణే అంగన్‌వాడీల లక్ష్యం అని, పౌష్టికాహారం ద్వారా గర్భిణీ బాలింతలు ఆరోగ్యం పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ దోర్నాల ప్రాజెక్టు సీడీపీఓ వంగెపూరి కమల కుమారి అన్నారు. దోర్నాల బీసీ కాలనీ కోడ్ నెంబర్ 219 అంగన్‌వాడీ కార్యకర్త పందిటి మల్లేశ్వరి దేవి సెంటర్లో బుధవారం పోషణ పక్వాడా, సీమంతాలు నిర్వహించి ప్రీ స్కూల్ చిన్నారుల గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు ప్రీ స్కూల్ ద్వారా విద్యాభ్యాసం అందించి ప్రాథమిక పాఠశాల సిద్ధం చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు అభినందనీయమని, ప్రభుత్వం అందించే ప్రతి పథకాలు వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, దోర్నాల పంచాయతీలోని అంగన్‌వాడీ సెంటర్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

### అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి దోర్నాల్లో బీజేపీ నాయకులు నివాళులు



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పెద్దదోర్నాల బీజేపీ మండల కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసరావు, యర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ ఎనుముల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కూకట్ల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, యువ మోర్చా ఐటీ రాష్ట్ర కన్వీనర్ జీవీ రెడ్డి, గిరిజన మోర్చా ఎస్టీ జోనల్ ఇన్‌చార్జీ దేశవత్ వెంకటేశ్వర్లు నాయక్, కిషన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్ కుమార్, పుల్లలచెరువు సీనియర్ నాయకులు ఆదినారాయణ, రాష్ట్ర మైనార్టీ మోర్చా కాశిం పీరా, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అంబటి అల్లూరి రెడ్డి, గోనావత్ కాశీ నాయక్,తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష తో ప్రాణ త్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన మహానేత అమరజీవి పొట్టి శ్రీరాములు అని, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. అటువంటిమహానుభావులజీవితాలను ఆదర్శంగా తీసుకుని యువతముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## పాలుట్ల గిరిజన గూడెంలో పోషణ పక్వాడ కార్యక్రమం

**- పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలి - సిడిపివో యం.పద్మావతి**



**యర్రగొండపాలెం,ఏప్రిల్16,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజనగూడెంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాల భాగంగా మహిళభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సిడిపివో యం.పద్మజ హాజరైనారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అవగాహన కల్పించారు.ఆకుకూరలు, చిరుధాన్యాలు వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు,బాలింతలు,కిశోర బాలికలు ప్రభుత్వం అందించే పాలు,గుడ్లు,చిక్కిలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు.పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి అన్నారు.ఆర్‌డిటి డాక్టర్ చేత చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఆనంతరం గరి భ్ణీలకు శ్రీమంతం,చిన్నారులకు అన్నాప్రసన్న కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఏ.పద్మజ,కేవి.సుబ్బమ్మ, ఎన్.శివలక్ష్మి,ఎం.హైమావతి అంగన్వాడి కార్యకర్తలు నాగమణిబాయి, ఈదమ్మ,పెద్దఈదమ్మ, హనుమమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో

### ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఏలూరి అభినందన



**మార్టూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
ఇటీవల విడుదల చేసిన ఐఎన్‌టీఎస్ఓ 2024-25 పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య మార్టూరు బ్రాంచ్ విద్యార్థులు అత్యత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.సంపత్ కుమార్ తెలియజేశారు. ఈ ఫలితాలలో 6వ తరగతి విద్యార్థి షేక్ రయాన్ మస్తాన్ గ్రాండ్ ప్రైజ్‌గా లాప్‌టాప్, 4వ తరగతి విద్యార్థి శొంఠినేని మహేష్ మొదటి బహుమతిగా ట్యాబ్ పొందడం జరిగింది. ఒలింపియాడ్ పరీక్షలలో బహమతులు సాధించిన షేక్ రయాన్ మస్తాన్ గ్రాండ్ ప్రైజ్‌గా లాప్‌టాప్, 4వ తరగతి విద్యార్థి శొంఠినేని మహేష్ మొదటి బహుమతిగా ట్యాబ్ పొందడం జరిగింది. ఒలింపియాడ్ పరీక్షలలో బహుమతులు సాధించిన షేక్ రయాన్ మస్తాన్‌కు, శొంఠినేని మహేష్‌కు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా ల్యాప్‌టాప్, ట్యాబ్‌లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ భవిష్యత్తులో భాగా చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఫలితాలలో గ్రాండ్ ప్రైజ్‌తో పాటు, ఒక విద్యార్థి మొదటి బహుమతి, ఇద్దరు విద్యార్థులు రెండో బహుమతి, ముగ్గురు విద్యార్థులు మూడో బహుమతి, ముగ్గురు విద్యార్థులు నాల్గో బహుమతి, ముగ్గురు విద్యార్థులు ఐదో బహుమతి, ఎనిమిది మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులు, 79 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, 269 మంది వాద్యార్థులు బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికేట్లు పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో ఏలూరి శేషగిరిరావు, డీన్ జి.రాఘవులు, సిబ్యాచ్ ఇన్‌ఛార్జీ జి.రాజ్యలక్ష్మి, ఇన్‌ఛార్జీలు బి.గీత, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరుతున్న బస్‌స్టేషన్..

**- అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసం**





**బల్లికురవ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
తెలుగు గ్రామీణ క్రాంతి పథం సౌజన్యంతో టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో ప్రారంభించబడి, ఓ వెలుగు వెలిగిన బల్లికురవ బస్‌స్టేషన్ నేడు మర్రిచెట్లకు నిలయంగాను, సంచార జాతులకు ఆవాసంగాను, మందుబాబుకు అడ్డాగాను, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగాను మారింది. వివరాల్లోకి వెళ్తే..అప్పటి మార్టూరు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పట్టుదలతో దాతల నుంచి స్థలాన్ని సేకరించి బస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించి 1989 ఏప్రిల్ 30న అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎర్నేని సీతాదేవి చేతుల మీదుగా బస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు.ఆ తర్వాత కంట్రోలర్‌ను నియమించడంతో పాటు, చీరాల నుండి వినుకొండ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులను కూడా బల్లికురవ మీదుగా నడిపారు. చిలకలూరిపేట నుండి అద్దంకి రెండు సర్వీసులు, అద్దంకి డిపో నుండి చిలకలూరిపేట వయా చెన్నుపల్లి మీదుగా మరో రెండు సర్వీసులు, అదే విధంగా అద్దంకి నుండి వయా అంబటిపూడి మీదుగా చిలకలూరిపేట రెండు సర్వీసులు నడిపేవారు. అద్దంకి నుండి వయా బల్లికురవ మీదుగా నరసరావుపేట మరో సర్వీసు నడిచేది. అదే విధంగా నరసరావుపేట డిపో నుండి నరసరావుపేట, చెన్నుపల్లి, నైట్ హాల్ సర్వీస్, నరసరావుపేట, వలపర్ల డే ఔట్ సర్వీసు నడిచేది. కాలం గడిచే కొద్ది బస్ స్టేషన్ ఏ విధంగా శిథిలావస్థకు చేరిందో ఈ రహదారుల్లో తిప్పే ఆర్టీసీ సర్వీసులను కూడా కుదించి వేశారు. ఇప్పుడు కేవలం రెండున్నర సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. అదేంటి అర సర్వీసు అంటారా..అద్దంకి నుండి వైదన మీదుగా చిలకలూరిపేట కు ఉదయం పూట మాత్రమే ఒక ట్రిప్పు నడిపి తర్వాత ఆ సర్వీసు ను వేరే రూట్‌కు బదలాయిస్తారు. ఇక ప్రైవేటు వాహనదారులకు అందిన కాడికి దోచుకునేందుకు ఆర్టీసీని మార్గం సుగుమం చేసింది. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మరింత మెరుగుపడాల్సిన పరిస్థితిలో నానాటికి దిగజారుతున్నాయి. లక్షలాది రూపాయలు నిర్మించిన బస్ స్టేషన్ నిరూపంగా మారింది.నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న పాలకుల నిర్లక్ష్యం విలువైన భవనాలు, శిథిలావస్థకు చేరటానికి కారణం అవుతుంది. ఎంతో విలువైన బస్ స్టేషన్ స్థలం నాలుగు వైపులా ఆక్రమణకు గురై చికెన్ దుకాణాల వ్యర్థాలు, హోటల్ వ్యర్థాలతో పందులకు ఆవాస కేంద్రాలుగా మారుతుంది. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిస్తే నిజం వెళ్లడవుతుంది. ప్రజలకు మేలు జరుగుతుంది. స్థల దాతలు ఇచ్చిన దాతృత్వానికి సార్థకత ఏర్పడుతుంది.

### ఉరుసు మహోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన కమిటీ ముస్లిం సోదరులు



**మార్టూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
హజరత్ కరిముల్లా షా వలి ఉరుసు సందర్భంగా మార్టూరు ఉరుసు కమిటీ ముస్లిం సోదరులు బుధవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉరుసు మహోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు.

## ఉపాధిపనులను పరిశీంచిన ఐటిడిఎ ప్రత్యేక అధికారి



**యర్రగొండపాలెం,ఏప్రిల్16,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం, పంచాతీయతీలోని హనుమంతులనిగుడెం,పునరవాస కాలనీ,బిళ్లగొందిపెంట పోతురాజు పెంట చెంచు గూడెంల లో బుధవారం ఐటిడిఎ స్పెషల్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు ఉపాధి పనులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 150 రోజులు పని దినాలను ఉపయోగించుకోని ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని ఆయన అన్నారు.ఉదయాన్నే పనికి వచ్చి ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేసి రోజు వారి కూలి 307 రూపాయలు పొందాలని ఆయన అన్నారు.పనికి వచ్చేటపుడు తప్పనీ సరిగా మంచినీరు తీసుకొని వెల్లలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ కుడుముల అంజయ్య,భూమని వెంకట్రామయ్య పాల్గొన్నారు.

### మండల, గ్రామ నూతన కమిటీలను కుటుంబ సాధికార సారధులను వెంటనే పూర్తి చేయాలి

**- సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్**



**సంతనూతలపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నూతన మండల,గ్రామ పార్టీలు, క్లస్టర్ యూనిట్, బూత్ కమిటీలను కేఎస్ఎస్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి మండల పారక్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీల సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడారు. పార్టీలో ఏ పదవి కావాలన్నా కేఎస్ఎస్‌లో పేరు ఉంటేనే అర్హులు అని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ దేశం పార్టీ ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్, పార్లమెంట్ అధికార ప్రతినిధి మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల పార్టీల అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, మండవ జయంతిబాబు, తెళ్ళ మనోజ్ కుమార్, సెక్రటరీలు వేల్పుల శ్రీనివాసరావు, అవనిగడ్డ శేషయ్య, ముత్తనపల్లి రామలింగం, తాటితోటి నరసింహారావు, కాకర్ల లక్ష్మీ వర ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జీలు గుమ్మడి సాయిబాబా, మద్దినేని చౌతన్య, దేవబత్తిన ప్రసాద్, పాటిబండ్ల అజయ్, వివరం గోవింద్ తదితరలు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీ కొని ఆరు గొర్రెలు మృతి

**- ఐదు గొర్రెలకు తీవ్ర గాయాలు - లబోదిబోమంటున్న గొర్రెల కాపరులు**




**సంతనూతలపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం గుడిపాడు డొంక సమీపంలో బుధవారం మధ్యాహ్నం రామతీర్థం నుండి నెల్లూరుకు కంకర్ లోడ్ తో వెళ్తున్న టిప్పర్ మార్గంలో గల గొర్రెలను ఢీకొట్టడంతో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరొక ఐదు గొర్రెలు తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ఇవి సంతనూతలపాడుకు చెందిన నలగట్ల శ్రీనివాసరావు, బాపట్ల వెంకటేశులకు చెందినవి ఏపీ 39 యు 0017 గల టిప్పర్ ఈ ప్రాంతంలో మేతమేస్తున్న గొర్రెలను ఢీకొట్టింది. ఎస్సై జి.వెంకటరావు ప్రమాద సంఘటనను పరిశీలించారు. సంతనూతలపాడుకు చెందిన టీడీపీ నేతలు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్‌బాబు, కొప్పోలు శ్రీనివాసరావు, నల్లగట్ల సుబ్బారావు, పి.నారాయణస్వామి చౌదరి, ఎన్.మాధవిలత, సాధినేని శ్రీరామమూర్తి, షేక్ మక్బూల్, బి.రాందాసు, వి.అంకంశెట్టి, మట్టా పొలిశెట్టి , పలువురు గొర్రెలు కాపర్లు, ప్రమాద సంఘటనను పరిశీలించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**పెంపకం దారులను ఆదుకోవాలి : జీఎంపీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి**

టిప్పర్ ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన గొర్రెలు పెంపకం దారులను తక్షణమే ఆదుకోవాలని గొర్రెలు, మేకలు, పెంపు కపుదారుల రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ప్రమాద సంఘటన జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి పెంపకందారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం గొర్రెలు, మేకలకు కల్పించాలని పెద్దబ్బాయి పేర్కొన్నారు. నష్టపోయిన గొర్రెలు పెంపకపుదారులకు ప్రభుత్వం ఏక్స్‌గ్రేషియా ఇవ్వాలని పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జిల్లాలో తరచు జరుగుతున్నందువలన గొర్రెలు, మేకలు పెంపకపు దారులు కటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, బాధితులు నల్లగట్ల శ్రీనివాసరావు, బాపట్ల వెంకటేష్, గొర్రెలు, పెంపకం దారులు ఎన్.ఆంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల సందర్భంగా రంగస్వామి క్షేత్ర ఆదాయం రూ.15.89 లక్షలు

**- ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య**





**రాచర్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రంగస్వామి క్షేత్ర ఆదాయం రూ.15,89,951 లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు రంగస్వామి బ్రహ్మోత్సవాలు జరిగాయని ఈ సందర్భంగా వివిధ రూపాలలో భక్తుల నుండి ఈ ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. స్వామివారి క్లాత్ హుండీ ద్వారా రూ.76,839లు, ఇనుప హుండీ ద్వారా రూ.11,53,700లు, శివాలయం హుండీ ద్వారా రూ.24,051లు, అమ్మవారి హుండీ ద్వారా రూ.7560లు వచ్చాయని దీంతో హుండీ ఆదాయం రూ.12,62,150లు కాగా స్వామివారి కళ్యాణ చదివింపుల ద్వారా రూ.99,526లు, టికెట్ల ద్వారా రూ.1,65,775లు, కళ్యాణ టికెట్ల ద్వారా రూ.62,500లు, వీటికి సంబంధించి (కళ్యాణ చదివింపుల నుండి టికెట్లు మరియు కళ్యాణ టికెట్ల వరకు) రూ.3,27,801లు వచ్చాయని వెరసి మొత్తంగా రూ.15,89,951లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇవే కాకుండా స్వామివారికి వస్తు రూపేనా 624గ్రాముల వెండి, 0.002.029ఎంఎల్ గ్రాముల బంగారు కూడా స్వామివారికి చదివింపులుగా వచ్చిందని ఆయన తెలిపారు. గత 2024లో వీటన్నింటికీ సంబంధించి రూ.9,47,327లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం అధిక ఆదాయం రూ.6,42,624లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరిగాయని, ఆయన సహకారంతో వైభవంగా జరిగాయని అన్నిశాఖల అధికారులు సంపూర్ణ సహకారం అందించారని భక్తులు, ప్రజలు, ఆలయ సిబ్బంది బ్రహ్మోత్సవాల విజయవంతంలో తమకు తోడ్పాటు అందివ్వడంతో ఈ బ్రహ్మోత్సవాల విజయవంతం సాధ్యమైందని అన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి, వివిధ శాఖల అధికారులకు, ఆలయ సిబ్బందికి, భక్తులకు, ముఖ్యంగా జేపిచెరువు గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉపాధి కూలీలకు ఫస్ట్‌ఎయిడ్ కిట్లు పంపిణీ



**రాచర్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
మండలంలోని ఉపాధి కూలీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి స్థానిక కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉపాధిపనులు ముమ్మరంగా సాగు తుంటాయని, పనులు చేసే సమయంలో కూలీలకు ఏవైనా చిన్నపాటి గాయాలైన వెంటనే వారికి ఉపాధి సిబ్బంది చికిత్సలు చేయాలని అన్నారు. చిన్న గాయమైన, పెద్ద గాయమైన ముందు ఫస్ట్ ఎయిడ్ చికిత్స అనంతరం వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉపాధజ కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ చేపట్టిందని అన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని పంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లకు వీటిని పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపిఓ ఆర్ మహాలక్ష్మీ, మండల విస్తరణ అధికారి ఐ వెంకటేష్, కార్యాలయ ఏఓ వి శ్రీనివాసకుమార్, జూనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్, టైపిస్ట్ మాధవిలత, ఉపాధిహామీ ఈసి జె నాగేశ్వరావు, టెక్నికల్ అసిస్టెంట్లు కోటిలింగారెడ్డి స్వామి, సత్యాబాబు, శ్రీనివాసులు, బిఎఫ్‌టి కోటి, ఏఎన్ఎం నారాయణమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి



**కొండపి, ఏప్రిల్ 16 ,ప్రభాతవార్త**
హైరిస్క్‌లో ఉన్న గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్ వాడీ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. పోషణ పక్వాడ వారోత్సవాలలో భాగంగా బుధవారం పెరిదేపి అంగన్ వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భందాల్చిన స్త్రీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. 1000 రోజుల కేర్ అంటే, గర్భం మొదలు శిశువుకు రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు, శిశువు యొక్క ఆరోగ్యకరమైన పెరుగుదల, అభివృద్ధికోసం ప్రత్యేక శ్రద్ధ, సంరక్షణ అవసరం అని అర్థం అన్నారు. ఈ కాలంలో శిశువు యొక్క మెదడు, శరీరాలు వేగంగా పెరుగుతాయని ఈ సమయంలో తల్లి మరియు శిశువులకు సరైన పోషకాహారం, వైద్య సహాయం, ప్రేరణ చాలా ముఖ్యమని అన్నారు. గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే గర్భంలో ఉన్న శిశువుతోపాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని కావున ప్రతిఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హాజరతయ్య, సర్పంచ్ మాచర్ల, గర్భిణీ స్త్రీలు, అంగన్ వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువనేత నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

**- పర్చూరు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా నిలపాలి - టీడీపీకి కంచుకోటగా పర్చూరు నియోజకవర్గం**

**- అభివృద్ధి సంక్షేమ పథకాలలో పర్చూరు భేష్**

**- సీఎం పర్యటన విజయవంతం పట్ల ఏలూరికి అభినందనలు**



**మార్టూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ మానవ వనరుల శాఖ మాత్యులు నారా లోకేష్‌తో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి సంక్షేమం తీరుతెన్నులు, పర్చూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పార్టీ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అన్ని రంగాలలో అగ్రగామిగా నిలవాలని, పర్చూరు రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుత్వం నుంచి పర్చూరు నియోజకవర్గానికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం పట్ల మంత్రి లోకేష్ ఎమ్మెల్యే ఏలూరిని అభినందించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన పీ 4 పథకం అమలు చేసిన విధానం పట్ల ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి పలు సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో సీఎం చంద్రబాబు సమస్యలపై సానుకూలంగా స్పందించారని, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారని వివరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ప్రధానంగా చిన్నగంజాం మోటుపల్లి సముద్ర తీర ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు, ఓడల తయారీ పరిశ్రమ, నేషనల్ హైవేలను కలుపుతూ నూతన జాతీయ రహదారులు, నూతన మార్కెట్ యార్డుల నిర్మాణం, సబ్ డివిజన్‌ల్ పోలీసు కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఆటో నగర్ నిర్మాణం, తదితర అంశాలపై మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి చర్చించారు. పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.

## కేజీబీవీలో 'పరీక్షలు, మార్కులే జీవితమా' కార్యక్రమం



**జరుగుమల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన జరుగుమల్లి కేజీబీవీలో పరీక్షలు, మార్కులే జీవితామా అనే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ డి.దేవానంద్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినీ, విద్యార్థులకు జీవితంలో మార్కులే జీవితం కాదు అని, ఏ పరీక్షలలోనైనా జయాపజయాలు సహజం అని, మార్కులను కొమాలనంగా తీసుకొని, ఒత్తిడికి గురి కావద్దని,ప్రయత్నం మాత్రమేముఖ్యమని, తెలియజేసి విద్యార్థినులలో మనోదైర్యం పెంచారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, పదో తరగతి పరీక్షలు మార్కులు త్వరలో విడుదల చేస్తున్న కారణంగా విద్యార్థినులలో మనోధైర్యాన్ని పెంచుతూ వారితో ఆత్మస్థైర్యంను నింపారు. విద్యార్థినులు మానసికంగా, బలంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో జీసీడీఓ హేమలత, ఎంఈఓ-2 డీలా శ్రీను, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కే.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ ఎన్.స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు - ఎస్సై



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే.మాధవరావు అన్నారు. బుధవారం కనిగిరి-వేములపాడు అడ్డ రోడ్డు నందు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనం నడపితే చర్యలు తప్పవన్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తలకు హెల్మెట్ పెట్టుకోవాలని, కారు నడిపే వారు సీట్ బెల్టు ధరించాలని ఆయన తెలియజేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు వాహనం ఇచ్చినా, చిన్నారులకు వాహనం ఇచ్చిన వారు పట్టుబడితే అందుకు పూర్తి బాధ్యత వాహన యజమానిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాలింతలు,గర్భిణీలకు పౌష్టికాహారం తప్పనిసరి



**సింగరాయకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖ సూపర్వైజర్ రిజ్వాన అన్నారు. బుధవారం పాకల,ఊళ్లపాలెం దేవళం పల్లెపాలెం గ్రామంలోనే అంగన్వాడి సెంటర్ నందు పోషణ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ ఎస్.కే సైదాబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైదాబీ మాట్లాడుతూ మొదటి వెయ్యి రోజుల ( గర్భస్థ దశ నుండి రెండు సంవత్సరాల వరకు ) సంరక్షణపై శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భవతులు,బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారమును ఉపయోగించుకోవటం వలన రక్తహీనత రాకుండా ఉంటుందని, ప్రసవానంతరము పిల్లవాడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటాడని సూచించారు. అనంతరం గర్భిణీలకు శీమంతాలుచేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యపర్యవేక్షకులు సయ్యద్‌మసూద్ ఆలీ, ప్రధానోపాధ్యాయులు వెంకయ్య గారు గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది సి.హెచ్.ఓలు ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు బాలింతలు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు అలర్ట్.. ఈకేవైసీ తప్పనిసరి

**దొనకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
ఏపీలో రేషన్ కార్డు ఉన్న వారికి అలర్ట్. కార్డు దారులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలి...లేదంటే రేషన్ కార్డు నుంచి పేరును అధికారులు తొలగించనున్నారు...దీంతో రేషన్ బియ్యంతో పాటు ఇతర సరుకులు మీరు పొందలేరు. ఇక ఇకేవైసీకి ఈ నెలాఖరు వరకే గడువు ఉంది. ఇప్పటికే ఆయా రేషన్ డిపోల్లో ఈకేవైసి చేయించుకోవాల్సిన వారి జాబితా రూపొందించి విడుదల చేశారు. కావున వీలైనంత త్వరగా ఈకేవైసిని పూర్తి చేసుకోవడం మంచిది. చివరి రోజుల్లో సర్వర్ డౌన్ సమస్య తలెత్తే అవకాశం కూడా ఉండనుంది.

## డ్వాక్రా మహిళలకు తీపి కబురు

**దొనకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
ఏపీలో డ్వాక్రా మహిళలకు తీపి కబురు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పెట్రోల్ బంకులు నడపడానికి అవకాశం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మొదటి దశలో 25 జిల్లాల్లో ఒక్కొక్క పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తారు. డ్వాక్రా సంఘాల పొదుపు నిధులతో ఖర్చు భరిస్తారు. ప్రభుత్వం స్థలం, రూ.1 లక్ష సాయం, వ్యాపార అభివృద్ధికి సహకారం అందిస్తుంది, మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఈ పథకం అమలవుతుంది.

## పొదిలి నుండి దొనకొండ మీదుగా ప్రతి రోజూ రెండు సర్వీసులు



**దొనకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
పొదిలి నుండి దొనకొండ మీదుగా ప్రతీ రోజూ రెండు సర్వీసులు నడుస్తున్నాయి. ఎరగొండపాలెం వైపునకు సర్వీసులు దొనకొండలో ఉదయం 6:45AM దొనకొండలో మధ్యాహ్నం.1:30PM. ఎరగొండపాలెం నుండి దొనకొండకి సర్వీసులు, ఎరగొండపాలెంలో ఉదయం. 9:00AM ఎరగొండపాలెంలో సాయంత్రం 3:45PMఈ బస్ వెళ్ళు మార్గంలో గల కొన్ని ఊర్లు:మునగపాడు, ఆరవల్లిపాడు, దొండపాడు, దొనకొండ, రుద్రసముద్రం, మల్లంపేట, కొచ్చెర్లకోట, కంబంపాడు, మల్లవరం, తోకపల్లి, కుంట మీదుగా ఎరగొండపాలెం.ఆ గ్రామాల వారు సదివినియోగం చేసుకోగలరు. అలాగే హైదరాబాద్ నుండి ఎవరైనా రాత్రి బస్‌లకు జర్నీ చేస్తే దర్శి నుండి ఉదయాన్నే దొనకొండ కి బస్ లు ఉండవు కాబట్టి...పొదిలి నుండి ఉదయం 5:45AMకి బయలుదేర్తుంది కాబట్టి హైదరాబాద్ నుండి వచ్చిన ప్రయాణికులు ఉపయోగించుకోగలరు.

## ఎస్సీ కార్పోరేషన్ రుణాలు

**దొనకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
ఎస్సీ కార్పోరేషన్ రుణాలు సైట్ ఆన్ లైన్ ప్రారంభంఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఆర్థిక రుణాలు సైట్ ఆన్ లైన్ ప్రారంభమైనది. నేటి నుంచి మే నెల 10 వ తేది వరకు ఆన్లైన్లో అప్లై చేసుకోవచ్చు. అర్హతలు:1) లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి., కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. 2) లబ్ధిదారుడు ఆంధ్రప్రదేశ్‌కు చెంది ఉండాలి. 3) లబ్ధిదారుల వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లు. 4) లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉండాలి. 5) స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి లబ్ధిదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. 6) లబ్ధిదారునికి జనరిక్ ఫార్మసీ పథకాలకు డి.ఫార్మసీ/ బి.ఫార్మసీ/ ఎం.ఫార్మసీ ఉండాలి. కావాల్సిన పత్రాలు1. ఆధార్ కార్డు ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్. 2. రేషన్ కార్డు3. కులం మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రం4. రవాణాకు సంబంధించి అయితే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు.

### ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బాలికల వసతిగృహ నిర్మాణం తగదు

**- కట్టడాల నిర్మాణాల వలన కుజించుకుపోతున్న క్రీడామైదాన స్థలం**

**- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, సిబ్బంది**




**యర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదాన స్థలంలో అధికార పార్టీ బాలికల వసతిగృహ నిర్మాణం చేయతలపెట్టిన విషయంలో పట్టణ ప్రజలు, విద్యార్థులు పలు స్వచ్ఛంధ సంస్థ సంఘాలు, ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సంఘాల తరపున ప్రతిఘటినలు వినిపిస్తున్నాయి. దీంతో వారి మధ్య వివాదం నెలకొంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదాన స్థలంలో అధికార పార్టీకి చెందిన కొందరు బాలికల వసతి గృహం కట్టడాలకు గురిచేస్తున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలోని స్థలంలో వివిధ ప్రభుత్వ భవనాలను మంజూరు చేయించి కట్టడాల నిర్మాణం చేయించడం కోసం మైదాన స్థలంలో వివిధ ప్రభుత్వ భవనాలను మంజూరు చేయించి కట్టడాల నిర్మాణాలను చేయించడం కోసం మైదాన స్థలంలో ప్రతిపాదనలు తయారు చేస్తున్న సంగతి విధితమే. దీంతో పట్టణ ప్రజలు, పూర్వపు విద్యార్థులతోపాటు యర్రగొండపాలెం ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు ప్రతిఘటిస్తూ పాఠశాల ఆవరణ క్రీడా మైదానంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బాలికల వసతిగృహ నిర్మాణం పాఠశాల మైదానంలో కాకుండా మరోచోట నిర్మించాలని యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు మండలంలోని సంబంధిత పలువురు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

**జిల్లాలోనే అతిపెద్ద క్రీడామైదానంగా యర్రగొండపాలెం ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానం :**



యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంకు జిల్లాలోనే అతిపెద్ద క్రీడామైదానంగా పేరు ఉంది. అలాంటి పాఠశాల మైదానంలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఇప్పటికే పలు ప్రభుత్వ సంస్థలకు చెందిన భవనాల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. దాంతో మైదానం పలు కట్టడాలతో మూసుకుపోయింది. మళ్ళీ ఇటీవల బాలికల వసతిగృహం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు మొదలుపెట్టారు. మైదానంలో వసతిగృహం నిర్మాణం జరిగితే పాఠశాల మైదానం పూర్తిగా కుజించుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో ఎక్కడికక్కడ పట్టణ ప్రజలు, విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. క్రీడల వికాస కేంద్రంకు సంబంధించిన కమిటీ, ముస్లీం యూత్ సొసైటీతోపాటు ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ తహశిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశిల్దార్ చంద్రశేఖర్‌కు, మండల అభివృద్ధి కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావులతో పాటు ఎంఈఓ ఆంజనేయులు, మరో ఎంఈఓ మల్లునాయక్‌కు వినతిపత్రం అందించారు. మైదానంలో బాలికలవసతిగృహం నిర్మాణం జరిగితే ఆటస్థలం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురిచేచెందుతున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలకు చెందిన విలేఖరులు, సయ్యద్ సర్దార్, షేక్ రియాజ్, చేకూరిశేఖర్, ఉప్పలపాటి రమేష్, పొట్టి రవి, షేక్ షరీఫ్, సుభాష్, తదితరులు ఉన్నారు.

## ఎస్సీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి



**వెలిగండ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్‌భాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 సంవత్సరం నుండి 50 సంవత్సరాల వయసు వరకు ఉన్న ఎస్సీ అభ్యర్థులు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఏప్రిల్ 14వ తేదీ నుండి మే నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ పోర్టల్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఆధాయ దృవీకరణ పత్రం, కులం సర్టిఫికేట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్, పాస్ ఫొటోస్ తీసుకెళ్లాల్సిందిగా తెలిపారు. పూర్తి సమాచారం కోసం మీ పరిధిలో ఉన్న సచివాలయాలను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం




**పొన్నలూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నాడు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఆహారం, విశ్రాంతి, వ్యాయామం వంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యం సంరక్షించుకోవాలని అన్నారు. రోజు అల్పాహారం, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పాలు, పండ్లు ఎక్కువ ఆహారంగా తీసుకోవాలని అలాగే నీరు ఎక్కువగా తాగాలని ఆమె అన్నారు. నిద్రించే సమయంలో ఎడమ వైపుకు తిరిగి నిద్రపోవాలని సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎం.మధురవాణి, కే.రాధ, ఎస్‌కే గౌస్య, ఏడబ్ల్యూహెచ్ ఎస్‌హెచ్ షాజము, ఏఎన్ఎం హరిత, గర్భిణీ స్త్రీలు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పశువుల నీటి తొట్లను త్వరగా పూర్తి చేయాలి



**వెలిగండ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మండలంలో పశువుల తాగునీటి కోసం నిర్మిస్తున్న పశువుల తొట్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ భాషా సూచించారు. ఆయన మండలంలోని మొగుల్లూరు పంచాయతీలో పశువుల కోసం నిర్మిస్తున్న నీటి తొట్లను ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి తొట్లను అందుబాటులోకి తెస్తే పశువులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. మండలంలోని పంచాయతీల్లో నిర్మిస్తున్న నీటి తొట్లను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నీటి తొట్లను కొలతల ప్రకారం పారదర్శకంగా మరపగుండ్ల, కొటాలపల్లి, గన్నవరం, ఇమ్మడిచెరువు తదితర సచివాలయాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సర్వేలన్నీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రసీదుపురంలో రీసర్వే గ్రామసభ




**హనుమంతునిపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి పంచాయతీ లో గల రసీదుపురం గ్రామంలో బుధవారం డిప్యూటీ తహశీల్దార్ కే.కేశవ కిషోర్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 27 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటికే 8 గ్రామాలు పూర్తి అయ్యాయని, మొదటి విడతగా వీరరామపురం గ్రామం నిర్వహిస్తుండగా, రెండో విడతగా మండలంలో రసీదుపురం గ్రామంని గుర్తించడం జరిగిందని, గ్రామంలో ప్రతి రైతు రీ సర్వేకు హాజరై భూకమతాల్ని తనిఖీ చేయించుకోవాల్సిందిగా తెలిపారు. అలాగే ఆన్‌లైన్ లేని వారు ఇతరుల ఖాతాలు, తల్లిదండ్రులు మరణించిన వాళ్లు కొనుగోలు ద్వారా సంక్రమించిన వారు అందరూ గ్రామ రెవెన్యూ అదికారిణి సంప్రదించి ఆన్‌లైన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులకు రీ సర్వే విషయం తెలియపరిచి రీ సర్వేకు హాజరు కావాలని, రైతులందరూ తప్పనిసరిగా హాజరై మంచి సర్వే రికార్డును, రెవెన్యూ రికార్డులను రూపొందించుటకు సహకారం అందించాల్సిందిగా కోరారు. రసీదుపురం గ్రామంలో మొత్తం విస్తీర్ణం 1288.66 సెంట్లు కలదు, పట్టా భూమి 316.78 ప్రభుత్వ భూమి 548.75 సెంట్లుగా కలదు. మొత్తం ఖాతాలు 380 మొత్తం సర్వే నెంబరు 141 ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సరిహద్దులు నిర్ణయించి ఎఫ్‌పీఓఎల్‌ఆర్ పూర్తి చేసి ఆ తదుపరి పట్టా భూములు సర్వే చేస్తామని గ్రామ సభ ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య, గ్రామ రెవెన్యూ అధికారి గురుస్వామి, గ్రామ సర్వేయర్లు లక్ష్మీ నారాయణ, శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం చేసిన ఇన్‌ఛార్జీ గూడూరి



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
పెద్దదోర్నాలలో అత్యాధునిక హంగులతో అధునిక సాంకేతిక సౌకర్యాలతో డాక్టర్ రావులకొల్లు కాశిరావు డాక్టర్ భవనగిరి లావణ్య దంపతులచే నూతనంగా నిర్మించిన శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ రావులకొల్లు కాశీరావు అధ్యక్షత వహించారు. ఆసుపత్రి సముదాయంలోని వివిధ విభాగాలను వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభోత్సవం చేసి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో సకల సౌకర్యవంతమైన వసతులతో కూడిన ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అదే క్రమంలో ప్రజలకు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలు వెళ్లకుండా శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అధునాతన వైద్య సేవలు పొందుతారన్న ఆశాభావం గూడూరి ఎరిక్షన్‌బాబు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయుసీ రాష్ట్ర కార్యవర్గ బట్టు సుధాకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు షేక్ మాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, దోర్నాల సర్పంచ్ చిత్తూరి హారిక, టీడీపీ నాయకులు చంటి, షేక్ మౌలాలి, షేక్ రఫీ, ఈ.దేవయ్య, కడిమెట్ల శ్రీనివాస్ యాదవ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గోనావత్ గాలెయ్య నాయక్, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకటమురళి, బీజేపీ మండల కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి, ప్రసాద్ నర్సింగ్ హోమ్ ఆసుపత్రి డాక్టర్ జి.ప్రసాద్, డాక్టర్ మాధవరావు, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ వైద్య సంజీవ్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రవితేజ, డాక్టర్ రాజీవ్, డాక్టర్ అనూష, డాక్టర్ విజయకుమార్, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

### పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలలో భాగంగా పెద్దదోర్నాల పట్టణ నటరాజ్ సెంటర్లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం దోర్నాలలో జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిత్తూరి హారిక, టీడీపీ నాయకులు వెచ్చ హరగోపాల్, రావిక్రింది నరసింహారావు, దేశ నాగేంద్రబాబు, బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, జడి లక్ష్మయ్య, జనసేన అధ్యక్షులు కేతి వెంకట మురళి, బీజేపీ అధ్యక్షుడు సురవరంగండి వీరారెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయండి

**- వైఎస్సార్‌సీపి రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీభేగ్**




**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సిపి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్సీపి రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీ బేగ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లీం మైనార్టీలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఇందులో భాగంగానే వక్ఫ్‌బోర్డు బిల్లును తీసుకొచ్చింది అని వైఎస్సార్సీపి రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీభేగ్ ఆరోపించారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం ముస్లీం సంక్షేమానికి ఆకాంక్షించే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వక్ఫ్ బోర్డుబిల్లును వ్యతిరేకించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్సీపి మైనార్టీ నాయకులు, నియోజకవర్గ మైనార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితుల వ్యక్తులు కనిపిస్తే సమాచార మందించాలి

**- ఎస్సై బి.నరసింహారావు**



**కంభం రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచార మందించాలని కంభం ఎస్సై బి.నరసింహారావు ప్రజలకు సూచించారు. కంభం పట్టణంలోని స్థానిక అర్బన్ కాలనీవాసులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా వేరే ప్రాంతాలకు వెళ్తుంటే తమకు సమాచారమివ్వాలని కోరారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు ఉన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



**కంభం రూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**
అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం కంభం పట్టణంలోని స్థానికఅర్బన్ కాలనీలోని ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపైఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి డి.పి.చౌదరి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఆందోళన పడకుండా ఆలోచనతో అగ్నిప్రమాదాలను అరికట్టే నైపుణ్యాలను ప్రయోగాత్మకంగా వివరించారు. గ్యాస్ సిలిండర్ వాడుకలో అప్రమత్తంగా ఉండాలని, పొరపాటున ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం**



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 14 నుండి 20 వరకు జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మార్కాపురంలోని వివిఎస్ఆర్ ప్రేస్టేజ్ అపార్ట్‌మెంట్ నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. అపార్ట్‌మెంట్‌లోని ప్రజలకు అక్కడ సంభవించు అగ్నిప్రమాదాల గురించి మరియు వాటి నివారణ చర్యల గురించి వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఎలక్ట్రికల్ ఫైర్స్ గురించి మరియు ఎలక్ట్రికల్ ఫైర్స్ జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల గురించి వారికి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా అగ్నిప్రమాదం జరిగినప్పుడు లిఫ్ట్‌ని వాడకుండా అక్కడ ఉండే మెట్ల మార్గం ద్వారా బయటకు రావాలిఅని వారికి సూచించడం జరిగింది. ముఖ్యంగా గృహములలో జరుగు ఎల్‌పిజి గ్యాస్ ఫైర్స్ గురించి వారికి తెలియజేసి అదేవిధంగా వారికి అందుబాటులో ఉన్నటువంఇ సామాగ్రి సహాయంతో వాటిని వారు ఏవిధంగా ఆపివేయగలరు వారికి చేసి చూపించడం జరిగింది. అదేవిధంగా వారికి ఈ క్రింది జాగ్రత్త చర్యలను తెలియజేయడం జరిగింది. అందరు కూడా వారి యొక్క గృహములలో ఎంసిబిలను వాడటం వలన ఎలక్ట్రికల్ ఫైర్స్ జరగకుండా అవకాశం ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రికల్ వైరింగ్ కూడా తరచుగా క్వాలిఫైడ్ ఎలక్ట్రిషన్ ద్వారా తనిఖీ చేయించాలని తెలియజేయడం జరిగింది. అందరు కూడా వారి ఇంటిలోని వస్తువులను సక్రమంగా పెట్టుకోవాలని, అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ఆ ప్రమాదం నుండి వారు ఏ విధంగా సురక్షితంగా బయటపడాలో వారికి చేసి చూపించడం జరిగింది.

## నేర నియంత్రణే లక్ష్యంగా మార్కాపురంలో కార్డన్ అండ్ సెర్చ్

**- సరైన పత్రాలు లేని 18 మోటారు సైకిళ్ళు , 5 ఆటోలు స్వాధీనం**



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘీక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మార్కాపురం పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి బుధవారం మార్కాపురంలోని ఏకలవ్య కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్‌లో పోలీసులు ఆయా ప్రాంతాల్లోని అనుమానిత వ్యక్తులు/పాతనేరస్తుల ఇళ్ళల్లో గ్రామ శివారులు, ముఖ్యమైన కూడళ్లు, పలు షాప్‌లలో డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 5ఆటోలు, 18బైక్‌లు, 3మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణ, అసాంఘీక కార్యక్రమాల అడ్డుకట్టకి పోలీసుశాఖ నిర్వహించే కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమానికి ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని పోలీసు అధికారులు కోరారు. వారి ప్రాంతంలో చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘీక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదాడయల్ 112/100కు తెలియజేయాలని కోరారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్‌లో మార్కాపురం సిఐ పి సుబ్బారావు, మార్కాపురం ఎస్సై డాక్టర్ ఎం రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ విజయోత్సవం



**పెద్దారవీడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ విజయవంతంగా పూర్తి కావడంతో బుధవారం కళాశాల ప్రాంగాణంలో ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్‌వి.కృష్ణారెడ్డి శాఖాధిపతులు , ఫాకల్టీ సభ్యులు మరియు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగాప్రసంగించిన ఈసిఈశాఖ ప్రతినిధి మాట్లాడుతూ ఇన్నోవేషన్ అంటే సిద్ధాంతాన్ని మాత్రమే కాదు, అనుభవంతో కూడిన పరిష్కారాలను రూపొందించడం, మా విద్యార్థులు ఈ ల్యాబ్ ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. యూజర్ అవసరాలను అర్థం చేసుకొని, అనేక సాంకేతిక సమస్యలకు ఆవిష్కరణాత్మక పరిష్కారాలు రూపొందించారు. ఇది ఒక గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ ల్యాబలో విద్యార్థులు విభిన్నమైన ప్రాజెక్టులపై పనిచేశారని కొంతమంది విద్యార్థులు స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్, ఇంకొంతమంది గ్రామీణ మౌలిక వసతులపై ఆధారిత డిజిటల్ సొల్యూషన్లు రూపొందించారు. వారు ఆవిష్కరణలు నూతన ఆలోచనలకు దారితీసేలా ఉన్నాయన్నారు.

### అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడును తల్లిదండ్రులకు అప్పగింత




**సింగరాయకొండ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
స్థానిక రైల్వే స్టేషన్లో ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడును అదుపులోనికి తీసుకోని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సరస్వతి పల్లి గ్రామానికి చెందిన బోనం శెట్టి ఆదినారాయణ కుమారుడు నాగేంద్ర 18 సంవత్సరాల యువకుడు యువకుడు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలలో ఫెయిల్ అవ్వడం వల్ల ఇంట్లో అమ్మానాన్న తిడతారని భయపడి తిరుపతి నుండి ట్రైన్ ఎక్కి సింగరాయకొండ రైల్వే స్టేషన్లో దిగాడు. స్టేషన్ ఆవరణలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఈ విద్యార్థిని సిఐ ఆఫీస్ లోని కానిస్టేబుల్ శీనుకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ ఆ విద్యార్థి వద్దకు వచ్చి మాట్లాడి వివరాలు సేకరించి స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకొని వచ్చారు. ఆ యువకుడు తల్లిదండ్రులును పిలిపించి, నాగేంద్రకుఎస్ఐ బి.మహేంద్ర కౌన్సిలింగ్ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## కెఎస్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం




**గిద్దలూరు, ఏప్రిల్ 16 ,ప్రభాతవార్త**
గిద్దలూరు ప్రాజెక్టు పరిధిలోని క్రిష్టంశెట్టిపల్లి అంగన్ వాడీ కేంద్రంలో ఇన్చార్జి సిడిపిఓ బి జ్యోతి అధ్యక్షతన పోషణ బుధవారం పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు సున్నా నుండి 5 సంవత్సరముల పిల్లల తల్లులకు, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఆరు నెలల పిల్లల వరకు తల్లిపాలను మాత్రమే ఇవ్వడం శ్రేష్టమని గర్భవతులకు, బాలింతలకు తెలియజేశారు. గర్భవతులకు గర్భవతి నమోదు ఆహ్వానము మరియు శ్రీమంతాల గర్భవతులకు పోషణ సంరక్షణ వారు తీసుకునే ఆహారపు అలవాట్లు గురించి తల్లులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిది. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు లక్ష్మీ, రాధ రామజ్యోతి, కోటేశ్వరమ్మ, రంగలక్ష్మీ, అంగన్ వాడీ ఆయాలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొనకనమిట్ల మండల సర్వసభ్య సమావేశం

**కొనకనమిట్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**
కొనకనమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10.30 నుంచి ప్రారంభమవుతుందని, ముఖ్యంగా తాగునీటి సమస్యతో పాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

**చీరాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్, చీరాల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొమ్మనబోయిన రజిని, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, వేటపాలెం మండలం మహిళా అధ్యక్షురాలు యర్ర శివ నాగమల్లేశ్వరి, జనసేన నాయకులు కారంపూడి పద్మిని, బీజేపీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ కన్వర్జెన్స్ సమావేశం

**వేటపాలెం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ప్రకృతి వ్యవసాయ మండల కన్వర్జెన్స్ సమావేశం వేటపాలెం మండలంలో మండల వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ దిశగా ఉన్న తరుణంలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా సంఘాలు ఈ ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో చాలా సైన్స్ ఉందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయాల్సి అవసరం ఉందన్నారు. ప్రకృతి జిల్లా వ్యవసాయాధికారి వాణిశ్రీ మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 గురించి వివరించారు. మండల ఏవో కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆర్ఎస్‌కేలు ఏపీసీ ఎన్ఎఫ్ క్యాడ్రీ కలిసి ఈ ప్రకృతివ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి మండలంలో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్న గ్రామాలలో ప్రగతి గురించి వివరించారు. నేలతల్లి వీడియో, పీఎండీఎస్ గురించి వీడియో రూపంలో చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్‌వో అలేఖ్య, ఇన్‌ఛార్జి ఏడీఏ భాస్కరరావు, ఏపీఎం అంజిబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీతారావమ్మ, వీఓ అధయక్షులు వీఓఏలు, ఏఈఓలు, వీఏఏలు, డీపీఎంయు నుండి నందన పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ సంఘం అధ్యక్షుడు అసోది బ్రహ్మానందరెడ్డి

**చిన్నగంజాం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి నాయకులు ఆర్థిక సహాయం అందించారు. చిన్నగంజాం గ్రామంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బడుగు అంకయ్య గత శుక్రవారం మరణించడంతో మండల నాయకులు కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాడి శ్యామ్ కుమార్, షేక్ మహ్మద్, అక్కల కృష్ణారెడ్డి, బాబు, విజయ్‌బాబు, పాల్, మారిపోయిన హేమంత్‌రెడ్డి, జాషువా, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు స్థలం, దారి కల్పించాలని కలెక్టర్‌కు వినతి


**చీరాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



చీరాల మండలం ఓడరేవు పిడుగురాళ్ల జాతీయ రహదారి 167ఏ విస్తరణ పనుల్లో కోల్పోయిన విజయనగర కాలనీ స్మశాన వాటిక స్థలం, అదే విధంగా స్మశాన వాటికకు పోవుటకు, రాకపోకలు కొనసాగించడానికి దారిని మంజూరు చేయాలని విజయనగర కాలనీ గ్రామ పెద్దలు, ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ వెంకట మురళీని కలిసి వినతిపత్రం అందజేశారు. 1985 జులై 17న జరిగిన కారంచేడు దారుణ మారణకాండ ఘటన తర్వాత బాధితులకు చీరాల మండలంలో అప్పటి ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుని విజయనగర్ కాలనీ గ్రామంను ఏర్పాటు చేసి 8 ఎకరాలు స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించడం జరిగింది. అయితే ఇటీవల కాలంలో ప్రతిపాదించబడిన ఓడరేవు పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారి ఈ గ్రామం పక్క నుండి నిర్మాణం జరగడం వలన, విజయనగర కాలనీ గ్రామానికి చెందిన స్మశాన వాటిక స్థలంలో చాలా వరకు జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోవడం జరిగిందన్నారు. గ్రామ స్మశాన వాటికలో కోల్పోయిన స్థలాన్ని మరొక చోట ఇప్పించాలని, అదే విధంగా స్మశానంలోకి అంత్యక్రియలు జరపడానికి వెళ్ళడానికి, రాకపోకలు జరిపించడానికి దారిని వదలాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్న కారణంగా వీలైనంత త్వరగా దారి విషయంలో చొరవ తీసుకోవాలని లేనిచో రహదారి నిర్మాణం జరిగాక దారి ఇవ్వడానికి అవకాశం ఉండదు కనుక అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత అధికారుల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీ గ్రామ పెద్దలు తేళ్ల లక్ష్మీ ప్రసాద్, తేళ్ల దేవదానం, తేళ్ల ప్రసాద్, దుడ్డు ఏసుపాదం, ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షులు బుదంగుంట లక్ష్మీ నరసయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం మాదిగ, తాళ్లూరి రాజేష్, దుడ్డు వెంకటేశ్వర్లు, చుండూరి రమేష్‌బాబు, తేళ్ల రాంబాబు, దుడ్డు విజయభాస్కర్, నన్నిపాముల నాగేశ్వరరావు, చందోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద సృష్టించవచ్చు - డీఎల్‌పీఓ శివనారాయణ


**చీరాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



చెత్త నుండి సంపద సృష్టించవచ్చు అని దిశగా ఆరోగ్యకరమైన సమాజం కోసం వ్యర్థాల సరైన నిర్వహణ చాలా ముఖ్యం కావున కార్యదర్శులు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలని డీఎల్‌పీఓ నారాయణ అన్నారు. వేటపాలెం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద ఈ నెల 21న చిన్నగంజాం, 22, 23 చీరాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బుధవారం కొత్తపేట పంచాయతీ కార్యదర్శి బి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో వేటపాలెం మండలంలోని తొమ్మిది పంచాయతీల కార్యదర్శులకు, పారిశుధ్య సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీ విధానంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమంను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో శివ నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లోనే చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిర్మాణంలో ఆగిపోయిన కేంద్రాల్లో మిగిలిన పనులు పూర్తి చేసి వాటిని కూడా అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సంపద కేంద్రంలో తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువును తయారు చేయడం వాటిని అమ్మకంను వివరించారు. దీని నిర్వహణ వల్ల గ్రామంలో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతి మంగళ, గురు, శనివారం మూడు రోజులు అదే విధంగా ప్రతి మూడవ శనివారం త్రేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వేటపాలెం ఎంపీడీఓ రాజేష్, డిప్యూటీ ఎంపీడీఓ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ

**టంగుటూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి బుధవారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృపాకర్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోజు ఇది అని, రెల్లి మాదిగ అనుబంధ కులాల విద్యార్థినీ, విద్యార్థులు నిరుద్యోగులు ఈ వర్గీకరణ ఆర్డినెన్స్ ద్వారా వచ్చే విద్య, ఉద్యోగ అవకాశాలను అందింపుచ్చుకోవాలని కృపాకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఇన్ని దశాబ్దాల సమయం, త్యాగాలు చేయాల్సిన అవసరం మాదిగ, రెల్లి అనుబంధ కులాల వారికి అవసరం లేకపోయి ఉండేది. మాదిగలను నిత్యం ప్రతిపక్షంలో ఉంచి వర్గీకరణ అంశాన్ని అందులేని కథగా మార్చి, ఒక్కడి పబ్బం గడుపుకునే మంద కృష్ణ కుట్రలకు కార్యకర్తలు, నాయకులు లక్షలాది మాదిగ ప్రజలు దశాబ్దాలు వారి హక్కులను దూరమయ్యాయని ఈ సందర్భంగా కృపాకర్ మాదిగ నిప్పులు చెరిగారు.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముండ్లమూరు మండల కమిటీ

**ముండ్లమూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మండలంలో అనేక గ్రామాలలో ఈ మధ్య కురిసిన అకాల వర్షాలు ఈదురు గాలికి మండలంలో బొప్పాయి మిర్చి, మొక్కజొన్న వరి, పొగాకు, దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల రైతు సంఘం నాయకులు పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, ఎస్‌కే మీరావలి, గంగినేని సత్యనారాయణ, గ్రామాలను సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మేము లక్షల్లో పెట్టుబడి పెట్టి ఈ వర్షం వల్ల పూర్తిగానష్టపోయాము అని లబోదిబోమని లాడుతూ మాకు ప్రభుత్వం సహాయం చేయాల్సిందిగా కోరారు. అలాగనే అనేక గ్రామాలలో వైట్ బర్లీ పొగాకు వేసిన రైతులు కొనడం లేదని ధర సరిగ్గా ఇవ్వడం లేదని, ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు కలుగజేసుకుని మా పంటను కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నారు. పై పరిస్థితులు రీత్యా మండలంలో దెబ్బతిన్న బొప్పాయి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం ఇప్పించి అలాగే వైట్ బర్లీ పొగాకుకుగొట్టబాటు ధరలు కల్పించి కొనుగోలు జరిగేటట్లు చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముండ్లమూరు మండల కమిటీ. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి ఏవోకి వినతిపత్రం అందజేసి డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, రాజా రమేష్, వెల్లంపల్లి ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో దొంగలపట్ల అప్రమత్తంగా ఉండాలి - సీఐ రామారావు

**దర్శి ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ప్రస్తుతం వేసవి కాలంలో దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగి ఇండ్ల నుండి ప్రయాణాలకు వెళ్లే సమయంలో తాళాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని అదే విధంగా స్థానిక పోలీసులకు తెలియజేయాలని అదే విధంగా గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఇండ్ల తాళాలను చెప్పుల స్టాండుల్లో గూట్లో పెట్ట కూడదని గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరించిన మీ చుట్టు పక్కల ఉన్న వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన తెలిపారు. కాబట్టి వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

## రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లు

**దర్శి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం దర్శి మండల కమిటీ సమావేశానికి కేవీ పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 25 నుండి 28 వరకు ఉన్న నిబంధనలు మత స్వేచ్ఛను కలిగిస్తున్నాయని అన్నారు. వక్ఫ్‌బోర్డులో ముస్లిమేతర్లు ను చేర్చడం , పర్యవేక్షణను కలెక్టర్లకు అప్పగించడం లాంటి అంశాలు ముస్లిం మైనార్టీలకున్న హక్కులు హరించడమేనని అన్నారు. మైనార్టీలకు వ్యతిరేకమైన ఈ సవరణ చట్టాన్ని రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు సమర్ధించడం అత్యంత విషాధకరమని ఆయన అన్నారు. మైనార్టీ హక్కులకు భంగం కలిగిస్తున్న ఈ చట్ట సవరణలను ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, పార్టీ మండల కన్వీనర్ సందు వెంకటేశ్వరరావు, నాయకులు ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ పాల్గొన్నారు.

## ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మహాపురుషుడు, పొట్టి శ్రీరాములు పూర్వీకుల జన్మస్థలమైన కనిగిరిలో ఆయన 125 శత జయంతి వేడుకలు జరుపుకోవడం ఆ వేడుకలలో నేను పాల్గొనడం నాకెంతో గర్వంగా టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. కనిగిరిలో బుధవారం నిర్వహించిర పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాల్లో ఆమె పాల్గొని ప్రసంగించాఉ. భాసాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు , మహాత్మ గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములు చిన్న తనం నుండే గాంధీజీ ఆశయాలను పుణికిపుచ్చుకుని దేశభక్తితో ఉద్యమాల్లో పాల్గొన్నారు. శ్రీరాములు వంటి మరో పది మంది సహచరులు నాకు లభిస్తే ఒక్క సంవత్సరం లోనే బ్రిటీష్ వారి నుండి భారతదేశానికి విముక్తి కల్గించగలనని గాంధీజీ అన్నారంటే ఆయన ఎంతటి ఉద్యమశీలి అనేది అర్ధమవుతుందని, పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్పూర్తిగా తీసుకుని నవ్యాంధ్ర పునర: నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. కూటమి 10 నెలల పాలనలో ప్రజల సంక్షేమ అభివృద్ధి ధ్యేయండా ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీపిస్తున్నారు. ఇదే స్పూర్తితో మనం కూడా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## పోషణ పక్వాడ కార్యక్రమం

**ముండ్లమూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ముండ్లమూరు సచివాలయంలో గర్భవతులకు శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఎంపీడీఓ జనార్ధన్ హాజరయ్యారు. గర్భవతులు, బాలింతలు, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ముండ్లమూరు పీహెచ్‌సీ వైద్యులు వెంకటేశ్వరరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, సచివాలయ సెక్రటరీ పరమేశ్వరి, ఏఎన్ఎం ప్రభావతి, ఏడబ్ల్యూడబ్ల్యూ మంజుల, విజయ, కల్పవల్లి, జ్యోతి, శామ్మ, ఆశాలు పాల్గొన్నారు.

## ముండ్లమూరులో పొట్టి శ్రీరాములు జయంతి

**ముండ్లమూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మండలంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆర్య వైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర శ్రీరామమ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు అమరా నాగభాను, ప్రకాష్‌రావు, గార్లపాటి సత్యనారాయణ, గార్లపాటి కృష్ణ, మిత్తింటి పుల్లారావు, పొట్టి శ్రీరాములు మేనల్లుడు గునుపూడి సత్యనారాయణ, గునుపూడి సురేష్, గునుపూడి హనుమంతరావు, మండలఆర్యవైశ్యులు కనిగిరిలోని పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

## శ్రీపొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవ జయప్రదానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు

### - ఆర్యవైశ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొలిపర్తి

**కనిగిరి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



కనిగిరిలోని ఎంబీఆర్ కళ్యాణ మండపం నందు రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం విజయవంతం అయినందుకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్యవైశ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొలిపర్తి మారుతికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మోడల్ స్కూల్లో ఏప్రిల్ 21న 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణ

**ముండ్లమూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

ముండ్లమూరు మోడల్ స్కూల్ నందు 6వ తరగతికి నిర్వహించే ప్రవేశపరీక్ష తేదీని ఏప్రిల్ 20 ఈస్టర్ పండుగ సందర్భంగా తరువాత రోజు ఏప్రిల్ 21వ తేదీకి మార్చడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరరావు తెలియజేశారు. కనుక ఈ విషయంను గమనించి 6వ తరగతి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 21వ తేదీ ప్రవేశపరీక్షకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా తెలియజేస్తున్నాము అదే విధంగా మా స్కూల్ ఏప్రిల్ 17న 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాయబోయే విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. కనుక అందరూ తప్పనిసరిగా హాసరై మీ సందేహాలు నివృత్తి చేసుకోగలరు. అలాగే మా కళాశాల నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం ఉందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోగలరని పాఠవాల ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరరావు తెలియజేశారు.

## పొట్టి శ్రీరాములు జయంతిన బాలికలకు పారితోషిక అందజేత

**కనిగిరి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురష్కరించుకుని రాష్ట్ర భ్రుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కనిగిరిలోని ఎంబీఆర్ కళ్యాణ మండపంలో ప్రత్యేక ఉత్సవాలు బుధవారం నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలలో భాగంగా కనిగిరి మానవతా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కనిగిరి టౌన్, రాష్ట్ర స్థాయిలో అగ్రర్యాంకులు సాధించిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థినులకు పారితోషికం రూ.20వేలు నగదు బహుమతులను అందజేశారు. ఈ అవార్డులను ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అందజేశారు. జి.కీర్తన 900/1000'(ఎంపీపీ), షేక్ నజ్మా 989/1000(బైపీసీ), సయ్యద్ అస్మిన్ 988/1000(బైపీసీ) ఈ ముగ్గురు విద్యార్థినులు కనిగిరి విజేత ఐఐటీ అండ్‌నీట్ అకాడమీలో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

## కనిగిరికి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### - కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ వినతి

**కనిగిరి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీకి శాశ్వత నీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని కోరుతూ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ వినతిపత్రం అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీ గతంలో గ్రామ పంచాయతీగా తరువాత నగర పంచాయతీగా, ప్రస్తుతం మున్సిపాలిటీగా అభివృద్ధి చెందింది. అయితే అభివృద్ధి పరంగా ఇంకా వెనుకబడి ఉందని చైర్మన్ తెలిపారు. సుమారు 50 వేల పైచిలుకు జనాభా ఉన్న ఈ మున్సిపాలిటీలలో తాగునీటి కొరత తీవ్రమై, ప్రజలకు ట్యాంకర్ల ద్వారానే నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఏస్‌సీ గ్రాంట్ కింద నిధులను మంజూరు చేసినప్పటికి కొంత కాలంగా ఆ గ్రాంటును నిలిపివేయడం వల్ల ప్రస్తుతం నీటి సరఫరా కోసం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫలితంగా మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం మొత్తం నీటి సరఫరాకే ఖర్చవుతూ, ఇతర అభివృద్ధి పనులకు నిధులేమి తలెత్తుతోందని ఆయన వాపోయారు. ఈ నేపధ్యంలో మళ్లీ ఏఎస్‌సీ గ్రాంట్ మంజూరు చేసి, శాశ్వత నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్టు

### - సీఐ భీమా నాయక్‌ను అభినందించిన డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

**పామూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ఈనెల 13వ తేదీన పామూరులోని ప్రశాంతినగర్‌లో భార్యను అనుమానంతో హత్య చేసిన నిందితుడు యాసారపు రమేష్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.సాయిఈశ్వర్ యశ్వంత్ విలేకర్లకు తెలిపారు. సీఎస్‌పురం మండలం నల్లదిమ్మపాడు గ్రామానికి చెందిన యాసారపు రమేష్ భార్య మార్తమ్మ కూలీ పనులు చేసుకుంటూ పామూరులోని ప్రశాంతి నగర్‌లో గత కొంతకాలంగా జీవిస్తున్నారు. మద్యానికి బానిసై తరచు వేదిస్తుండటంతో భార్య మార్తమ్మపై అనుమానంతో తరచు గొడవలు జరుగుతుండేవని తెలిపారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఇంట్లో నిద్రిస్తున్న మార్తమ్మపై రోకలిబండపై గట్టిగా మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రమేష్ పరారీలో ఉండటంతో కేసు టేకాప్ చేసిన సీఐ భీమానాయక్ మూడు రోజుల్లోనే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని అరెస్టు చేయడం జరిగిందని అభినందించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని తెలిపారు. మృతురాలి అన్న గంధం ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి తక్కువ కాలంలోనే నిందితుడిని అరెస్టు చేసి ప్రజల్లో ప్రజలపై నమ్మకాన్ని పెంపొందిస్తున్న వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబులు పాల్గొన్నారు.

## అనుమానం ఉన్న కార్లను తనిఖీచేసిన సీఐ భీమానాయక్

**పామూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



వరుస దొంగతనాలతో పోలీసులకు సవాల్ విసురుతున్న ముఠాను అరెస్టు చేసేందుకు సీఐ భీమానాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటీవల కాలంలో పామూరులో పట్టపగలు మూడు ఇళ్లల్లో షిఫ్ట్ డిజైర్ టూర్ మోడల్ వైట్ కారులో సంచరిస్తూ పామూరు, నెల్లూరు జిల్లాలోని బుచ్చి, కోవూరు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నట్లు సీఐ భీమా నాయక్ తెలిపారు. అందులో భాగంగా వైట్ సిఫ్ట్ కారును నేషనల్ హైవే 565 వద్ద ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. దొంగలు తరచూ నెంబరు ప్లేట్లు మార్చడమే కాకుండా సీసీ కెమెరాలకు అందుబాటు లేని కారణంగా అద్దాలకు నల్లటి స్టిక్కర్లను వేసి తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వైట్ షిఫ్ట్ కారు ఈ ప్రాంతాల్లో కనిపిస్తే తక్షణమే ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే తక్షణమే సమాచారం అందించి నేర నియంత్రణలో పౌరులుగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సీఐ సూచించారు. గ్రామాల్లో అనుమానం కలిగిన కార్లు కనిపిస్తే 912110 2214, 9121102215, సమాచారం ఇచ్చి పౌరులుగా బాధ్యత వహించాలని సీఐ కోరారు.

## గర్భవతులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

### - తహాశీల్దార్ రమణారావు - ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య

**పామూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



గర్భవతులు మంచి సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శిశు ఆరోగ్యంగా జన్మిస్తారని అన్నారు. బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ రమణారావు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్యలు మాట్లాడుతూ వెయ్యి రోజులు బంగారు రోజుల గురించి గర్భవతులకు బాలింతలకు తల్లులకు వివరించారు. గర్భవతులు ప్రతి నెల డాక్టర్ల సలహాలు మేరకు టీకాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పాలు, గుడ్లు, ఆకు కూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, చిక్కీలు, పండ్లు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పిల్లల్లో ఊబకాయని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు కిషోర బాలికల్లో రక్తహీనత నివారణ కొరకు ఆరోగ్య శాఖ వారు ఇచ్చే విటమిన్ మాత్రలను సి విటమిన్ లను తీసుకోవాలన్నారు. అనంతరం గర్భవతులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల సమైక్య అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ, సీసీ సరళ, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

## బి.నిడమానూరులో పోషణపక్వాడా కార్యక్రమం

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



మండలంలోని బి.నిడమానూరు గ్రామంలో పోషణపక్వాడా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సచివాలయ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొని తల్లులు, గర్భవతులకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. వెయ్యి రోజులు బంగారు రోజుల గురించి గర్భవతులకు బాలింతలకు తల్లులకు వివరించారు. గర్భవతులు ప్రతి నెల డాక్టర్ల సలహాలు మేరకు టీకాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పాలు, గుడ్లు, ఆకు కూరలు, చిక్కీలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పిల్లల్లో ఊబకాయని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు కిషోర బాలికల్లో రక్తహీనత నివారణ కొరకు ఆరోగ్య శాఖ వారు ఇచ్చే విటమిన్ మాత్రలను సి విటమిన్ లను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, సూపర్‌వైజర్స్ అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మీ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# 4 నెలల్లో 85 వేల వీసాలు జారీచేసిన చైనా!



## భారత్‌పట్ల అంతకంతకూ పెరుగుతున్న బంధం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** అమెరికాతో వాణిజ్య యుద్ధం చేస్తున్న చైనా, ఇప్పుడు అనివార్యంగా భారతదేశానికి తన స్నేహ హస్తం చాస్తోంది. ఇప్పటికే ట్రంప్ చైనా ఉత్పత్తులపై సుంకాలను 245శాతానికి పెంచేసారు. అయినా కూడా చైనా వెనకడుగు వేయడంలేదు. సరికదా తనకు పొరుగునే ఉన్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు తహతహలాడుతోంది. ఇందుకు సూచనగా భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం, ఈ ఏడాది జనవరి 1 నుంచి ఏప్రిల్ 9 మధ్య భారతీయ పౌరులకు 85,000 కంటే ఎక్కువ వీసాలను జారీ చేసింది. ఇరుదేశాల ప్రజల మధ్య ఉన్న సంబంధాలను మరింత పెంపొందించడానికి చైనా చేస్తున్న ప్రయత్నంగా దీనిని చెప్పుకోవచ్చు.గతంలో ఎన్నడూ లేని విధంగా చైనా ఇప్పుడు భారతీయులకు అధికంగా వీసాలు ఇస్తోంది. చైనా 2023 సంవత్సరం మొత్తానికి 1,80,000 ఇస్తే, ఈ ఏడాది మొదటి 4 నెలల్లోనే 85,000కు పైగా వీసాలు జారీ చేసింది. దీనికి ప్రధాన కారణం, గతేడాది చైనా వీసా దరఖాస్తు విధానాన్ని మార్చింది. అనేక సడలింపులు కూడా ఇచ్చింది.

ఈ నయా వీసా నిబంధనల ప్రకారం, భారతీయ దరఖాస్తుదారు ఇకపై చైనా వీసా కోసం దరఖాస్తు సమర్పించే ముందు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. నేరుగా వీసా కేంద్రాల్లోనే ఆ పని పూర్తి చేయవచ్చు. 180 రోజుల కంటే తక్కువ కాలం చైనాలో బస చేయడానికి వీసా కావాలన్నా, స్వల్పకాలిక, సింగిల్, డబుల్ ఎంట్రీ వీసాలు కావాలన్నా గతంలో వేలిముద్రలు, బయోమెట్రిక్ డేటాను అందించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరంలేదు. అంతేకాదు చైనా రాయబార కార్యాలయం వీసా దరఖాస్తు రుసుములను కూడా తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు పలు దేశాలపై ప్రతీకార సుంకాలు విధించి వాణిజ్య యుద్ధం ప్రారంభించారు. దీనితో ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. దీనితో కాస్త వెనక్కు తగ్గిన ట్రంప్, చైనా మినహా మిగతా దేశాలకు 90రోజులపాటు టారిఫ్‌రిలీఫ్ ఇచ్చారు. కానీ చైనాపై సుంకాల మోతమోగించారు. ఏకంగా 245శాతానికి సుంకాలు పెంచారు. దీనితో అమెరికాపై 125 శాతం మేర సుంకాలు విధించి చైనా ప్రతీకారం తీర్చుకుంది. దీనితో ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థికశక్తుల మధ్య వాణిజ్యయుద్ధం తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే అమెరికాతో జరుగుతున్న వాణిజ్య యుద్ధంలో,తమకు మద్దతుగానిలవాలని భారత్, సహాపలుదేశాలను చైనాకోరింది. భారత్‌లోని చైనా రాయబారకార్యాలయ ప్రతినిధి యు జింగ్ గతవారం మాట్లాడుతూ, చైనా,భారత్ ఆర్థిక, వాణిజ్య సంబంధం పరస్పర ప్రయోజనంపై ఆధారపడి ఉంటుంది. అందుకే రెండు అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలుగా ఇండియా, చైనాలు ఐక్యంగాఉండి, అమెరికా వాణిజ్య యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు.




## సిఇసి, ఇసిల నియామకంపై
# మే 14న విచారణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** సిఇసి, ఇసిల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు తేదీని నిర్ణయించింది. అన్ని పిటిషన్లపై మే 14న విచారించనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఓ పిటిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. ఈవిషయంలో త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వచ్చే నెలలో విచారణకు తేదీని నిర్ణయించింది. భూసేకరణతో పాటు అనేక ఇతర కీలకమైన కేసులను ఈ రోజు ధర్మాసనం విచారిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అయితే, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ 2023లో కేంద్రం చట్టాన్ని తీసుకువచ్చింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. అయితే, కమిటీ నుంచి సుప్రీంకోర్టు సిజెఐని తొలగించి కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్జీవో అయిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తరఫున ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో హాజరయ్యారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని ఆయన గతంలో కోర్టును కోరారు. అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని.. కానీ, ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందన్నారు. చట్టాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.



## లాకమిషన్ ఛైర్మన్‌గా
# దినేశ్ మహేశ్వరి బాధ్యతల స్వీకరణ


**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి 23వ లా కమీషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. లా కమీషన్ ఛైర్మెన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు న్యాయవాది హితేశ్ జైన్, ప్రొఫెసర్ డీపీ వర్మలు కమీషన్‌లో సభ్యులుగా నియమితులయ్యారు. ఏప్రిల్ 15,2025 నాడు వాళ్లు ఛార్జ్ తీసుకున్నారు. ఆగస్టు 31, 2027న వాళ్ల పదవీ కాలం పూర్తి అవుతుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వాశాఖ దినేశ్ మహేశ్వరి నియామకంపై ట్వీట్ చేసింది.

రాజస్థాన్‌లో సుమారు రెండు దశాబ్దాల పాటు లాయర్‌గా జస్టిస్ మహేశ్వరి ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత 2004లో ఆయన రాజస్థాన్ హైకోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా చేశారు. మేఘాలయా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కూడా చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. 2023 మేలో రిటైర్ అయ్యే వరకు ఆయన సుప్రీంకోర్టులో జడ్జిగా చేశారు. లా కమీషన్ సభ్యుడిగా నియమితులైన హితేశ్ జైన్ పరినం లా అసోసియేట్స్‌లో మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. ముంబై ప్రదేశ్ బిజెపిలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సివిల్, క్రిమినల్, కమర్షియల్, రాజ్యాంగ అంశాల్లో అనుభవం ఉన్నది. మహారాష్ట్ర తరఫున ముంబై హైకోర్టులో, సుప్రీంకోర్టులో స్పెషల్ కౌన్సిల్‌గా హాజరయ్యారు. 22వ భారత లా కమీషన్‌లో ప్రొఫెసర్ వర్మ పూర్తి స్థాయి సభ్యుడిగా చేశారు. న్యాయ విద్య బోధనలో ఆయనకు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్నది. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మానవ హక్కుల చట్టాల్లో ఆయన విశేష అనుభవం ఉన్నది. నేషనల్ జుడిషియల్ అకాడమీలో 2017 నుంచి 2020 వరకు అదనపు డైరెక్టర్‌గా చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో లా కమీషన్ నాన్ స్టాట్యుటరీ బాడీగా పనిచేస్తుంది. దేశ చట్టాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంది. సవరించాల్సిన చట్టాలను, రద్దు చేయాల్సిన చట్టాల గురించి లాకమీషన్ తననిర్ణయాలను వెల్లడిస్తుంటుంది. న్యాయం అందరికి అందేరీతిలో, న్యాయ విభాగంలో పరిపాలన సక్రమంగా సాగే రీతిలో లా కమీషన్ వ్యవహరిస్తుంది.

## ఇక రైళ్లలోను ఎటిఎంలు

**ముంబయి, ఏప్రిల్ 16:** ప్రయాణికుల కోసం ఎటిఎం సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సెంట్రల్ రైల్వే మొదటిసారిగా ముంబయి -మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఓఎటిఎంను ఏర్పాటు చేసింది. త్వరలోనే మిగతా రైళ్లలోనూ ఇలాంటి కదిలే ఎటిఎంలు వచ్చే అవకాశంఉంది. పంచవటి ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజూ నడుస్తుంది. అందుకే దీనిలో ప్రయాణించేవారి కోసం ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన ఎటిఎంను ఎసిఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి దీనిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసినప్పటికీ, త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ ఎటిఎం సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తాం. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లోని ఎసి ఛైర్‌కార్‌లో గతంలో ప్యాంట్రీ ఉండేది. ఆ స్థలంలోనే ఇపుడు ఈ కొత్త ఎటిఎంను ఏర్పాటు చేస్తున్నామని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా తెలిపారు. రైలు కదులుతున్నప్పుడు భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండడానికి దీనికి ఓ షట్టర్ డోర్‌ను కూడా అమర్చాం. అలాగే కోచ్‌లో ఎటిఎం ఏర్పాటుకు అవసరమైన మార్పులను మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# వక్ఫ్‌చట్టంపై దాఖలయిన పిటిషన్ల విచారణ షురూ!




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** వక్ఫ్ (సవరణ)చట్టం2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ప్రారంభించింది. సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టింది. కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ ఇప్పటి వరకు సర్వోన్నత న్యాయస్థానంలో దాదాపు పది పిటిషన్ల దాఖలయ్యాయి. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీలు మహమ్మద్ జావేద్, మహువా మొయిత్రా, జియా ఉర్ రెహమాన్, మనోజ్ కుమార్ ఝా, అమనాతుల్లా ఖాన్‌తో పాటు మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్‌తో పాటు పలు పార్టీలు, ముస్లిం సంఘాలు పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే, ఈ పిటిషన్లను విచారించే ముందు తమ వాదనలు వినాలని అసోం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణకు ముందు సుప్రీంకోర్టు తమ ఎదుట రెండు ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంది. మొదటిది కేసును విచారించాలా? లేదంటే హైకోర్టుకు అప్పగించాలా? అని.. రెండోది న్యాయవాదులు వాదించాలనుకుంటున్న అంశాలపై తెలిపింది. ఓ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. పార్లమెంట్ చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాల్లో తలదూర్చడమేనంటూ వాదనలు ప్రారంభించారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. 'చట్టం ప్రకారం' అనే పదాలు అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని, ఈ పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందనిపేర్కొన్నారు. వక్ఫ్అలల్ ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదని..దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదన్నారు.

ఎవరైనా వక్ఫ్‌ను స్థాపించాలనుకుంటే.. అతను ఐదేళ్లు ఇస్లాంను పాటిస్తున్నాడని నిరూపించుకోవాల్సి ఉందని.. ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్‌కు ఇచ్చారని.. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని.. సవరణ తర్వాత హిందువులు కూడా భాగంకావొచ్చని.. ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనన్నారు.

ఈ సందర్భంగా హిందువు లకు సంబంధించిన వారసత్వ విషయాల్లోనూ ప్రభుత్వం చట్టం చేసిందని, ముస్లిం సమాజం కోసం సైతం పార్లమెంట్ చట్టం చేసిన విషయాన్ని గుర్తు చేసిన సీజేఐ సంజీవ్ ఖన్నా.. ఇందులో తప్పేముందని ఇందులో తప్పేముం దని ప్రశ్నించారు. ఆర్టికల్ 26 అనేది సెక్యులర్ అని.. ఇది అన్ని మతాలకు వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా జామా మసీదు అంశాన్ని సైతం ధర్మాసనం ఎదుట కపిల్ సిబల్ లేవనెత్తారు. అయితే, జామా మసీదుతో పాటు అన్ని పురా తన స్మారక చిహ్నాలును కాపాడబడుతాయని సీజేఐ పేర్కొన్నారు.

## వెంటిలేటర్‌పై ఉన్న ఎయిర్‌హోస్టెస్‌పై లైంగికదాడి

**గురుగ్రామ్, ఏప్రిల్ 16:** అస్వస్థతకు గురై వెంటిలేటర్‌పై ఉన్న ఓ ఎయిర్ హోస్టెస్‌పై హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఒక ఆస్పత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం పోలీసులు సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్న మహిళ (46) కంపెనీ తరఫున శిక్షణ కోసం గురుగ్రామ్ వచ్చి, ఓ హోటల్‌లో బస చేశారు. ఈనెల 5న హోటల్‌లో ఉన్న ఈత కొలనులో స్విమ్మింగ్ చేస్తుండగా కింద పడి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను వెంటనే సమీపంలోని ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఐసీయూలోని వెంటిలేటర్‌పై ఉంచారు. ఆ మరుసటి రోజే తనను ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 6న వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు తనపై ఆసుపత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపింది. ఈ విషయాన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక భర్తకు చెప్పింది.

దీంతో ఇద్దరూ కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఎయిర్ హోస్టెస్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రిలోని గుర్తు తెలియని సిబ్బందిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని కోర్టులో న్యాయమూర్తి ఎదుట నమోదు చేశారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని పోలీ సులు తెలిపారు. ఆస్పత్రిలోని సిసిటివి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# ముందస్తు ప్రణాళికతోనే ముర్షిదాబాద్ అల్లర్లు

## బిజెపిపై మమతా బెనర్జీ ధ్వజం



**కోల్‌కత్తా, ఏప్రిల్ 16:** వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్‌లో అల్లర్లు ముందస్తు ప్రణాళికతోనే జరిగాయని బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. అందులో బిజెపి, బిఎస్ఎఫ్, ఇతర కేంద్ర ఏజెన్సీల హస్తం ఉందని విమర్శించారు. కోల్‌కతాలో జరిగిన ఇమామ్‌ల సమావేశంలో పాల్గొన్న బెంగాల్ సిఎం మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్న వేళ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తేవటంతోపాటు అక్రమ చొరబాట్లకు అనుమతి ఇవ్వటం బెంగాల్‌లో అశాంతికి కారణమైనట్లు ఉందన్నారు. వక్ఫ్ చట్టం మూలంగా ముర్షిదాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ఇందులో బంగ్లాదేశ్ పాత్ర ఉన్నట్లు హోం శాఖ చెబుతోంది. ఒకవేళ ఇదే నిజం అయితే, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. సరిహద్దు బాధ్యత బిఎస్ఎఫ్ చూసుకోవాలి రాష్ట్రం కాదు. బయట నుంచి వచ్చి అల్లర్లు సృష్టించడానికి బిజెపి వాళ్లు ఎందుకు అనుమతిని ఇచ్చారు. నేను అన్ని మతాల గురించి మాట్లాడుతాను. కాళీమాత ఆలయాన్ని అభివృద్ధి చేసినప్పుడు బిజెపి వాళ్లు ఎక్కడికి వెళ్లారు. మేం దుర్గా పూజ, సరస్వతి పూజ నిర్వహించేటప్పుడు ఇక్కడ చేయనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవించాలి. అదే మన సంప్రదాయం. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. కానీ గోడీ మీడియా మాత్రం అవేవీ పట్టించుకోకుండా బంగాల్‌కు వ్యతిరేకంగా, నా గురించి మాట్లాడుతున్నాయి. ఏమైనా చెప్పాలనుకుంటే నాకు ఎదురుగా వచ్చి మాట్లాడండి. ఫేక్ న్యూస్ పబ్లిష్ చేయకండి. మమతా బెనర్జీ, బంగాల్ ముఖ్యమంత్రి వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన అల్లర్ల కారణంగా మరణించిన కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. హింస జరగటానికి బీఎస్ఎఫ్‌లోని ఓ వర్గం, కేంద్ర హోంశాఖ పరిధిలోని ఏజెన్సీల పాత్ర ఉందని దుయ్యబట్టారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. అమిత్ షా సారథ్యంలోని హోంశాఖను నియంత్రించాలని కోరారు. రాజకీయ అజెండా కోసం అమిత్ షా దేశానికి హాని చేస్తున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు.

## రాజకీయ కుట్రలతోనే సోనియా, రాహుల్ పేర్లు

### ఇడి ఛార్జిషీటుపై ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** బిజెపి సారథ్యంలోని నిరంకుశ కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే తమ పార్టీని, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మోడీ సర్కారు తన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే, నేషనల్ హెరాల్డ్ కేసును తెరపైకి తెస్తోందని విమర్శించారు. వీటన్నింటికి కాంగ్రెస్ పార్టీ బెదిరే ప్రసక్తే ఉండదని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తెస్తూనే ఉంటామని ఖర్గే పేర్కొన్నారు. స్పష్టమైన విజన్ లేకుండా దేశ సమస్యలకు పరిష్కారాలను చూపించలేని పరిస్థితుల్లో మోడీ సర్కారు ఉంది. బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ గాడి తప్పింది. అందుకే ప్రజల దృష్టిని మళ్లించే పన్నాగాలను అమలు చేస్తోంది అని ఖర్గే 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బిజెపి సర్కారు వైఫల్యం వల్ల మన దేశ ద్రవ్యలోటు మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. దిగుమతి సుంకాలు, ట్రేడ్ వార్ గురించి ఈ ప్రభుత్వంలో ఆలోచించే నాథుడే లేడు. మాటలే తప్ప చేతలు లేవు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 2024 డిసెంబరు వరకు పెట్రోలు, డీజిల్‌పై వివిధ పన్నుల ద్వారా కేంద్ర సర్కారు రూ.39 లక్షల కోట్లు వసూలు చేసింది. ఎల్‌పిజి ధరలను మరో రూ.50 పెంచారు.

కనీసం ఆర్థిక బలహీనవర్గాలకు రాయితీలు ఇవ్వడం లేదు. గ్రాడ్యుయేషన్ చేసి కూడా నిరుద్యోగులుగా మిగిలిపోతున్న వారు దేశంలో 13 శాతం మంది ఉన్నారు. నిరుద్యోగ రేటు 10.2 శాతానికి చేరుకుంది. దేశంలోని 23 ఐఐటీల్లో 22, 25 ట్రిపుల్ ఐటీల్లో 23 జాబ్ ప్లేస్‌మెంట్లలో డౌన్ అయ్యాయి. నీట్స్‌లోనూ ప్లేస్‌మెంట్స్ 11 శాతం తగ్గాయి. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఉదయం దిల్లీలోని అక్బర్‌రోడ్‌లో ఉన్న ఎఐసిసి కార్యాలయం వద్ద నిరసనకు దిగారు.

# ఔరంగజేబు సమాధికి రక్షణ కల్పించాలి

## మొఘల్ వారసుడు యాకూబ్ హబీబుద్దీన్ డిమాండ్

**ముంబయి, ఏప్రిల్ 16:** మహారాష్ట్రలోని శాంభాజీ నగర్ జిల్లాలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆ సమాధిని తొలగించాలని ఇటీవల ఆ రాష్ట్రంలో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్నాయి. నాగపూర్‌లో భీకర స్థాయిలో విధ్వంసం జరిగింది. ఈ నేపథ్యంలో మొఘల్ సామ్రాజ్య చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్ వారసుడు యాకూబ్ హబీబుద్దిన్ ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెర్రెస్‌కు లేఖ రాశారు. వక్ఫ్ ఆస్తులకు కేర్‌టేకర్‌గాఉన్న ముతావలి ప్రిన్స్ యాకూబ్ తన లేఖలో ఔరంగజేబు సమాధికి రక్షణ కల్పించాలనికోరారు. వాస్తవానికి ఆ సమాధిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన కట్టడంగా ప్రకటించారని, ప్రస్తుతం పురావస్తుశాఖ ఆధీనంలో ఆ సమాధి ఉన్నట్లు చెప్పారు. అయితే 1958 నాటి ప్రాచీన కట్టడాలు, ఆర్కియాలజీ సైట్ల పరిక్షణ చట్టం ప్రకారం ఔరంగజేబు సమాధివద్ద ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని డిమాండ్ చేశారు. తవ్వడం, కూల్చడం, మార్పులు కూడా చేయకూడదన్నారు.

## సైన్‌బోర్డులకు 'ఉర్దూ' వినియోగాన్ని
# సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ:** సైన్‌బోర్డులకు ఉర్దూ భాషను వాడడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. మహారాష్ట్రలోని ఓ మున్సిపల్ కౌన్సిల్‌కు ఉర్దూ భాషలో రాసిన సైన్ బోర్డు ఉండడాన్ని కోర్టు అంగీకరించింది. జస్టిస్ సుధాన్షు దూలియా, కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. ఉర్దూ, మరాఠీ భాషకు రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన హోదా ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. కేవలం మరాఠీ మాత్రమే వాడాలన్న వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వర్షతై సంజయ్ బగడే అనే వ్యక్తి దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. పాటూరు పట్టణంలో ఆయన మాజీ కౌన్సిలర్.

పాటూరు మున్సిపల్ కౌన్సిల్ నేమ్‌బోర్డును ఉర్దూలో రాయడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. ఉర్దూ భాష పుట్టింది ఇండియాలోనే అని, కానీ ఆ భాష ముస్లింలకు సొంతమైందని కోర్టు పేర్కొన్నది. హిందువులకు హిందీ భాషను, ముస్లింలకు ఉర్దూ భాషను బ్రిటీష్ పాలకులు అంటగట్టారని కోర్టు తెలిపింది. అయితే ఉర్దూ భాష గురించి చర్చించే సందర్భం ఇది కాదు అని, కానీ హిందీ, ఉర్దూ భాషలు మిక్స్ అయ్యాయని, హిందీ భాషఎక్కువ శాతం సంస్కృత భాషగా.. ఉర్దూ భాష పర్షియన్ భాషగా గుర్తింపు తెచ్చుకున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కానీ బ్రిటీష్ పాలకులు మతం ఆధారంగా రెండు భాషలను విభజించినట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఇప్పుడు హిందీ భాషను హిందువుల భాషగా, ఉర్దూ భాషను ముస్లింల భాషగా అర్థం చేసుకుంటున్నారని కోర్టు తెలిపింది. చాలా దయనీయమైన పరిస్థితి ఎదురైందని, వాస్తవానికి ఐకమత్యం నుంచి విభజన ఏర్పడిందని కోర్టు పేర్కొన్నది. ఉర్దూ భాషకు ఇండియాలో ఆనవాళ్లుఉన్నాయని, ఒక మతానికి ఆ భాషను ఆపాదించలేమని కోర్టు తెలిపింది.

ఉర్దూ భాషను ఓ ఏలియన్‌గా భారతీయులు చూస్తున్నారని, కానీ ఇది నిజం కాదు అని, మరాఠీ.. హిందీ భాషల తరహాలోనే ఉర్దూ భాష కూడా ఇండోఆర్యన్ లాంగ్వేజే అని కోర్టు తెలిపింది. ఉర్దూ భాష ఈ నేలపైనే పుట్టినట్లు కోర్టు చెప్పింది. ఆ భాష ఇక్కడే అభివృద్ధి చెంది, వర్ధిల్లినట్లు కోర్టు పేర్కొన్నది. శతాబ్ధాల నుంచి ఆ భాష మరింత పదునెక్కిందని, ఎంతో మంది కవులకు చాలా ఇష్టమైన భాషగా మారినట్లు కోర్టు వెల్లడించింది.

మహారాష్ట్ర లోకల్ అథారిటీ లాంగ్వేజ్ యాక్టు 2022 ప్రకారం ఉర్దూ భాషను వాడరాదు అని పిటీషనర్ కోర్టులో వాదించారు. కానీ ఆ చట్టం ప్రకారం ఉర్దూను నిషేధిత భాషగా చూడలేమని సుప్రీంకోర్టు చెప్పింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ ప్రకారం మరాఠీ, ఉర్దూ భాషలు ఒక్కటే అని కోర్టు పేర్కొన్నది.

# ప్రియుడికోసం భర్తను హత్యచేసిన యూట్యూబర్

**భివాండి, ఏప్రిల్ 14:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రియుడితో కలిసి భర్తను చంపిన ఘటన మరువకముందే హరియాణాలో మళ్లీ అలాంటి దారుణమే జరిగింది. రవీనా అనే మహిళ తన ప్రియుడుతో కలిసి భర్తను అతి కిరాతకంగా హత్య చేసింది. ఈ కేసులో నిందితులిద్దర్ని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భివానీకి చెందిన ప్రవీణ్, రేవాడిలోని జూడి గ్రామస్థురాలైన రవీనాకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు ముకుల్ ఉన్నాడు. రవీనా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 34 వేలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అందులో వీడియోలు పోస్టు చేస్తుండేది. యూట్యూబ్‌లోనూ షార్ట్స్ అప్లోడ్ చేసేది. రవీనాకు ఇన్‌స్టా అంటే చాలా ఇష్టం. అందులో వీడియోలు చేసేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించినప్పటికీ, ఆమె తగ్గేది కాదు. ఇదే విషయంపై పలుమార్లు భర్తతో గొడవ పడేది. సోషల్ మీడియాపై ఇష్టంతో ఉన్న రవీనాకు హిసార్‌లోని ప్రేమ్ నగర్ నివాసి అయిన యూట్యూబర్ సురేశ్ ఏడాదిన్నర క్రితం పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి షార్ట్ వీడియోస్ చేసేవారు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది.

రవీనా భర్తకు వీరి ప్రవర్తనపై అనుమానం కలిగింది. ఈ క్రమంలోనే మార్చి 25న సురేశ్, రవీనాను కలిసిఉండటంచూశాడు ప్రవీణ్. దీంతో రవీనాతో ప్రవీణ్ గొడవకు దిగాడు. వెంటనే తన ప్రియుడు సురేశ్‌తో కలిసి మంచం కింద ఉన్న దుప్పటితో ప్రవీణ్ గొంతును నులిమేసింది రవీనా. ప్రవీణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ప్రవీణ్ గురించి అడిగినప్పుడు ఆమె ఏమీ తెలియదన్నట్లు నటించింది. ఆరోజు రాత్రి అందరూ నిద్రలోకి జారుకున్న తర్వాత అర్ధరాత్రి 2:30 గంటలకు భర్త మృతదేహాన్ని ప్రియుడితో కలిసి బైక్ పై తీసుకెళ్లి 6కి.మీ దూరంలో ఉన్న దిన్నోడ్ కాలువ వద్ద పడేసింది.

### కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

మార్చి 28న పోలీసులు దిన్నోడ్ రోడ్డులోని కాలువ వద్ద కుళ్లిన స్థితిలో ప్రవీణ్ మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ ఇంటి సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. హెల్మెట్ ధరించిన అనుమానితుడికి చెందిన బైక్ ప్రవీణ్ ఇంటి సమీపంలో కనిపించింది.

రవీనా కూడా బైక్ వెనుక కూర్చుని ముఖం మీద గుడ్డ కప్పుకుని ఉంది. ప్రవీణ్ మృతదేహం మధ్యలో ఉంది. అర్ధరాత్రి హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తి ప్రవీణ్ ఇంటికి తిరిగొచ్చాడు. అతడి బైక్‌పై ఓమహిళ మాత్రమే ఉంది. మధ్యలో ఎవరూ లేరు.

ఈ నేపథ్యంలో రవీనా, ఆమె లవర్ సురేశ్‌ను తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. తామిద్దరే ప్రవీణ్‌ను హత్య చేశామని పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దర్ని జైలుకు పంపారు.

17-4Pg6exHMNWJQE.qxd:17-4Pg6exHMNWJQE.qxd 01/01/01 9:45 AM Page 1



# బుద్ధి మాంద్యం పిల్లలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆత్మీయ పలకరింపు



## - కదిరి ఆర్డీటి ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించిన పరిటాల సునీత
## - పిల్లల విషయంలో సిబ్బంది చొరవపై ప్రశంసలు

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో** బుద్ధి మాంద్యం, మెదడు పక్షవాతానికి గురైన పిల్లల విషయంలో ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తిరుపతి నుంచి తిరుగు ప్రయాణంలో భాగంగా ఆమె కదిరి సమీపంలోని ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడున్న బుద్ధి మాంద్యం, మెదడు పక్షవాతాని గురైన పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి. సిబ్బంది ఎంత మంది ఉన్నారు. వారికి ఎలాంటి సేవలందు తున్నాయి. వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. అలాగే అక్కడి పిల్లలతో మమేకమవుతూ చాలా సేపు ఆ కేంద్రంలో గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. మనకు శరీరంలో ఏ అవయం లేకపోయినా జీవించవచ్చు కానీ.. మెదడు పని చేయకపోతే కచ్చితంగా మరొకరి సహాయం అవసరముంటుందన్నారు. కనీసం వారి పనులు వారు కూడా చేసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. బుద్ధిమాంద్యం పిల్లలైతే కనీసం స్వియ కార్యక్రమాలు చేసుకోగలుగుతారు కానీ.. మెదడు పక్షవాతానికి గురైన వారికి కచ్చితంగా ఇంకొకరి సాయం కావాలన్నారు. ఇలాంటి ఎంతో మంది పిల్లల్ని ఆర్డీటీ చేరదీసి..

వారి సంరక్షణ చూసుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆర్డీటీ సంస్థకు ఏమిచ్చినా ఈ రుణం మాత్రం తీర్చుకోలేమన్నారు. ఇక్కడి సిబ్బంది కూడా పిల్లల విషయంలో తీసుకుంటున్న శ్రద్ధ, ఓపికను అభినందించాల్సిందేనని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌తో రూ.5 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

## - బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురి అరెస్టు - ఎస్పీ మణికంఠ చందోలు

**చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన చిత్తూరు సంతపేట దొంగలబావివీధికి చెందిన రాజా(26) 5 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో చిత్తూరు సంతపేట పరిసరాల్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు టుటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుండి 48 వేల రూపాయలు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లపై టుటౌన్ పోలీసులు పట్టుబడ్డ నిందితులను విచారిస్తే ఇందులో సంతపేట దొంగలబావి వీధికి చెందిన ఆటోడ్రైవర్ రాజా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా 5 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడని తేలింది. ఈ విషయంపై ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన రాజాను పోలీసులు విచారిస్తే ఇతను డఫబెట్ స్పోర్ట్స్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా నష్టపోయిన ఘటన వెలుగు చూసిందన్నారు. గత కొన్ని రోజుల క్రితం రాజా డఫబెట్ స్పోర్ట్స్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో ఖాతా ప్రారంభించి చిన్న మొత్తాలను బెట్టింగ్‌కు పెట్టాడన్నాడు. కొన్ని సందర్భాల్లో రాజాకు కొద్ది లాభాలు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో వచ్చిన చిన్న లాభాలకు ఆశపడిన రాజా ఎక్కువ మొత్తాలు పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించాలని ఆశపడి తన భార్య బంగారు నగలను సైతం బ్యాంకులో తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా అతనికి తెలిసిన స్నేహితుల నుండి లక్ష రూపాయల వరకు అప్పు చేసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడన్నారు. రాజా గత వారం రోజులుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.5 నుండి రూ.6 లక్షలు నష్టపోయాడని వివరించారు. ఈ విషయంపై ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయాజాలం మాత్రమేనని, ప్రజల కష్టార్జిత సంపదను మోసం చేసేలా ఈ బెట్టింగ్ యాప్‌లు తయారు అయ్యాయన్నారు. ఈ యాప్‌లు చట్టవిరుద్ధమైనవని, ఇలాంటి యాప్‌ల ద్వారా ఎవ్వరు బెట్టంగ్‌కు పాల్పడకూడదని హెచ్చరించారు.

బెట్టింగ్ ద్వారా సంపాదన సాధ్యపడదని, ఇది ఒక అక్రమ కార్యకలాపం మాత్రమేనని, అత్యధిక యుదత ఎటువైపు వెళ్ళాలో తెలియకుండా బెట్టింగ్ ప్రపంచంలో అప్పులు ఊబిలో చిక్కుకొంటున్నారన్నారు. ఈ బెట్టింగ్‌ల వల్ల ఆత్మహత్యలు, కుటుంబ విబేధాలు, నేర ప్రవృత్తి పెరుగుతున్నాయన్నారు. 2024 అక్టోబర్ నెలలో జిడినెల్లూరు మండలానికి చెందిన దినేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస అయ్యాడని, పెద్ద మొత్తంలో అప్పులు చేసి కుటుంబ ఆస్తిని తాకట్టు పెట్టాడన్నారు. చివరికి ఆర్థిక ఒత్తిడికి గురై తల్లి, తండ్రి, అక్కతో కలిసి అందరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

# చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యం

**ఏప్రిల్ 16:** ఏప్రిల్ 30వ తేదీన జరిగే శ్రీ వరాహ లక్ష్మీ ్మ నరసింహ స్వామి చందనోత్సవ వేడుకలో సాధారణ భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, దానికి తగ్గట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చిన్నపాటి తప్పిదం కూడా జరగకుండా సమష్టి కృషి చేసి వేడుకను విజయవంతం చేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. సింహాచలం పాతగోశాల వద్ద నూతనంగా నిర్మించిన దేవాదాయ కల్యాణ మండపం సముదాయంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సహచర మంత్రులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం సంబంధిత వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు.30వ తేదీ తెల్లవారు ఝాము 3.00 గంటల నుంచే దర్శనాలుచందనోత్సవం రోజు తెల్లవారు ఝాము 3.00 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయని దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి ప్రకటించారు. 1.00 గంటకు సుప్రభాత సేవతో పూజా క్రతువులు మొదలవుతాయని, 3.00 గంటలకు ఆలయ వ్యవస్థాప ధర్మకర్త తొలి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. 3.30 నుంచి 4.00 గంటల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే వారు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. 4.15 నుంచి 4.30 గంటల లోపు మొదటి స్లాట్ వీఐపీ దర్శనాలు మొదలవుతాయని వివరించారు. 4.00 గంటల నుంచి రూ.1,000 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. వీఐపీ టిక్కెట్లు 2500 వరకు మాత్రమే ఇస్తున్నామని, ప్రొటోకాల్ దర్శనాల్లో భాగంగా ఒక పాస్ పై సంబంధిత కుటుంబ సభ్యులను ఆరుగురి వరకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. రూ.1500 టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులు భోగమండపం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. అంతరాలయ దర్శనాలు ఉండబోవని స్పష్టం చేశారు. సంప్రదాయం ప్రకారం 29వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు సాధారణ దర్శనాలు నిలిపివేస్తామని, చందనోత్సవం రోజు తెల్లవారు ఝాము 1.00 గంట నుంచి ఇతర ప్రక్రియలు, దర్శనాలు మొదలవుతాయని మంత్రి వివరించారు. 30వ తేదీ ఉదయం 3.00 నుంచి రాత్రి 7.00 గంటల వరకు దర్శనాలు ఉంటాయని, 7.00 గంటల సమయం కంటే ముందుగా క్యూలైన్లలో ఉన్నవారికి ఎంత టైమ్ అయినా దర్శనాలు చేయిస్తామని తెలిపారు. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేశామని మంత్రి వివరించారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదంచందనోత్సవం రోజు దర్శనాలకు వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి పేర్కొన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు ఏర్పాట్లు చేయాలని, చిన్న పిల్లలకు పాలు సమకూర్చాలని సూచించినట్లు చెప్పారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో సంతృప్తికర స్థాయిలో దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దేవాదాయ, రెవెన్యూ, హోం శాఖ అధికారులు శ్రద్ధ వహించి వేడుకలను విజయవంతం చేసేందుకు కంకణం కట్టుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా భావించిందని, ఆ మేరకు చర్యలు తీసుకుందని, అందులో భాగంగానే మంత్రుల బృందాన్ని పంపించిందని గుర్తు చేశారు. అనుభవం కలిగిన అధికారులను నియమిస్తామని చెప్పారు.

# గవర్నర్‌ను కలుసుకున్న రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి శంకర రావు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి శంకర రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్‌టి కమిషన్ 2023-24 వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కమిషన్ షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతి కొరకు నిరంతరం పాటుపడుతుందని తెలిపారు.వారి సంక్షేమం కొరకు అవసరమైన ప్రాంతాల్లో పర్యటనలు జరిపి ఆయా ప్రాంతాలలోని అధికారులకు అవసరమైన మేరకు సూచనలు ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి కమిషన్ ఈ క్రింది విషయాలపై ప్రభుత్వానికి సూచనలు చేయడం జరిగిందని చెప్పారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు నంబరు (3) ను రద్దు చేయటం ద్వారా ప్రభావితమయ్యే షెడ్యూల్డ్ తెగల సామాజిక ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయటానికి ఒక సర్వే నిర్వహించాలని కోరారు. పెరుగుతున్న విద్యా సదుపాయాలు వలన షెడ్యూల్డ్ తెగలలో విద్యాధికులు అధికమవటమే కాకుండా నిరుద్యోగిత కూడా పెరుగుతోంది అందువలన బ్యాక్ లాగ్ పోస్టులు అన్నీ సత్వరమే గుర్తించి భర్తీ చేయాలని సూచించామని తెలిపారు. వీటికి అనుబంధం గా వృత్తి నైపుణ్యకేంద్రాలు ఏర్పాటు కూడా యువత అభివృద్ధికి దోహదాపుతుందని తెలుపుతూ సాంకేతిక విద్యార్హతలను పొందిన షెడ్యూల్డ్ తెగల యువత కేవలం ఉద్యోగాల పైనే ఆధార పడకుండా ఎంటర్ ప్రన్యూర్స్ గా ముందుకు రావాలని అటువంటి ఔత్సాహిక యువతకు పారిశ్రామిక రాయితీలు కలిపించి ప్రోత్సహించాలని సూచించామన్నారు. పారిశ్రామిక పార్క్‌లను నందు కూడా నిర్ణీత కోటా ప్రకారం స్థలాలు కేటాయించాలని కోరామన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

**నెల్లూరు క్రైమ్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త : చిన్న** వివాదంతో క్షణికావేసానికి గురైన ఇద్దరు వ్యక్తులు మరొక వ్యక్తిని దారుణ హత్య చేసిన ఘటన బుధవారం రాత్రి నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్ కు చెందిన సుల్తాన్ (38), మద్యం తాగే సమయంలో అదే ప్రాంతానికి చెందిన కలీం, నాగరాజులతో ఘర్షణ ఏర్పడింది.

# వికసిత్ భారత్ సాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకం

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామీణ ఆంధ్రప్రదేశ్ బలోపేతం దేశానికి అవసరమని ఏపీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు పవన్ కళ్యాణ్ అన్నారువికసిత్ భారత్ అనే మహా లక్ష్యంతో గ్రామీణాంధ్ర ప్రదేశ్ కీలకమన్నారు.. పంచాయతీల స్వయం ప్రతిపత్తి సాధన గమ్యంగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు వెళ్తోంద్మని స్పష్టం చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతంలో ఆర్థిక సంఘం సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పర్యావరణహితంగా, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఆర్థిక సంఘం సహాయ సహకారాలతో పని చేస్తామన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తామంతా కంకణబద్ధులై ఉన్నట్టు తెలిపారు.

# చైన్ స్నాచర్ల ముఠాల పట్టివేత




స్వాధీనం చేసుకున్న బంగారు నగలతో జిల్లా పోలీసు అధికారులు

## - నలుగురు అంతర్ జిల్లా చైన్ స్నాచర్ల ను అరెస్ట్ చేసిన అనంతపురము పోలీసులు
## - 32.40 లక్షల విలువచేసే 36 తులాల బంగారు నగలు, మూడు బైకులు స్వాధీనం

**అనంతపురం, ఏప్రిల్ 16, (ప్రభాత వార్త బ్యూరో)** అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్ ఆదేశాల మేరకు చైన్ స్నాచింగ్ నేరాలకు అనంతపురం పోలీసులు చెక్ పెట్టారు. 32.4 లక్షలు విలువ చేసే 36 తులాల బంగారు నగలను, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశం మేరకు పోలీస్ అధికారులు , సిబ్బంది బృందాలు బృందాలుగా ఏర్పడి చైన్ స్నాచర్స్ ముఠాలను చర్యల గుట్టు రట్టు చేశారు . బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి చైన్ స్నాచర్ల ముఠా అరెస్టు, తదితర వివరాలను జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ వెల్లడించారు.అరెస్ట్ అయిన నింధితుల వివరాలు ,, తదితర పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ ఇలా వివరించారు.(1) అనంతపురంలోని రాజీవ్ కాలనీ చెందిన కె.పంపాచారి నరేశ్, ఒక కార్పెంటర్ తో పాటు డ్రైవింగ్ పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ లకు అలవాటు పడి సంపాదన అంతా ఈ వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. కుటుంబ పోషణ, తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. (2) అనంతపురంలోని రాయల్ నగర్ కు చెందిన షేక్ షాకీర్,ఒక కార్పెంటర్ . ఈ వృత్తితో పాటు ప్రస్తుతం ఇతను స్థానిక రాయల్ నగర్ లో ఫర్నీచర్ షాప్ పెట్టుకొని సొంతంగా పని చేసుకుంటున్నాడు. వ్యాపారము సరిగా జరగలేదని అప్పులు ఎక్కువ అయ్యాయి. వీటిని తీర్చుకోవడానికి కె.పంపాచారితో కలిసి ఇద్దరు చైన్ స్నాచింగ్ లకు పాల్పడ్డారు. (3) శ్రీ సత్య సాయి జిల్లా నల్లమడ మండలం కేంద్రంకు చెందిన కంబం నాగార్జున చిన్న బతుకు తెరువు కోసం కుటుంబం సహా ఏడాదిన్నర కిందట అనంతపురం చేరాడు. డ్రైవరు గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు . నాలుగు నెలల కిందట కె.పంపాచారి నరేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ స్నేహితులుగా మారి

...ఇద్దరు కలిసి పేకాట , ఆన్లైన్ జూదము ఆడేవారు . ఈ వ్యసనాలలో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలు అయ్యాడు . వీటిని తీర్చుకునే క్రమములో చైన్ స్నాచింగ్ ల బాట పట్టాడు..(4) అనంతపురం నగరంలోని ప్రియాంక నగర్ చెందిన షేక్ ఫజిల్ అహ్మద్ షేక్ ఫజిజ్ అహ్మద్, ఇతను ప్రైవేట్ డ్రైవర్ గా పనిచేసేవాడు. ఆన్లైన్ బెట్టింగ్లు, తదితర వ్యసనాలకు అలవాటు పడి అప్పులపాలయ్యాడు . అప్పు ఇచ్చిన వారినుండి చెల్లించమని వత్తిడి తీవ్రం కావడము ... తనకు పెళ్లి ఖరారు అయి, పెండ్లి ఖర్చులకు అవసరమైన డబ్బులు లేకపోవడము వలన ఎలాగైనా సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. చైన్ స్నాచింగ్ల బాట పట్టాడు . ప్రస్తుతం అరెస్టయిన నలుగురిలో కె.పంపాచారి నరేశ్ ముఖ్యుడు. తనకున్న అప్పులను తీర్చుకోవాలని భావించి సులువుగా డబ్బు సంపాదించాలని ఆలోచించి చైన్ స్నాచింగులు చేయాలనుకున్నాడు. తనతో పాటు అప్పులతో సతమతం అవుతున్న తన స్నేహితులైన షేక్ షాకీర్, కంబం నాగార్జున, చిన్నలను కలుపుకున్నాడు. మొత్తం మూడు ముఠాలుగా ఏర్పాటు చేసుకున్నాడు. తనొక్కడే ఒక ముఠాగా...తను, షేక్ షాకీర్ రెండవ ముఠాగా... తను, కంబం నాగార్జున, చిన్న కలిసి మూడవ ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగులకు ఒడిగట్టాడు. ఒకరికి తెలియకుండా మరొకర్ని చేర్చుకుని మిగితా ఇద్దరితో కలిసి చైన్ స్నాచింగులు చేశాడు. షేక్ ఫజిల్ అహ్మద్ షేక్ ఫజిజ్ మాత్రం ఒక్కడే స్నాచింగులు చేశాడు. ....ఒంటరిగా వెళ్లే మహిళలే టార్గెట్ చేసినా చైన్ స్నాచింగ్ ముఠాలు... ఒంటరిగా వెళ్లే మహిళల్ని టార్గెట్ చేసి కె.పంపాచారి నరేశ్ ఒక్కడే చైన్ స్నాచింగులకు పాల్పడ్డాడు. టూవీలర్ పై ఇతనొక్కడే వెళ్లి శివారు కాలనీలు/ప్రాంతాలలో ఒంటరిగా వెళ్తున్న మహిళలు మెడలో ధరించిన బంగారు నగలును లాక్కొని అదే టూవీలర్ పై పరారు కావడం అలవాటుగా చేసుకున్నాడు. ఇలా... 2023 సంవత్సరం నుండీ కురుగుంట, మన్నీల, రాప్తాడు, కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్ నగర్, లలితానగర్ , ఒకటో రోడ్డు, తదితర ప్రాంతాలలో ఇతనొక్కడే 10 చైన్ స్నాచింగులు చేశాడు. రెండవ ముఠాగా షేక్ షాకీర్ తో కలిసి బైకుపై వెళ్లి కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్ లలో 02 స్నాచింగులు... కంబం నాగార్జునతో కలిసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బి.కె.సముద్రం చెరువు, బి.కొత్తపల్లి గ్రామాలలో 04 స్నాచింగులు చేశారు. మొత్తం 16 కేసుల్లో కె.పంపాచారి నరేశ్ నిందితుడు కాగా... ఈ 16 కేసుల్లోనే 02 కేసుల్లో షేక్ షాకీర్ , 04 కేసుల్లో కంబం నాగార్జున నిందితుడిగా ఉన్నారు. ఈ ముగ్గురు కూడా 2023 నుండీ స్నాచింగు నేరాలకు పాల్పడ్డారు.

# ఆంధ్రప్రదేశ్ ఐటిరంగంలో గేమ్ ఛేంజర్ టిసిఎస్!

## - మంత్రి నారా లోకేష్ కృషితో ఐటి హబ్‌గా విశాఖ

**గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత ఐటి దిగ్గజం టిసిఎస్ కు విశాఖలో 21.16 ఎకరాలను 99పైసలకు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ఎన్నికల హామీని నెరవేర్చేందుకు చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష ్యంతో మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మంత్రి లోకేష్ గతఏడాది అక్టోబర్ లో ముంబయ్ లోని టిసిఎస్ హౌస్ ను సందర్శించి తమ రాష్ట్రంలో డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కు విజ్ఞప్తిచేశారు. ఆ తర్వాత టిసిఎస్ ప్రతినిధులతో నిరంతర చర్చలు సాగించి చివరకు విజయం సాధించారు. విశాఖలో టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ కోసం ఆ సంస్థ రూ.1370 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీనిద్వారా యువతకు 12వేల ఐటి ఉద్యోగాలు లభించనున్నాయి. ఐటి ఇన్వెస్టిమెంట్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ గా దృష్టి సారించదనడానికి ఇదొక ఉదాహరణ.విశాఖ నగరాన్ని ఐటి హబ్ గా మార్చడానికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిలో టిసిఎస్ గేమ్ ఛేంజర్ కాబోతోంది. ఆంధ్రప్రదేశ్ ఐటీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. విశాఖలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో ఐటి హిల్స్ నుంచి పారిపోయిన కంపెనీలన్నీ ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయి. రాష్ట్ర ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్ గా మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చుతున్నాయి.

# నకిలీ వైద్యుడిని కనిపెట్టిన రాష్ట్ర వైద్యమండలి

విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి: మధ్యప్రదేశ్‌కు చెందిన నకిలీ వైద్యుడి లీలలకు ఏపీ వైద్యమండలి(మెడికల్‌కౌన్సిల్) చెక్ పెట్టింది.ఎటువంటి విద్యార్హతలు లేకుండాపూ మధ్యప్రదేశ్ మెడికల్‌కౌన్సిల్‌లో కార్డియాలజిస్‌గా నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ నమోదయ్యాడు. అంతటితో ఆగకుండా సంబంధిత వైద్యానికి సంబంధించి ఏడుగురి ప్రాణాలు బలిగొనడానికి కారణమయ్యాడు.. ఏపీలో కుడా తన ప్రతాపం చూపాలనుకున్న యాదవ్‌కు కౌన్సిల్ గట్టి దెబ్బకొట్టింది.నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అనే వ్యక్తి డాక్టర్ ఎన్.జాన్ కెమ్ పేరుతో బ్రిటిష్ వైద్యుడినంటూ నకిలీ పత్రాలు సృష్టించాడు. మధ్యప్రదేశ్‌లోనూ దమోహ్ పట్టణంలో ఓ ప్రైవేట్ మిషనరీ ఆసుపత్రిలో డాక్టర్‌గా చేరాడు. ఆయన చేసిన శస్త్రచికిత్సలు విఫలమై ఏడుగురు చనిపోయారు. పోలీసులు కేసు పెట్టి, ఇటీవల నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌తోనూ అతని వ్యవహారాలు వెలుగు చూసాయి.తన రిజిస్ట్రేషన్‌ను కేరళకు మార్చుకునేందుకు ఎన్వోసీ ఇవ్వాలంటూ డాక్టర్ ఎన్.జాన్ కెమ్ పేరిట గతేడాది నవంబర్‌లో ఏపీ వైద్య మండలి కార్యాలయానికి మెయిల్ వచ్చింది. అందులో పేర్కొన్న వివరాలేవీ కార్యాలయంలో లేవు. దీంతో తగిన ఆధారాలతో నేరుగా రావాలంటూ కౌన్సిల్ అధికారులు ప్రత్యుత్తరమిచ్చారు. ఆ తర్వాత జాన్ కెమ్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదని కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ.రమేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో అతను నకిలీ వైద్యుడిగా బయటపడింది. తాజాగా జాతీయ వైద్య కమిషన్ కార్యదర్శి నుంచి ఏపీఎంసీకి ఓ లేఖ వచ్చింది. నిందితుడు పేర్కొన్న రిజిస్ట్రేషన్ నంబరును ప్రస్తావిస్తూ పూర్తి వివరాలు పంపాలని కోరింది.. జాన్ కెమ్ పేరిట గతేడాది ఎన్వోసీ కోసం మెయిల్ చేసిన లేఖలోని వివరాలే ఎన్ఎంసీ నుంచి వచ్చిన లేఖలోనూ ఉన్నాయి. తన పేరు నరేంద్ర జాన్ కెమ్ అని 2006 ఆగస్టులో ఎంబీబీఎస్ అర్హతతో ఏపీఎంసీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిందితుడు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కింద దొంగ నంబరు సృష్టించాడు. దీన్ని బట్టి ఏపీఎంసీలో రిజిస్ట్రేషన్ చేయించుకోకున్నా, తప్పుడు సమాచారంతో మెయిల్ పెట్టినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే అతని ఆటకట్టించారు.

# రాజధాని అమరావతిలో రు.4688 కోట్లతో ఐదు టవర్ల నిర్మాణం

## టెండర్లు ఆహ్వానించిన సి ఆర్ డి ఏ

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 16 ప్రభాతవా ర్త** రాష్ట్ర రాజధాని అమరావతికి తలమాణికం కానున్న ఐదు టవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు బుధవారం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర సచివాలయం నిర్మాణంలో భాగంగా ఈ ఐదు టవర్లను నిర్మించేందుకు బుధవారం సి ఆర్ డి ఏ 4688.63 కోట్ల వ్యయంతో టెండర్లను పిలిచింది. హెచ్ ఓ డి ల కోసం జిఏడి టవర్ నిర్మాణానికి 1126.51 కోట్లతోటెండర్ పిలిచారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు హెచ్వోడీల కోసం మరో రెండు టవర్లను నిర్మించనున్నారు. ఈ 1,2 టవర్ల నిర్మాణానికి 1897.86 కోటతో టెండర్లు ఇక 3,4 టవర్లను 1664.45 కోటతో నిర్మించనున్నారు. ఈ ఐదు టవర్లు రాష్ట్ర సచివాలయానికి హైలెట్ గా నిలుస్తాయి. అమరావతి ప్రతిభ మించేలా ఈ 5 టవర్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్థల సాయంతో ఇప్పటికే ఆకృతులను రూపొందించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, మెజారిటీ ప్రజల ఆకాంక్ష మెరికే ఈ 5 టవర్లను ఖరారు చేశారు. టెండర్లో పాల్గొనేందుకు మే 1 తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున ఫైనాన్షియల్ ,టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేస్తారు. ఈ టవర్ల నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్ మొత్తం మూడేళ్ల పాటు ఏమాత్రం దెబ్బతిన్న గుత్తి దారే నిర్వహణ చేయాల్సి ఉంటుంది.

# స్త్రీ జనోద్ధరణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందుకూరి

## - మాజీ సిఎం :జగన్

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత,మాజీ సీఎం జగన్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "ఎక్స" వేదికగా ఆయన స్పందిస్తూ స్త్రీ జనోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని జగన్ కొనియాడారు. తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు. సంఘ సంస్కర్తగా సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వీరేశలింగం పంతులు ఆశయాలు ఈ తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు.

# ముత్యాలమ్మ జాతర సంబరాలు ఆకట్టుకున్న పోతురాజు ముగ్గు




**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో జాతర సంబరాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నారు.. ఆదివారం రాత్రి చాటింపులతో ప్రారంభమైన జాతర సంబరాలు బుధవారం ఉదయం నుంచి ముత్యాలమ్మగుడివీధిలో నివాశస్థులు మొక్కలు తీర్చుకొనుటకు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్ళ వద్ద అంబలి ప్రసాదాల్ని పంపిని చేశారు.ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేశారు.విద్యుత్ దీపాలతో కన్నులు మిరుమిట్లు గొల్లునట్లు ముస్తాబులు చేశారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పోతురాజుముగ్గు వేసి చక్కగా కొలువు గంగపెట్టిపూజ, జరిపించారు. అనంతరం రేణుకాదేవి ముగ్గు, కొలువు రాత్రి అమ్మవారికి మహాకుంభనైవేద్యం, అలంకరణ చేపట్టారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఉత్సవాల్ని కన్నుల పండువగా నిర్వహించటంలో ఆలయపర్యవేక్షకులు లక్ష్మయ్య, ఎఇఎ సతీస్ మాలిక్‌లు చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. జాతర సందర్భంగా ముత్యాలమ్మగుడి వీధిని పెండ్లి మండపం నుంచి నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా ముస్తాబు చేసారు. ఓ వైపు అరటి చెట్ల కనువిందు మరోవైపు మామిడి తోరణాలు,వీధంతా పసుపు నీళ్ళతో శుభ్రం చేయటం కనబడింది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ముగ్గులు, అలంకరణలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.



బుధవారం తాళ్ల రాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశ దృశ్యం

## గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

### 25న వేలాది మందితో చలో తాళ్లరాంపూర్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుండి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని, విడిసీలను నిషేధించాలని బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి. రమణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక సంఘాలు డిమాండ్ చేశాయి.

ఈ సమావేశంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, పి .ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, మల్లేశం, దశరథ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.వెంకన్న గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టే విజయకుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధ్య క్షులు జెక్కే వీరస్వామి గౌడ్, జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూర మల్సూరు గౌడ్, జై గౌడసేన రాష్ట్ర అధ్యక్షులు మోర్ల ఏడు కొం డలు గౌడ్, సర్పంచుల ఫోరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రజక వృత్తిదా రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నరేష్ , హైదరాబాద్ కార్యదర్శి మిర్యాల గోపాల్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కొప్పు పద్మ, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## రేపటి నుంచి జిపిఓల విధివిధానాలపై సెమినార్‌లు

### తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేంద్రరావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీఓ) విధులు బాధ్య తలు అనే అంశంపై (జీపీఓ లుగా రావడానికి ఆప్షన్ ఇచ్చిన వీఆర్వోలు, వీఆర్ ఏ లకు) అవగాహన కల్పించేందుకు వీలుగా ఈ నెల 19వ తేదీన ఖమ్మం వేదికగా ఖమ్మం భద్రాద్రి జిల్లాల వీఆర్వో వీఆర్‌ఏలకు ప్రత్యేక సెమినార్ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తరఫు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గరికె ఉపేం ద్రరావు, వి లక్ష్మీ ్మ నరసింహులు,అసోసియేట్ ప్రెసిడెంట్ కారుమూరి చంద్రయ్య, కోశాధికారి కోన బోయిన ప్రసాద్ వివరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ సెమి నార్‌కు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈనెల 18వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాలలో గ్రామరెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈ సెమినార్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు.




బుధవారం ధర్నాచౌక్ వద్ద ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

## కాంట్రాక్టు టీచర్స్‌ని క్రమబద్ధీకరించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్టంలోని 12 యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజేషన్ చేయాలనీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 12 యూనివర్సిటీ ల కాంట్రాక్టు టీచర్స్ మహా ధర్నా బుధవారం డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురామ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్టంలో పన్నెండు వర్సిలలో దాదాపు 1200 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, వీరంతా దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, వీరు చదువుచెప్పిన వారంతా రెగ్యులర్ అయ్యారని, వారంతా ప్రస్తుతం కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్నారని, కాని వీరు మాత్రం రెగ్యులర్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను క్రమ బద్దీకరించాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, తీర్పును అనుసరించి సమానపనికి, సమాన వేతనం విధానాన్ని అనుసరించి రెగ్యులర్ వారికి ప్రస్తుతం రూ.1లక్ష పొందుతున్నారని, కాని కాంట్రాక్ట్ వారికి మాత్రం కేవలం రూ.30వేల లభిస్తోందని, ఇది చాలా అన్యాయమన్నారు. ఎమ్మెల్యే కూనమనేమిని సాంబశివరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థని రద్దుచేసి యూనివర్సిటీలలో ఉన్న కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ బాబుతో మాట్లాడి యునివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని మేనిఫెస్టోలో పెట్టే విధంగా రెగ్యులరైజ్ చేయాలని కోరుతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ యూ నివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయడానికి యూజీసీ నిబంధనలను సడలించే విధంగా బిజెపి ప్రభుత్వాన్ని కోరుతానని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్ట్ టీచర్లను మోసం చేయడం వల్ల ప్రభుత్వం దిగిపోయిందని, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా న్యాయం చేయకపోతే ప్రభుత్వము పడిపోతుం దన్నారు. శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ గత ప్రభుత్వం జేఎల్‌డిఎల్ పాలిటెక్నిక్ కాలేజీలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయడం జరిగిందని, కానీ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయాలనుకునే సమయానికి ప్రభుత్వం దిగిపోయిందని, ఇప్పుదున్న ప్రభుత్వమైన వీళ్ళకి తక్షణమే రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ కో ఆర్డినేటర్ సభ్యులు డాక్టర్ ఎస్. విజయేందర్‌రెడ్డి డాక్టర్ ధర్మతేజ,డాక్టర్ పరుశరామ్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ చిర్రరాజు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సురేష్ నాయక్,డాక్టర్ దత్తహరి, డాక్టర్ నారాయణగుప్తా,డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా భూతకాలం నాటకం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** స్థానిక ఎల్‌విఆర్ అండ్ సన్స్ క్లబ్,రీడింగ్‌రూమ్,కొరిటేపాడు వేదికగా డాక్టర్ మురళీ మోహన్ 52 సంవత్సరాల కళారంగ ప్రస్థానం,గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి వైకే నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ సంయుక్తంగా ఏప్రిల్ 13 నుంచి 16వరకు నిర్వహిస్తున్న నాటకోత్సవాలో భాగంగా బుధవారం సాయం త్రం జరిగిన సభా కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి,కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, పిన్నమనేని మృత్యుంజరావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి వైకే నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల్పంచారు.అనంతరం మృత్యుం జయరావు మాటా ్లడుతూ నాటకరంగ విశేషాలను వివరించారు.అతిధులు,సంస్థల నిర్వాహకులు ప్రముఖ రంగస్థల నటులు మరియు జర్నలిస్ట్ ఫలతోటి జోసఫ్ ని తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా అభినందన సత్కారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర ్భంగా మాట్లాడుతూ డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకరంగానికిచేసిన సేవలుచిరస్మరణీయమన్నారు.ఇలాంటి కార్యక్రమంలో పాలో ్గనటం ఆనందంగా ఉందన్నారు .కార్యక్రమాలను నిర్వహిస్తున్న కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్,లంక లక్ష్మీనారాయణ,బొప్పన నరసింహారావు లు అభినందనీయులన్నారు. అనంతరం మాఢభూషి దివాకరబాబు రచించిన,డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వం వహించిన గోవాడ క్రియేషన్స్,హైదరాబాద్‌వారి భూతకాం నాటకం డాక్టర్ రాధ సగిలి నిర్వహణలో ప్రదర్శితమైంది .కార్యక్రమంలో పాల్గొన్న జి.మల్లికార్జునరావు,డి.తిరుమలేశ్వరరావు..జానీ భాషాల నిర్వహణలో అతిధులను కళాకారులను సత్కరించారు.





# గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్మన్‌గా నటి జయసుధ

### అన్ని కేటగిరీలకు 1,248 నామినేషన్లు అందాయి: ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు

**హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ చైర్మన్‌గా నటి జయసుధ నియమితులయ్యారు. అవార్డుల కోసం అందిన నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని జ్యూరీ చైర్మన్, సభ్యులను ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు కోరారు. జయసుధ అధ్యక్షతన గద్దర్ అవార్డ్స్ జ్యూరీ సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను ఛాలెంజ్ గా తీసుకుని ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుమాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను కోరారు.జ్యూరిలో నిష్ణాతులైన వారిని ప్రభుత్వం నియమించిందన్నారు. 14ఏండ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డ్స్‌ను ఇస్తున్నట్లు తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డ్స్ కు ఇంత స్పందన రాలేదన్నారు.స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను కోరారు.జ్యూరిలో నిష్ణాతులైన వారిని ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. 14 ఏండ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డ్స్ ను ఇస్తున్నట్లు తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డ్స్ కు ఇంత స్పందన రాలేదని చెప్పారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎస్. హరీష్ మాట్లాడుతూ సినీనటి జయసుధ చైర్మన్‌గా 15 మందితో గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరిని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గద్దర్ అవార్డ్స్ కు అన్ని కేటగిరీ లకు కలిపి 1,248 నామినేషన్లు అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ గద్దర్ అవార్డులకు గాను వివిధ క్యాటగిరిల ఎంట్రీలకు గాను వచ్చిన నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ గురించి సభ్యులు చర్చించారు. ఈ పురస్కారాలకు వ్యక్తిగత క్యాటగిరిలో 1172 దరఖాస్తులు, ఫీచర్ ఫిలిం, బాలల చిత్రాలు, డెబిట్ చిత్రాలు, డాక్యుమెంటరీ/ లఘుచిత్రాలు, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర క్యాటగిరిలలో 76 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.



# ఆరు గ్యారంటీల అమలులో నిర్లక్ష్యం

### బిఆర్ఎస్ విజయోత్సవ సభకు భారీగా తరలిరావాలి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ బిజెపి పార్టీలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా బిఆర్ఎస్ కార్యకర్తలతో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరించడం ప్రజలు మోసం చేయడం తప్ప తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్లకు బెదిరింపులు, మోసం చేయడం కొత్త కాదు. తెలంగాణ ఇస్తాని చెప్పి 2004లో మోసం చేసిన కాంగ్రెస్, ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేస్తోంది అన్నారు. ఉచిత బస్సు ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నదనీ, ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇచ్చి బస్సుల సంఖ్య పెంచకపోవడం వల్ల సీట్లు దొరకని పరిస్థితి నెలకొందనీ మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ఇచ్చాం కానీ బంగారం మాత్రం ఇవ్వమని రేవంత్ రెడ్డి అనడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. జగిత్యాలకు నిధులు తీసుకురావడంతో ఎమ్మెల్యే సంజయ్ విఫలం అయ్యారని పేర్కొన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేశామని కేసీఆర్ దీక్షతో తెలంగాణ సాధించుకున్నామన్నారు, మాజీ మంత్రి రాజేశం గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ ప్రజలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. మాజి జెడ్పి చైర్మన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ నూతన రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని కవితక్క నాయకత్వంలో జగిత్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.ఈనెల 27 నిర్వహించే బీఆర్ఎస్ రజతో త్సవ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పేర్కొన్నారు. సమావేశ అనంతరం కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డు సమీపంలో ఈనెల27 జరిగే బి ఆర్ ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్ వేసిన ఎమ్మెల్సీ కవిత .ఈ సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు కొరుగంటి రమణారావు, బాబు రెడ్డి గట్టు సతీష్, వల్లెం మల్లేశం, వెంకటేశ్వరరావు, ఇతర పాల్గొన్నారు.



## సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటి సభ్యునిగా శ్రీనివాసరావు

**పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్తః** దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటి (జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యునిగా పిడుగురాళ్లకు చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, పిడుగురాళ్ల రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయం రైల్వే నిలయం నుంచి డీజీఎం(జి), జెడ్‌ఆర్‌యూసీసీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నాలుగు రాష్ట్రాలలో విస్తీర్ణం కలిగిన దక్షిణ మధ్య రైల్వే జోనల్ పరిధిలోని రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పనకు, రైల్వే స్టేషన్లో ఆగని రైళ్ల నిలుపుదల కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, తన నియామకానికి కృషి చేసిన రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్, తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులకు, రైల్వే ఉన్నతాధికారులకు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో యేళ్లుగా రైల్వే ప్రయాణికుల సౌకర్యాల కోసం కృషి చేస్తున్న శ్రీనివాసరావు నాలుగు రాష్ట్రాల పరిధిలోని రైల్వే ప్రయాణికులకు సేవలందించే నియమితులవడం సంతోషకరమని రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు, పట్టణ ప్రముఖులు, ఉన్నతాధికారులు, రైల్వే ప్రయాణికులు అభినందనలు తెలిపారు.



## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్16:** కంచ గచ్చిబౌలి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను మాజీ మంత్రి హరీష్‌రావుస్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైందని వ్యాఖ్యానించారు.బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు అని చెప్పారు.విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబలించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించిందని చెప్పారు.అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైందని తెలిపారు. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన, నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననంఅని పేర్కొన్నారు. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది.అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించామని చెప్పారు.వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

**మిషన్ భగీరథ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం**

మిషన్ భగీరథ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని. నల్లాల ద్వారా నీళ్ళు సరఫరా చేయడం లేదని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇన్నాళ్లు సాగు నీళ్ల కోసం రైతుల గోస.. ఇప్పుడు తాగు నీళ్ల కోసం ప్రజల ఘోష అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగు నీటిని పారించాలని సూచిస్తున్నామన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు

**పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్తః** పట్టణంలోని కల్లం టౌన్‌షిప్‌లో గల బాలాజీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. గ్యాస్, ఎలక్ట్రికల్ ఫైర్స్ పై అధికారులు కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒకరినొకరు రక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరెడ్డి, పీవీ సుబ్బారావు, ఎస్‌కె బాడ్‌షా, పిచ్చయ్య, వెంకటేశ్వర్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షల విలువ చేసే డ్రగ్స్, వాహనం స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 16 ,ప్రభాతవార్త :** అమెరికా ప్రాం తాల నుంచి ఇండియాకు దిగుమతి బెంగళూరు నుంచి హైదరాబాద్ రవాణా పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.40 లక్షలు. అమెరికాలోని ఫ్లోరిడా,క్యాలీఫ్లోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తోపాటు ఇతర డ్రగ్స్‌ను, విదేశీ మద్యం బాటిళ్లను ఎస్‌టిఎఫ్ బి టీమ్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు.డ్రగ్స్‌తోపాటు స్కోడా కారు గంజాయి, హషీష్ సింథాటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను ఎస్టిఎఫ్ బిటీమ్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టుకున్న డ్రగ్స్‌ను,నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు.కారు, డ్రగ్స్‌విలువ రూ.40 లక్షలుగా ఉంటుందని జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం 2 గంటల ప్రాంతంలో బి టీమ్ ఎస్సై సంధ్యా బృందం ఈ డ్రగ్స్‌ను పట్టుకున్నారని తెలిపారు.కాచిగూడ రైల్వే స్టేషన్ అనుమానంగా ఒక వ్యక్తి 2బెక్, స్కోడా కారులో మరో వ్యక్తి ఓ కుష్‌ను మార్పిడి చేసుకునే సమయంలో ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు.కారులో తనిఖీలు నిర్వహించగా 500 గ్రాముల ఓజీ కుష్‌ఒక కేజీ గంజాయి, 6 గ్రాముల చరస్, 4.38 గ్రాముల హషీష్ సింథాటిక్ డ్రగ్స్‌తోపాటు ఐదు విదేశీ మద్యాం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు ప్రతీష్ బట్, జై సూర్యలను అరెస్టు చేసినట్లు ఖురేషి తెలిపారు.ఖురేషితోపాటు ఎస్‌టిఎఫ్ బి టీమ్ లీడర్ ప్రదీప్‌రావుతోపాటు సిఐ బిక్షామ్‌రెడ్డి,ఎస్‌ఐ బాలరాజులతో ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీతమ్మసాగర్‌కి అడుగడుగునా ఆటంకాలే

- నాడు హైకోర్టులో ఎదురుదెబ్బ
- తొలి ఫేజ్ భూసేకరణే చెల్లదన్న న్యాయస్థానం
- 'పెసా' నిబంధనలు గాలికొదిలారని వ్యాఖ్య
- ప్రభుత్వ ప్రొసీడింగ్ కొట్టివేత
- సీతారామాలిఫ్ట్ మీదా ఈ ప్రభావం
- హైడల్‌పవర్ ఉత్పత్తి కానప్పుడు మనుగడ సాగేదెట్లా



**అశ్వారావుపేట:ప్రభాతవార్త:** సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్-సీతమ్మసాగర్ బహుళార్ధక సాధక ప్రాజెక్ట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గడచిన ఏడెనిమిదేళ్ళుగా మార్మోగుతున్న ప్రతిష్ఠాత్మక సాగు నీటి ప్రాజెక్టులు. గత ప్రభుత్వం వీటికోసం చేసిన ప్రచారం అంతా ఇంతా కాదు. కదిలినా మెదిలినా సిఎం కార్యదర్శి స్మితాసబర్వాల్ హెలికాప్టర్‌కి రెక్కలు తగిలించుకుని సైట్‌లో వాలిపోయేవారు. అధికారుల హడావిడి.,సమీక్షలు.,ఇదంతా చూస్తే., నిజంగా ఈ ప్రాజెక్టులు కూడు పెట్టడం ఖాయమేనేమో అనే అనుమానం కూడా ఒక్కోసారి కలిగేది. కానీ కాలం కరిగి ఆ హంగులన్నీ గాల్లో కలిసినట్లే.,వీటిమీద సగటు పౌరుడు పెట్టుకున్న ఆశలూ ఆవిరైపోతున్నాయి. ఈ నిర్మాణాల విషయంలో ఇరిగేషన్ అనుసరించిన క్షమించరాని నిర్లక్ష్యాన్ని చూస్తున్నప్పుడు వీటి భవిష్యత్తు మీద భయం పట్టుకుంటున్నది. ఈరెంటికీ కలిపి ఏకంగా రూ.16వేల510 కోట్ల గ్రాంటు (పూర్వపు ఇందిరాసాగర్-రాజీవ్‌సాగర్‌ల మంజూరు). ప్రస్తుత శాంక్షన్లలో చాలా భాగం పేమెంట్లు కూడా చెల్లించేసినట్లు తాజా డిక్లరేషన్ చెబుతున్నది. పనులు ఆలస్యమయ్యేకొద్దీ ఇంకెన్ని కోట్లు హారతి ఇవ్వాలో దానికో లెక్కాపత్రం లేదనేది ఒక అంశం కాగా.,ఖర్చు చూపిన దాంట్లో కూడా భారీ అవినీతి జరిగిందని రాష్ట్ర నీటిపారుదల మంత్రే ఆరోపించడం చూస్తుంటే ఈ పనులు ముందుకెళతాయా అనిపిస్తుంది. అవినీతి భాగోతాల సంగతిని కాస్త పక్కన పెడదాం. ఇంతటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లకు సంబంధించిన "భూసేకరణ" విషయంలో ప్రాధమిక దశలోనే అధికారులది ఎంతటి నిర్లక్ష్యమో ఈ అంశాన్ని ఇప్పటికే గతంలో వెల్లడించడం జరిగింది. కాగా ఇప్పుడు తిరిగి ఈరెండు ప్రాజెక్ట్‌ల ప్రస్తావన "ముల్కలపల్లి ఉదంతంతో" రాష్ట్రస్థాయిలో నలుగుతున్న క్రమంలో మరొక్కసారి సింహావలోకనం చేసుకుందాం.

**హైకోర్టులో ఇరిగేషన్‌కి ఎదురు దెబ్బ:** సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణాని కోసం అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లె-అశ్వాపురం- కొమ్ముగూడెం- తదితర గ్రామాల పరిధిలో 2021 సంవత్సరంలో భూసేకరణ మొదలెట్టింది. 21 మంది రైతులనుంచి 60 ఎకరాలకు పైగా ల్యాండ్ ఎక్వయిర్ చేసేందుకు గాను "ఆర్‌సినెంబర్: సి/985/2020-2021 తేది: 20.04.2021 ద్వారా" అవార్డ్ నిమిత్తం ప్రొసీడింగ్ ఇచ్చారు. కాగా "పెసాచట్టం-1996" నిబంధనలకు విరుద్ధంగా ఈ భూసేకరణ ప్రక్రియ ఉన్నదని, రిట్ పిటిషన్ నెంబర్లు: 14653-14664/2021 ల ద్వారా తెలంగాణా హైకోర్టుని రైతులు ఆశ్రయించారు. నిజానికి 2013 జాతీయ భూసేకరణ చట్టంలోని అండర్ సబ్‌సెక్షన్ (3) సెక్షన్ 41ఆఫ్ ది ల్యాండ్ ఏక్విజేషన్ ఏక్ట్-2013 ప్రకారం., అండర్‌సెక్షన్ 11(1) లో గిరిజన ప్రాంతాల్లో ఏదేని భూసేకరణ కోసం ప్రిలిమినరీ నోటీస్ ఇచ్చేముందర "పెసాచట్టం-1996" నిబంధనలు పాటించాలని ఆ రిట్‌లో పిటిషనర్లు పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా పెసా గ్రామసభలేవీ నిర్వహించకుండానే.,ఆయా సభల తీర్మానాల తంతుని గాలికొదిలి భూసేకరణ ప్రక్రియకి పూనుకున్నారని బాధితులు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రస్తావనే ఎక్కడా లేకుండా మొదలెట్టిన ఈ కార్యక్రమం చట్టరీత్యా చెల్లదని వాదించారు. దీనిపై ప్రతివాదులైన ప్రభుత్వ యంత్రాంగం తగిన ఆధారాలు చూపించలేక పోవడంతో.,హైకోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పుచెప్పింది. నిబంధనలను పాటించనందున ప్రభు త్వం జారీచేసిన "ఆర్‌సి నెంబర్: సి/985/2020-2021 తేది: 20.04.2021" ప్రొసీడింగ్‌ని న్యాయస్థానం 15.03.2023 తేదీన పక్కన పెట్టేసింది (సెటెసైడ్). ఇప్పుడు చెప్పండి., ఇంత గొప్పలు చెప్పుకు తిరిగిన నీటిపారుదల విభాగం ఈ చిన్న విషయంలోనే ఎంత తప్పటడుగు వేసిందో తాజా పర్యవసానం ప్రస్ఫుటం చేస్తున్నది

**తీర్పు తర్వాత ఏం జరిగిందో?:** హైకోర్టు తీర్పు తర్వాత పర్యవసానాలేంటో ఇప్పటికీ తెలియడం లేదు. సంబంధిత యంత్రాంగం వద్ద సమాచారం లేదు. నీటిపారుదల శాఖ వారు అప్పీల్‌కి వెళ్ళారా లేక తీర్పుని యదాతథంగా అమలు చేసేందుకు పూనుకుని సమస్యని పరిష్కరించారా అనేది సందిగ్ధం. జడ్జిమెంట్ 15.09.2023 తేదీన వచ్చింది కాబట్టి దాదాపు ఏణార్ధం పూర్తయిన ప్రస్తుత స్థితిలో ఆ రెండు రిట్ల ద్వారా కక్షిదారులు పొందిన ప్రయోజనాన్ని అధికారులు వెల్లడించాల్సిందే. ఒకవేళ మంచే జరిగి సీతమ్మసాగర్ బరేజ్ ప్రగతి ఆటంకాల్లేకుండా ముందుకు వెళితే అంతకన్నా కావలసింది ఏముంటుంది.

**అడుగడుగునా తడబాట్లే :** ఇవి బ్రహ్మాండం బద్దలయ్యే సాగునీటి ప్రాజెక్టులని సర్కార్ చెప్పుకోవడం ఏమాత్రం తప్పుకాదు. మరి తదనుగుణమైన సంకల్ప సిద్ధికూడా కావాలి కదా. కానీ చిత్తశుద్ధి ఎక్కడా మనకు కనిపించదు. ప్రధానమైన భూసేకరణ విషయంలోనే ఇంకాస్త ముందుకెళ్ళి చూస్తే యంత్రాంగపు పోకడలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మచ్చుకి కొన్ని సంఘట నలను గమనిద్దాం. 17.07.2020 తేదీన నాటి ముఖ్య మంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాస బర్వాల్ ఇరిగేషన్ ముఖ్యకార్యదర్శి రజిత్‌కు మార్‌లు అశ్వాపురం వచ్చి ఉన్నతస్థాయి సమీక్ష ఏర్పాటు చేశారు. కలెక్టర్లు-సంయుక్త కలెక్టర్లు- ఆర్‌డిఓలు-తహశీల్దార్లు-అబ్బో ఉరుకులు పరుగులు పెట్టారు. హడావిడికి కొదవలేదు. ఈ మీటింగ్‌లో తేల్చింది ఏమంటే.,"పక్షంరోజుల్లో అంటే పదిహేనురోజుల్లో" భూసేకరణ సర్వే పూర్తయిపోవాలని హుకుం జారీ చేశారు. ఆ గడువు ముగిసిపోయి తదుపరి 21.05.2021 తేదీన అంటే 10 నెల్ల తర్వాత నాటి జిల్లా కలెక్టర్ ఎంవి.రెడ్డి 3500 ఎకరాల భూసేకరణ కోసం రెండవ రివ్యూ నిర్వహించారు. అశ్వాపురం మం డలంలో 339 ఎకరాలు, మణుగూరులో 610, దుమ్ముగూడెంలో 726, చర్లలో 1446 ఎకరాల భూమిని సేకరించేందుకు ఆయన పలు సూచనలు చేశారు. ఆ తర్వాత మళ్ళీ 12.01.2022 తేదీన అంటే రెండో సమీక్ష తరువాత 8నెల్లకి అప్పటి కలెక్టర్ అనుదీప్ దీనిపై సమావేశమై అటవీ భూముల రీఎంబర్స్‌మెంట్ స్పీడప్ చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఉన్నతస్థాయి మీటిం గులెన్ని పెట్టినా., చివరికి ఎక్కడైతే గోదావరి నదివద్ద హెడ్‌వర్కుల కోసం ఉద్దేశింపబడిన ప్రాంతమున్నదో.,ఆ భూమిని సేకరించే ప్రక్రియలోనే అధికార యంత్రాంగం తప్పులో కాలేయడంతో ఇంతటి ఉన్నతస్థాయి సమీక్షలు సైతం ఈ చిన్న పనులను కూడా చేసుకోలేక చతికిల పడినట్లయింది.

## మహిళల గ్రాండ్‌ప్రిక్స్‌లో..
# రెండో రోజూ దివ్య విజయ పరంపర



**న్యూఢిల్లీ:** పూణేలో జరిగిన ఎఫ్ఐడిఇ మహిళల గ్రాండ్ ప్రిక్స్‌లో రెండో రోజు ఐఎం దివ్య దేశ్‌ముఖ్ తన విజయ పరంపరను కొనసాగించింది. దివ్య మరియు చైనాకు చెందిన ఝు జైనర్ మాత్రమే నిర్ణయాత్మక మ్యాచ్‌లకు అర్హత సాధించారు. ఐదు ఆటల్లో మూడు డ్రాగా ముగిశాయి. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ ప్రత్యర్థులతో ఆడిన మ్యాచ్‌లో డ్రాగా ముగించారు. ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచిన హంపి, జార్జియా గ్రాండ్ మాస్టర్ మెలియా సలోమ్‌ను ఓడించగా, హారిక ఐఎమ్ అలీనా కాష్లిన్‌స్కయాతో డ్రాగా ముగించారు. తెల్ల పావులతో ఆడుతున్న దివ్య, గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్ బాబుపై విజయం సాధించడానికి కేవలం 26 ఎత్తుగడలు మాత్రమే అవసరం అయింది. మొత్తం భారతదేశ పోటీలో, దివ్య దూకుడుగా ఆడింది. 17వ మూవ్ నుండి 22వ మూవ్ వరకు వైశాలిపై ఒత్తిడి తెచ్చింది. డబ్ల్యూజిపి సిరీస్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారు ఎఫ్ఐడిఇ ఉమెన్ క్యాండిడేట్స్ టోర్నమెంట్ 2026కి చేరుకుంటారు. ఇప్పటివరకు, రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గోరియాచ్కినా 308 పాయింట్లతో గ్రాండ్ ప్రిక్స్ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో ఉంది. పోటీలో ఉన్న భారతీయులలో, హంపి మహిళల గ్రాండ్ ప్రిక్స్ స్టాండింగ్స్‌లో రెండు ఈవెంట్ల నుండి 161 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. హారిక (12వ స్థానం), దివ్య (14వ స్థానం) మరియు వైశాలి (18వ స్థానం) కూడా తమ ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకోవడానికి పాయింట్లు సేకరించాలని చూస్తున్నారు.

## ఆస్ట్రేలియా పర్యటనకు భారత్ హాకీ
# అమ్మాయిల టీమ్ ఖరారు



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలో పర్యటించేందుకు గాను భారత్ మహిళల హాకీ జట్టు ఖరారైంది. ఈ నెల 21 నుండి జరగనున్న ఈ మ్యాచ్‌కు 26 మంది సభ్యులతో కూడిన భారత్ బృందానికి సలీమా టెటె కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ జట్టులో తొలిసారి కొత్తగా ఐదుగురు ఆటగాళ్లకు చోటు దొరికింది. వీరిలో జ్యోతి సింగ్, సుజాత కుజుర్, అజ్మీనా కుజుర్, పూజా యాదవ్, మమిమా టెటె తొలిసారి భారత్ సీనియర్ హాకీ జట్టులోకి వచ్చారు.. బన్సారీ సోలంకి, అంజన డుంగేడుంగ్, లాల్ థంట్లాంగే, సాక్షి శుక్ల, ఖైదెమ్ షిలీమ్ చాను, దీపి మోనికా టొప్పో, సోనమ్‌లను స్టాండ్ బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు. ఈ నెల 21 నుండి మే 4వ తేదీ వరకూ జరిగే ఈ టోర్నమెంట్‌లో భారత్ జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఇక భారత్ మహిళల హాకీ జట్టులో సలీమా టెటె (కెప్టెన్), సవితా పూనియా, బిచ్చూ దేది ఖరబమ్ (గోల్ కీపర్లు), జ్యోతి సింగ్, ఇషికా చౌదరి, సుశీలా చాను, సుజాత కుజుర్, సుమన్ దేవి తోడమ్, జ్యోతి, అజ్మీరా కుజుర్, సాక్షి రాణా (డిఫెండర్లు), వైష్ణవి ఫాలేక, నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్ సునెలిటా టొప్పో, మహిమా టెటె, పూజా యాదవ్, లాల్‌రెమ్‌నియామి (మిడ్ ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, దీపికి, రుతుజా పిసాల్, ముంతాజ్ ఖాన్, బల్జీత్ కౌర్, దీపిక సొరెంగ్, బ్యూటీ డుంగ్‌డుంగ్‌లు ఉన్నారు.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు
# క్రాస్టో-కపిల జోడీ
### పడిపోయిన సింధు, లక్ష్యసేన్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్‌లో భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ బెస్ట్ ర్యాంకుకు దూసుకొచ్చింది. ఫెడరేషన్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట కెరీర్‌లో అత్యుత్తమ 17వ స్థానానికి ఎగబాకింది. గత వారం జరిగిన 2025 బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో క్రాస్టో మరియు కపిల క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న తర్వాత ఈ పరిణామం జరిగింది. దీంతో ఈ జంట తమ స్థానాన్ని ఒక స్థానం మెరుగు పరుచుకుని ఇప్పుడు 13 టోర్నమెంట్లలో 46,229 పాయింట్లతో ఉన్నారు. మరోవైపు గాయాల కారణంగా బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌కు దూరమైన భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తాజా ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పడిపోయారు. ట్రీసా-గాయత్రి ప్రపంచంలో 10వ స్థానంలో ఉండగా, సాత్విక్-చిరాగ్ ఇప్పుడు 11వ స్థానంలో ఉన్నారు. ఇక సింగిల్స్‌లో టాప్ 10లో భారత్ ప్లేయర్లు ఎవరూ లేకపోవడంతో, ప్రపంచంలో టాప్ 10లో స్థానం సంపాదించిన ఏకైక షట్లర్లుగా ట్రీసా-గాయత్రి జోడీ రికార్డు సాధించారు. నిజానికి, మొదటిసారి భారతదేశంలో అత్యధిక ర్యాంక్ పొందిన ముగ్గురు షట్లర్లు డబుల్స్‌లోనే ఉన్నారు. కాగా దేశం నుండి అత్యధిక ర్యాంక్ పొందిన సింగిల్స్ షట్లర్లు లక్ష్య సేన్ మరియు పివి సింధు, ఇద్దరూ పురుషులు మరియు మహిళల విభాగాలలో వరుసగా 18వ స్థానంలో ఉన్నారు. 2025 బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో సేన్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించడంతో రెండు స్థానాలు పడిపోయగా, రెండవ రౌండ్‌కు చేరుకున్న తర్వాత సింధు ఒక స్థానాన్ని వదులుకుంది. హెచ్ఎస్ ప్రణయ్ కూడా ఒక స్థానం దిగజారి ఇప్పుడు పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ ర్యాంక్ 30లో ఉన్నాడు. అయితే యువ ప్రియాంషు రాజవత్ మరియు కిరణ్ జార్జ్ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సానుకూల పురోగతి సాధించారు. రాజావత్ రెండు స్థానాలు ఎగబాకి 36వ స్థానంలో ఉండగా, కిరణ్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఇప్పుడు 35వ స్థానంలో ఉన్నాడు.






# మారిన ఆట
## రికార్డులు తారుమారు
### ఐపిఎల్‌లో టాపర్స్ ఛేంజింగ్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఎవరూ ఊహించని జట్లు ఈ సీజన్‌లో దూసుకుపోతున్నాయి. ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ ఐదు స్లార్లు ట్రోఫీ నెగ్గిన టీమ్స్ మాత్రం ఐపీఎల్ టేబుల్‌లో చివరికి చేరాయి. అయితే తాజాగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ టాపర్స్ లిస్ట్‌లో పెనుమార్పులు వచ్చాయి. ఐపీఎల్ 2025లో నిన్నటి వరకు జరిగిన మ్యాచ్‌ల ప్రకారం చూసుకుంటే అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో కొత్త ప్లేయర్స్ వచ్చి చేరారు. దీంతో పాటు ఎక్కువ పరుగులు, ఎక్కువ సిక్సర్స్, ఫోర్స్ కొట్టిన వారి జాబితాలో కూడా మార్పులు వచ్చాయి. అటువంటి వాటిలో ఐపీఎల్ 2025లో ఎక్కువ రన్స్ చేసిన వారి జాబితాలో ప్రస్తుతం లక్నో ప్లేయర్ నికోలస్ పురాన్ టాప్ రన్ స్కోరర్‌గా ఉన్నారు. 6 మ్యాచ్‌లలో 349 రన్స్, 215.43 స్ట్రైక్ రేట్‌లో టాప్‌లో ఉన్నాడు. అతని స్థిరమైన బ్యాటింగ్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 బంతుల్లో 87 చేసి నాటౌట్‌గా నిలవడం అతన్ని ఆరెంజ్ క్యాప్ రేసులో ముందంజలో ఉంచింది. ఇక 329 పరుగులతో గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ సాయి సుదర్శన్ రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక 265 పరుగులతో లక్నో ప్లేయర్ మిచెల్‌మార్ష్ 3వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆ తర్వాతి ర్యాంకుల్లో సన్‌రైజర్స్ ప్లేయర్ హెడ్ ఉండగా, తాజా మ్యాచ్‌లో పంజాబ్‌పై 40 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ అభిషేక్ శర్మ రన్‌స్కోరర్స్ లిస్ట్‌లో పైకి దూసుకొచ్చాడు. ఇక ఈ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన వారి జీబితా చూసుకుంటే ఐపీఎల్ పాయింట్ల పట్టికలో లాస్ట్ ప్లేస్‌లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ నూర్ అహ్మద్ ఎక్కువ వికెట్లు తీసిన జాబితాలో మాత్రం ముందున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచుల్లో 12 వికెట్లు తీసిన నూర్ అహ్మద్ టాప్ ప్లేస్‌లోకి వచ్చాడు. తర్వాత 11 వికెట్లతో లక్నో ప్లేయర్ శార్దూల్ ఠాకూర్ రెండో ప్లేస్‌లో ఉండగా, 10 వికెట్లతో గుజరాత్ ప్లేయర్ ప్రదీప్ కృష్ణ 3వ స్థానంలో ఉన్నాడు. కాగా ఈ సీజన్‌లో అత్యధిక సిక్సర్ కొట్టిన జాబితాను చూసుకుంటే ఇందులోనూ టాప్ స్కోరర్ నికోలస్ పూరన్ ఏ టాప్‌లో ఉన్నాడు. ఈ సీజన్ మొత్తం పూరన్ 31 సిక్సర్లు కొట్టాడు. ఇక రెండో ప్లేస్‌లో పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఉన్నాడు.

ఇతను ఈ సీజన్ మొత్తంలో ఇప్పటి వరకు 20 సిక్సర్స్ కొట్టాడు. ఆ తర్వాత స్థానంలో 15 సిక్సర్లతో లక్నో ప్లేయర్ మిచేల్ మార్ష్ ఉన్నాడు. ఇక ఐపీఎల్ 2025లో ఎక్కువ బౌండరీలు కొట్టిన వారి జాబితా చూసుకుంటే. ఈ కేటగిరీలో గుజరాత్ ప్లేయర్ సాయి సుదర్శన్ టాప్‌లో ఉన్నారు. ఇతను ఈ సీజన్ మొత్తంలో 31 బౌండరీలు కొట్టాడు. ఆ తర్వాత 30 బౌండరీలతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ట్రావిస్ హెడ్ రెండో ప్లేస్ లో ఉన్నాడు. ఇక 28 బౌండరీలతో లక్నో ప్లేయర్ మిచేల్ మార్ష్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.

## వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్‌లో..
# బంగ్లా హ్యాట్రిక్ విజయం
### 34 పరుగుల తేడాతో స్కాట్లాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. లాహోర్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన పోరులో బంగ్లాదేశ్ 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 276 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, కెప్టెన్ నిగార్ సుల్తానా 59 బంతుల్లో 83 పరుగులు, 11 ఫోర్లతో అజేయ అర్ధ శతకం చేసి



ఆకట్టుకుంది. ఇక మిగిలిన బ్యాటర్లు ఫర్జానా 57 పరుగులు, 6 ఫోర్లు, షర్మిన్ అక్తర్ 57 పరుగులు, 7 ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీలతో పరుగుల వరద పారించారు. స్కాట్లాండ్ బౌలర్లలో క్యాథరిన్ బ్రైస్ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం 277 పరుగుల లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ మహిళల జట్టు పట్టుదలతో పోరాట పటిమను ప్రదర్శించింది. అయినా ఓటమి తప్పలేదు. స్కాట్లాండ్ మహిళల జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 242 పరుగులకే పరిమితమై ఆటను ముగించింది. ప్రియనాజ్ 63 బంతుల్లో 61 పరుగులు, 7 ఫోర్లు, రాచెల్ 73 బంతుల్లో 61 పరుగులు, 5 ఫోర్లతో నాటౌట్‌గా రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా 4 వికెట్లు, జన్నతుల్ 2 వికెట్లు తీశారు. కాగా.ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బంగ్లాదేశ్ 6 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే టోర్నమెంట్‌కు సంబంధించి జరిగిన మరో మ్యాచ్‌లో ఐర్లాండ్ 46 పరుగుల తేడాతో థాయ్‌లాండ్ జట్టుపై గెలుపొందింది.

# చైనాపై 245% అమెరికా సుంకాలు!

## వాణిజ్యం



**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** అమెరికా -చైనా మధ్య వాణిజ్యపరంగా తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ తరుణంలో చైనాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై యూఎస్ సుంకాలను 245 శాతం పెంచే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. చైనా ప్రతీకార చర్యల ఫలితంగా ఆ దేశ ఉత్పత్తులు ఆ స్థాయి వరకు సుంకాన్ని ఎదుర్కోవచ్చని వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌ను ఉటంకించాయి. అయితే ఇంత భారీగా టారిఫ్‌ల పెంపు ఉన్నప్పుడు ట్రంప్ మీడియా ఎదుట ప్రకటన చేస్తుంటారు. అయితే ఈసారి అలాంటి హడావుడి ఏదీ కనిపించలేదు. అమెరికా 145 శాతం నుంచి 245 శాతానికి నిజంగానే సుంకాలు పెంచిందా లేక టైపింగ్ తప్పిదమా..? పలువురు నెటిజన్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వస్తోన్న వార్తలపై డ్రాగన్ స్పందించింది. అసలు సుంకాలు ఎంత అనే విషయాన్ని అమెరికానే అడగాలని విదేశాంగ శాఖ కౌంటర్ ఇచ్చింది. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు. మా దేశం ఇలాంటి యుద్ధాలు చేయాలని కోరుకోవడం లేదు. అలాగే వాటికి భయపడటం లేదు అని తేల్చిచెప్పింది. ఇప్పటికే అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న ఉత్పత్తులపై చైనా 125 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసిన విషయం విదితమే. ఇదంతా ఒకనంబర్ గేమ్‌గా అభి వర్ణించిన చైనా.. ఈ తతంగమంతాఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన మన సూచీలు.. తర్వాత రాణించాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడంతో మున్ముందు ఆర్‌బీఐ రెపో రేటును మరింత తగ్గించొచ్చన్న అంచనాలు బ్యాంక్ స్టాక్స్ రాణించడానికి కారణమయ్యాయి. మరో వైపు అమెరికా-చైనా వాణిజ్యంపై అనిశ్చితి నెలకొనడంతో ఇతర ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76,996.78 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై, తర్వాత ఫ్లాట్‌గానే కదలాడింది. ఇంట్రాడేలో 77,110.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి, చివరికి 309.40 పాయింట్ల లాభంతో 7,044.29 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 119.05 పాయింట్ల లాభంలో 23,447.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.67గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్



బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్ టెల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర మరింత పెరిగింది. ఔన్సు 3,300 ఔన్సు డాలర్లు దాటి 3,317 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బోయింగ్‌పై చైనా నిర్ణయం భారత్‌కు మేలు?

**ముంబై, ఏప్రిల్ 16:** బోయింగ్ విమానాల డెలివరీలను స్వీకరించకూడదంటూ తమ దేశ సంస్థలను చైనా ఆదేశించడం భారత్‌కు కలిసొచ్చేలా ఉంది. ఇప్పటికే పంపిణీ వ్యవస్థల్లోని ఇబ్బందుల వల్ల భారత్‌లోని వైమానిక రంగ సంస్థలు విమానాల కొరతతో ఇబ్బందిపడుతున్న వేళ.. బీజింగ్ నిర్ణయం సరికొత్త ఆశలు రేపుతోంది. ప్రస్తుతం చైనా సంస్థలు 100 బోయింగ్ బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇదే మోడల్‌ను భారత్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఆకాశ్ ఎయిర్ సంస్థలు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చాయి. వీటితోపాటు 11 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లను కూడా ఎయిర్ ఇండియా ఇప్పటికే ఆర్డర్ పెట్టింది. ఈ నేపథ్యంలో చైనాకు డెలివరీకి సిద్ధమైన వాటిల్లో కొన్ని విమానాలు భారత్‌లోని కస్టమర్లకు మళ్లించవచ్చని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది కూడా బోయింగ్ విషయంలో ఇలానే జరిగింది. ఒకరికని తయారుచేసిన రెండు విమానాలను చివరికి ఎయిర్ ఇండియా, ఆకాశ్‌లకు డెలివరీ చేయాల్సి వచ్చిందన్నారు. ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మొత్తం గతేడాది 25బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరో 25 విమానాల కోసం షెడ్యూల్ చేసింది. తాజాగా అమెరికాచైనా ట్రేడ్ వార్ నేపథ్యంలో అదనపు డెలివరీలను భారతీయ సంస్థలు పొందే అవకాశం ఉంది. ఇక ఇప్పటికే చైనా కోసం మ్యాక్స్ విమానాలను ఉత్పత్తి చేసేందుకు సియాటెల్‌లో అసెంబ్లీ యూనిట్‌లో ఏర్పాటుచేసిన అదనపు సామర్థ్యం మొత్తం నిరుపయోగంగా మిగిలిపోనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలు చైనా కోసం తయారుచేసిన విమానాలను, ఈ సంస్థలు ప్రత్యేకంగా ఆర్డర్ చేసిన లోహ విహంగాలను అందు కోనున్నాయి. మరోవైపు బోయింగ్‌కు ప్రత్యర్థి అయిన ఎయిర్‌బస్ సంస్థ రెండు అసెంబ్లింగ్ లైన్లను నిర్వహిస్తోంది. వీటిల్లో ఏ320 రకాలను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు విమానాల డెలివరీలను పెంచాలని బీజింగ్ ఈ సంస్థను కోరనుంది. ఇంతకాలం బోయింగ్ విమానాల డెలివరీల్లో జాప్యం ఆకాశ్ ఎయిర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఆ సంస్థ ప్రస్తుతం, తమ సమీప భవిష్యత్తు అవసరాలకు మించి పైలట్లను నియమించుకొంది. దీంతో కొంత మేరకు సిబ్బందికి పని లేకుండా పోతోంది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలకు అదనపు విమానాలను కొనుగోలు చేయగల ఆర్థిక సామర్థ్యం ఉంది.




## లగ్జరీ బ్రాండ్ల మోసాన్ని బయటపెట్టిన చైనీయులు..

**చైనా, ఏప్రిల్ 16:** ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజు రోజుకీ తారాస్థాయికి చేరుతోంది. ఒక దేశంపై మరో దేశం భారీగా సుంకాలు విధించుకుంటూ తగ్గేదేలే అంటున్నాయి. అయితే తయారీ రంగానికి పెద్దన్నగా ఉన్న చైనా నుంచి అమెరికన్లకు పెద్ద ఎత్తున వస్తువులు ఎగుమతి అవుతాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో అమెరికా బ్రాండ్లపై చైనా జోరుగా ట్రోల్స్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ట్రోల్స్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోన్నాయి. టారిఫ్‌లు పెంచడంతో ధరలు కూడా భారీగా పెరుగుతాయి. తక్కువ ధరకు లభించే వస్తువు కూడా రెట్టింపు ధర చెల్లించి కొనాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే చైనీయులు అమెరికన్ బ్రాండ్ల ధరల అసలు మతలబుని బయటపెడుతున్నారు. చైనాలో తక్కువ ధరకే లగ్జరీ వస్తువులు తయారవుతున్నాయని, కానీ అమెరికాలో అవే వస్తువులు ఖరీదైన ధరలకు అమ్ముడవుతున్నాయని వెల్లడిస్తున్నారు. ఉదాహరణకు వెయ్యి డాలర్ల విలువైన వస్తువు అమెరికాలో 38వేల డాలర్లకు అమ్ముడవుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై చైనీయులు పలు విడియోలు రూపొందించారు. అలాగే ట్రంప్ నినాదం 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్'ని వ్యంగ్యంగా చూపిస్తూ విడియోలు చేస్తున్నారు.



## ఎన్‌సిఎస్ పోర్టల్‌తో స్విగ్గీ జోడి..

**ముంబై, ఏప్రిల్ 16:** దేశంలోనే అతి పెద్ద ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంలలో ఒకటైన స్విగ్గీతో కేంద్రకార్మిక, ఉపాధిమంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా ఉపాధి అవకాశాలను బలోపేతం చేసే విస్తృత చొరవలో భాగంగా ఈ అవగాహనా ఒప్పందం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 500కి పైగా నగరాల్లో స్విగ్గీ సేవలు అందిస్తుంది. పలు రంగాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధిని సృష్టించడంలో స్విగ్గీ కీలక పాత్ర పోషిస్తోంది. దాదాపు 5 కోట్ల ఉద్యోగాలు ఈ ప్లాట్‌ఫామ్ అందిస్తుంది. లేబర్ మార్కెట్‌లో డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించడానికి మంత్రిత్వ శాఖ ప్రైవేట్ ఏజెన్సీలతో కుదుర్చు కుంటున్న ఒప్పందాల శ్రేణిలో భాగంగా ఈ అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిపై కేంద్ర కార్మిక, పర్యావరణ మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ఉద్యోగార్థులకు సింగిల్‌విండో వ్యవస్థగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 31 కోట్లకుపైగా వ్యక్తుల డేటా ఇందులో ఉంది. కంపెనీల యజమానులు బాహ్యంగా ఉద్యోగ ప్రకటనలు చేయాల్సిన అవసరం లేకుండా లేబర్ కోసం ఇందులో నేరుగా ఎంపికలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది. ఎన్‌సిఎస్ పోర్టల్ నియామక ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు సమగ్ర వేదికగా పనిచేస్తుందని మంత్రి మాండవీయ పేర్కొన్నారు. ఆయా కంపెనీల యజమానులు ఎన్‌సిఎల్ పోర్టల్‌ను యాక్సెస్ చేయవచ్చు. తద్వారా వారికి అవసరమైన అర్హతకలిగిన అభ్యర్థులను తక్షణమే గుర్తించడానికి అవకాశంఉంటుంది. ఇది దేశంలో ఉద్యోగ ఎంపికలు, నియామకాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని ఆయన అన్నారు. రాబోయే రెండు మూడు సంవత్సరాలలో స్విగ్గీ ఒక్కటే 10నుంచి 12లక్షల కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని అంచనా వేశారు. ఇలాంటి అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడానికి మరిన్ని సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎన్‌సిఎస్‌పోర్టల్ ప్రముఖ వేదికగా మారుతుందని, లక్షలాదిమంది యువతకు ఉపాధిని అందిస్తూనే యజమానులు తమ శ్రామికశక్తి అవసరాలను తీర్చడంలో ఈ పోర్టల్ సహాయపడుతుందని మంత్రి మాండవీయ తెలిపారు.




## 'ఎక్స్'కు పోటీగా ఓపెన్‌ఎఐ సోషల్ మీడియా..

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** చాట్‌జీపీటీ మాతృ సంస్థ ఓపెన్‌ఏఐ త్వరలో సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను తీసుకురావాలని చూస్తోంది. ఎక్స్ లాంటి సామాజిక మాధ్యమ వేదికను పరిచయం చేయాలని చూస్తోందని సమాచారం. దీనికోసం ఇప్పటికే కసరత్తులు మొదలయ్యాయి. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఓపెన్‌ఎఐ కొత్త సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని తెలుస్తోంది. కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఈ ప్రాజెక్ట్ కోసం బయటివ్యక్తుల నుంచి అభిప్రాయాల్ని ప్రైవేట్‌గా కోరుతున్నట్లు సమాచారం. అయితే ఈ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను స్వతంత్రంగా తీసుకొస్తారా? లేదా చాట్‌జీపీటీలో విలీనం చేస్తారా? అనే విషయం తెలియలేదు. శామ్ ఆల్ట్‌మన్, ఎలాన్ మస్క్‌ల మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్న సంగతి తెలిసిందే. లాభాపేక్ష లేని సంస్థను తీర్చిదిద్దుతామని చెప్పి మాట తప్పారంటూ శామ్ ఆల్ట్‌మన్‌పై విమర్శలు చేసిన మస్క్, ఈ వ్యవహారంలో దావా కూడా వేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌కు పోటీగా కొత్త వేదికను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps